
epaper.vaartha.com WWW.VAARTHA.COM
తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
14-8-2025 గురువారం సంపుటి: 31 సంచిక: 194 పేజీలు: 8+16 వెల: 6.50
ఖమ్మం
: fb.com/vaartha Digital
Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



బుధవారం సాగర్ 24 గేట్లు తెరిచిన దృశ్యం

## 'సాగర్' 24 గేట్లు ఎత్తివేత
### ఏడు గేట్లు ఎత్తిన శ్రీశైలం
### ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు
### అలుగుపారుతున్న చెరువులు

**హైదరాబాద్,ఆగస్టు 13,ప్రభాతవార్త:** కృష్ణానది పరివాహకంలో ప్రాజెక్టులలో నీటివరద వచ్చిచేరుతోంది. నాగార్జున సాగర్ ప్రాజెక్టులో 24 గేట్లు ఎత్తి నీటి విడుదల చేస్తున్నారు. ఇన్‌ఫ్లో 1,74,533 క్యూసెక్కులుగా ఉంటే ఔట్‌ఫ్లో 2,33,041 క్యూసెక్కులుగా ఉంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా ప్రస్తుతం 589.30గా ఉంది. పూర్తి నీటి నిల్వ సామర్థం 312.04 టీఎంసీలు కాగా నీటినిల్వ 308.59 టిఎంసిల నీరు ఉంది. శ్రీశైలం ప్రాజెక్టు ఇన్‌ఫ్లో 2,10,286 క్యూసెక్కులు ఉండగా శ్రీశైలం నుంచి ఔట్‌ఫ్లో 2,09,533 క్యూసెక్కులుగా ఉంది. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి 35 వేల క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు. ఎడమ గట్టు విద్యుత్ కేంద్రం నుంచి 35,315 >>2


హైదరాబాద్ సనత్‌నగర్‌లో రహదారి చెరువులో బస్సు

## కన్నెపల్లిలో 23 సెం.మీ

**హైదరాబాద్,ఆగస్టు 13,ప్రభాతవార్త:** బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో తెలంగాణ పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి దీనితో ప్రాజెక్టులు,చెరువులు కుంటలలోకి నీరు వచ్చిచేరుతోంది. వాతావరణ శాఖ తెలంగాణ అంతటికీ గురువారం రెడ్ అలర్ట్ జారీ చేసింది. సంగారెడ్డి, మెదక్, వికారాబాద్, మేడ్చల్, యాదాద్రి భువనగిరి, ఖమ్మం, భద్రాద్రి కొత్త గూడెం, భూపాలపల్లి, ములుగు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీచేశారు.హైదరాబాద్, హనుమకొండ, >>2

# దారులన్నీ గోదారులే..
## జల విలయం
### ఎడతెగని భారీ వర్షాలతో నగరాలన్నీ సాగరాలే..
### వరద ముంపుతో కకావికలం
### అన్ని ప్రాంతాల్లో 10 నుంచి 25 సెం.మీ వర్షపాతం
### స్కూళ్లు, ఆఫీసులు బంద్.. స్తంభించిన జనజీవనం
### వచ్చే 24 గంటల్లో అతి భారీ వర్షాలు


వరంగల్లులో రహదారులపై భారీగా చేరిన వరద నీటిలోనే బుధవారం రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు13:** బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ప్రభావంతో తెలంగాణ రాష్ట్ర జిల్లాల్లోనూ వరుణదేవుడు తీవ్ర ప్రతాపం చూపిస్తున్నాడు. జోరు వానలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీవర్షాలతో చెరువులు అలుగుపారుతున్నాయి. మరో రెండురోజులు వర్షాలున్నాయనే వాతావరణశాఖ హెచ్చరికలతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ప్రాజెక్టుల వద్ద ప్రవాహం ఉధృతిగా ఉన్నందున వాగుల్లోకి చేపల వేట, పశువులు మేపేందుకు వెళ్లొద్దని అధికారులు సూచిస్తున్నారు. ఇప్పటి వరకు అత్యధికంగా సూర్యాపేట జిల్లాలోని మోతె మండలంలో మామిల్లగూడెంలో 100.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. రాష్ట్రంలో పలు జిల్లాల్లో వర్షాలు దంచికొడుతున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాను >>2


హనుమకొండలో నీటమునిగిన వీధులు

### కంచ గచ్చిబౌలి భూముల్లో
## పర్యావరణం భేష్
### -సుప్రీం కోర్టు



**హైదరాబాద్,ఆగస్టు 13 ప్రభాతవార్త:** కంచ గచ్చిబౌలి భూముల్లో పర్యావరణ పరిరక్షణ చర్యల విషయంలో తెలంగాణ ప్రభుత్వ ప్రతిపాదనలను స్వాగతిస్తున్నామని సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని పర్యావరణ పరిరక్షణ కూడా పరిగణలోకి తీసుకోవాలని సీజేఐ ధర్మాసనం పేర్కొంది. సంచలనం సృష్టించిన కంచెగచ్చిబౌలి భూముల అంశంపై బుధవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ భూముల్లో పర్యావరణ పరిరక్షణ చర్యలపై గతంలోనే తెలంగాణ ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేసింది. తాజాగా ఈ భూముల అభివృద్ధి కోసం సమగ్ర ప్రణాళికలను తయారు చేస్తున్నట్లు కోర్టుకు తెలిపింది. ప్రభుత్వ ప్రతిపాదనలు పరిశీలించిన సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఖపర్యావరణం, వన్యప్రాణుల రక్షణకోసం చర్యలు తీసుకోవాలి. పర్యావరణం కోసం రాష్ట్రం చేస్తున్న చర్యలను అభినందిస్తున్నాం.అభివృద్ధికి మేం వ్యతిరేకం కాదు.. పర్యావరణాన్ని సమతుల్యం చెయ్యాలి. పర్యావరణాన్ని కాపాడేందుకు సరైన ప్రతిపాదనలను సిద్ధం చేయండి. పర్యావరణాన్ని కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం సరైన చర్యలు తీసుకుంటే.. అన్ని ఫిర్యాదులను ఉపసంహరిస్తాం. నా రిటైర్మెంట్ లోపల వీటన్నింటికీ పరిష్కారం చూపాలి అని వ్యాఖ్యలు చేశారు. అయితే సమగ్ర ప్రణాళికను అందించేందుకు 6 వారాలు సమయం కావాలని రాష్ట్ర ప్రభుత్వ తరపు న్యాయవాది అభిషేక్ సింగ్వి కోర్టును కోరగా ఇందుకు న్యాస్థానం అంగీకరించింది. తదుపరి విచారణ ఆరు వారాలకు వాయిదా వేసింది.



### ఎమ్మెల్సీలుగా కోదండరాం, అలీఖాన్
## నియామకంపై స్టే
### 'సుప్రీం' సంచలన తీర్పు
### గవర్నర్ కోటాలో వారిని నియమించిన రేవంత్ సర్కార్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు12:** ఎమ్మెల్సీల నియామకాలపై సుప్రీంకోర్టు బుధవారం కీలక తీర్పును వెలువరించింది. ప్రొఫెసర్ కోదండరామ్, జర్నలిస్ట్ అమీర్ అలీ ఖాన్ ఎమ్మెల్సీలుగా నియామకాలపై సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు స్టే విధించింది. గవర్నర్ కోటాలో వీరిద్దరినీ ఎమ్మెల్సీలుగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నామినేట్ చేసింది. ఈ నియామకాలను సవాల్ చేస్తూ బీఆర్ఎస్ అప్పటి ఎమ్మెల్సీ అభ్యర్థులు నేత దాసోజు శ్రవణ్, సత్యనారాయణ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు ఆయా పిటీషన్లపై బుధవారం విచారణ జరిపిన సుప్రీంకోర్టు జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహత ధర్మాసనం ఈ సంచలన తీర్పును వెలువరించింది. ఎమ్మెల్సీలుగా కోదండరామ్, అలీఖాన్ ప్రమాణ స్వీకారాన్ని తప్పుపట్టింది.ఎమ్మెల్సీ స్థానాలలో తాజా నామినేషన్లు తమ తుది తీర్పుకి లోబడే ఉంటాయని సుప్రీంకోర్టు చెప్పుకొచ్చింది. కోదండరాం, అలీఖాన్‌లు గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా నియామకం కావడాన్ని ప్రశ్నిస్తూ వారి నియామకం అక్రమంగా జరిగిందని.. దాసోజు శ్రవణ్, సత్యనారాయణలు గవర్నర్‌కు తెలిపారు. గవర్నర్ వీరి వాదనను తిరస్కరించడంతో.. ఎమ్మెల్సీలుగా కోదండరాం, అమీర్‌అలీఖాన్ నియామకాలను సవాల్‌చేస్తూ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్లపై విచారణ జరిపిన సుప్రీం కోర్టు బుధవారం తీర్పును వెలువరించింది. తదుపరి ఉత్తర్వులకు అనుగుణంగా >>2

## ఈ నెలలోనే ఇందిరమ్మ ఇళ్లు
### భూధార్ నంబర్ల కేటాయింపునకు ప్రణాళికలు
### మ్యుటేషన్ల ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలి
### మరిన్ని సౌకర్యాలతో సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులు
### రెవెన్యూ, గృహ నిర్మాణ సమీక్షలో సిఎం రేవంత్


బుధవారం హైదరాబాద్‌లో రెవెన్యూ, గృహ నిర్మాణ సమీక్షలో మాట్లాడుతున్న సిఎం రేవంత్. చిత్రంలో మంత్రి పొంగులేటి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు13:** రాష్ట్రవ్యాప్తంగా భూములకు భూధార్ నెంబర్ల కేటాయింపునకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖలపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి బుధవారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ సదస్సుల్లో వారసత్వ, ఇతర మ్యుటేషన్లకు సంబంధించి స్వీకరించిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని సీఎం సూచించారు. లైసెన్డ్ సర్వేయర్లు సర్వే చేసిన అనంతరం రెగ్యులర్ సర్వేయర్లు వాటిని స్క్రూటినీ చేసేలా చూడాలని ఆదేశించారు. కోర్ అర్బన్ ఏరియాలో నూతనంగా నిర్మించనున్న 10 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నమూనాలను సీఎం పరిశీలించారు. ప్రతి కార్యాలయంలో పార్కింగ్, క్యాంటీన్, ఇతర మౌలిక వసతులు ఉండాలని.... కార్యాయాలూ పూర్తిగా ప్రజలకు స్నేహపూర్వక వాతావరణంలో... సౌకర్యవంతంగా ఉండేలా చూడాలని సీఎం సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో పెద్ద సంఖ్యలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పూర్తయిందని అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఈనెలాఖరులోగా ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి వారికి సూచించారు. హైదరాబాద్ నగరంలోని హౌసింగ్ బోర్డుతో జాయింట్ వెంచర్‌గా ఉన్న ప్రాజెక్టుల్లోని సమస్యలను త్వరగా పరిష్కరించాలని సీఎం అధికారులకు సూచించారు. సమీక్షలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీఎం ముఖ్య కార్యదర్శులు వి.శేషాద్రి, కె.ఎస్.శ్రీనివాసరాజు, సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్, సీసీఎల్ఏ కార్యదర్శి డి.ఎస్.లోకేశ్ కుమార్, రిజిస్ట్రేషన్లు, స్టాంపుల ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు, గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి వి.పి.గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

## మంచు లక్ష్మిని ప్రశ్నించిన ఇడి
7
### బెట్టింగ్ యాప్ గోల్‌మాల్
ఢిల్లీలో ఇడి ఎదుట హాజరైన క్రికెటర్ సురేష్ రైనా

## ఓట్ల దొంగలు గద్దె దిగండి
### మూడు దశలలో ఉద్యమం
### 24 నుంచి జనహిత రెండో విడత పాదయాత్ర
### పిసిసి చీఫ్ మహేష్ గౌడ్, ఇన్‌చార్జి మీనాక్షి



**హైదరాబాద్, ఆగస్టు 13,ప్రభాతవార్త:** ఓట్ల దొంగలు గద్దె దిగండి అంటూ మూడు దశల్లో దేశవ్యాప్తంగా చేపట్టిన ఉద్యమం తెలంగాణలో కాంగ్రెస్ శ్రేణులు విజవంతం చేయాలని టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్,ఎఐసిసి కార్యదర్శ తెలంగాణ ఇంచార్జీ మీనాక్షి నటరాజన్ పిలుపు నిచ్చారు. టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన బుధవారం జూమ్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎఐసిసి ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ జిల్లా ఇంచార్జ్ లు మంత్రి పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లతోపాటుడిసిసిలు, జిల్లా ఇంచార్జులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ ఆగస్టు 14న రాత్రి 8 గంటలకు దేశ వ్యాప్తంగా జిల్లా కేంద్రాలలో మాస్ క్యాండిల్ ర్యాలీతో ప్రదర్శన జరుపాలని నిర్ధేశించారు. స్థానికంగా ఉన్న ఎంపిలు ఎమ్మెల్యేలు, రాష్ట్ర, డిసిసి కార్యవర్గం,ఎమ్మెల్సీలు, అనుబంధ సంఘాల నాయకులు, బ్లాక్ మండల అధ్యక్షులు అన్ని విభాగాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొనాలని తెలిపారు. ఆగస్టు 22 నుంచి సెప్టెంబర్ 7వరకు రాష్ట్ర వ్యాప్తంగా భారీ ప్రదర్శనలతో ఓట్ల చోరిపై ప్రజలకు చైతన్యం తేవాలని అన్నారు.రాష్ట్ర స్థాయి లో రాష్ట్ర రాజధాని, ప్రధాన నగరాలలో ప్రదర్శన >>2

## గోల్కొండకు త్రివర్ణ శోభ
### పంద్రాగస్టుకు భారీ ఏర్పాట్లు
### జాతీయ జెండా ఆవిష్కరించనున్న సిఎం రేవంత్
### మార్చ్‌ఫాస్ట్‌ను సమీక్షించిన సిఎస్ రామకృష్ణారావు


బుధవారం గోల్కొండ కోటలో పంద్రాగస్టు ఏర్పాట్లను పరిశీలిస్తున్న సిఎస్

**హైదరాబాద్, ఆగస్టు 13,ప్రభాతవార్త:** స్వతంత్ర దినోత్సవ ఏర్పాట్లు ఘనంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. ఈమేరకు బుధవారం గోల్కొండ కోటను సందర్శించి వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన ఏర్పాట్లను ఉన్నత అధికారులతో కలిసి ఆయన సమీక్షించారు.

చారిత్రక గోల్కొండ కోటలో ముఖ్యమంత్రిచే జాతీయ జెండా ఆవిష్కరణ, పోలీసుల గౌరవ వందనం అలాగే అభివృద్ధి సంక్షేమ పథకాల సందేశం తదితరాంశాలపై చర్చించారు. అతిధులకు ఎక్కడ కూడా ఇబ్బందులు అసౌకర్యం కలగకుండా వేడుకలు అత్యంత ఘనంగా, గౌరవప్రదంగా నిర్వహించబడాలని, ముఖ్యంగా ప్రోటోకాల్, భద్రత, ప్రజల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు.

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ప్రతిభావంతమైన పోలీసు సిబ్బందికి పతకాలు ప్రదానం చేసే కార్యక్రమం, గార్డ్ ఆఫ్ ఆనర్, మార్చ్ పాస్ట్ తీరును సమీక్షించారు. వాతావరణ సూచనల ప్రకారం వర్షాల నేపథ్యంలో అదిశగా ప్రాధాన్యత ఇవ్వాలని, వాటర్‌ప్రూఫ్ షెడ్లు, మెడికల్ క్యాంపులు, గ్యాలరీలు, సీటింగ్ కెపాసిటీ, బారికెట్స్ అలాగే వాటర్‌ప్రూఫ్ జనరేటర్, పబ్లిక్ అడ్రెస్ సిస్టమ్స్, ఎల్‌ఈడీ స్క్రీన్ల ఏర్పాట్ల పై సంబంధిత అధికారులరు సీఎస్ కి వివరించారు. ముఖ్యంగా ప్రోటోకాల్ తప్పక పాటించాలని, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ సౌకర్యాలు, ఈ ప్రాంతంలో ప్రజలు సులభంగా రాకపోకలు సాగించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. వేడుకల సందర్భంగా నిరంతర విద్యుత్ సరఫరా, త్రాగునీటి అందుబాటు, పారిశుద్ధం, వైద్య సిబ్బంది, ఫస్ట్‌ఎయిడ్ సదుపాయాలు అందుబాటులో ఉండాలని సంబంధిత శాఖలకు ఆదేశించారు. వేడుకలు ఎటువంటి అంతరాయం లేకుండా విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కలిసి పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ >>2

## నియామకంపై స్టే



>>ఎంపిక ఉండాలని పేర్కొంటూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను ధర్మాసనం సవరించింది. ఆగస్టు 14, 2024 తీర్పులో మార్పులు చేస్తూ.. వారి నియామకం చెల్లదని తీర్పును వెలువరించింది. మధ్యంతర ఉత్తర్వుల తర్వాత ప్రమాణ స్వీకారం చేయడం తప్పని సుప్రీంకోర్టు పేర్కొంది. తదుపరి విచారణను సెప్టెంబర్ 17వ తేదీకి వాయిదా వేసింది. కాగా, ఈ విషయంపై తాజాగా ఎమ్మెల్సీ ఆమీర్ అలీఖాన్ స్పందించారు. సుప్రీం కోర్టు ఈ విధమైన తీర్పు ఇస్తుందని అనుకోలేదని అసహనం వ్యక్తం చేశారు. కోర్టు ఆర్డర్ చదివిన తర్వాత అన్ని మాట్లాడుతానని పేర్కొన్నారు. కాసేపటి క్రితమే లాయర్ కాల్ చేసి సుప్రీం కోర్టులో జరిగిన విషయాలు చెప్పారని వివరించారు. తాను మొన్నటి వరకు జర్నలిస్టును అని ఎలాంటి రాజకీయం బ్యాక్ గ్రౌండ్ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తనతో ఇంకా ప్రభుత్వ పెద్దలు మాట్లాడలేదని అలీఖాన్ స్పష్టం చేశారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు కేసీఆర్ ప్రభుత్వం ఎమ్మెల్సీలుగా దాసోజు శ్రవణ్, సత్యనారాయణను ఎమ్మెల్సీలుగా నామినేట్ చేసింది. వీరిద్దరిని అభ్యర్థిత్వాలను అప్పటి గవర్నర్ తిరస్కరించారు. గవర్నర్ అభ్యర్థిత్వాలను తిరస్కరించడంతో శ్రావణ్, సత్యనారాయణ ఇద్దరూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఎన్నికల అనంతరం 2024 జనవరి 13న ప్రొఫెసర్ కోదండ రామ్, అలీఖాన్ పేర్లను రేవంత్‌రెడ్డి సర్కారు ప్రతిపాదించింది. గవర్నర్ వీరిద్దరి అభ్యర్థిత్వాలను ఆమోదించారు. గవర్నర్ నిర్ణయంపై హైకోర్టును ఆశ్రయించారు. కోదండ రామ్, అలీఖాన్ నియామకాలను హైకోర్టు రద్దు చేసింది. ఆ తర్వాత మరోసారి రేవంత్ సర్కారు మళ్లీ అవే పేర్లను గవర్నర్‌కు సిఫారసు చేసింది. గవర్నర్ ఆమోదంతో ఇద్దరు ఎమ్మెల్సీలుగా నియామకమయ్యారు. గవర్నర్ నిర్ణయంపై ఆగస్టు 4న దాసోజు శ్రవణ్, సత్యనారాయణ ఇద్దరు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గవర్నర్ కార్యాలయం సైతం సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం కోదండ రామ్, ఆలీఖాన్ ప్రమాణస్వీకారాన్ని తప్పుపట్టింది.

## ఓట్ల దొంగలు గద్దె దిగండి

>> చేపట్టాలని కోరారు. బిజెపి ఎన్నికల కమీషన్ కుమ్మక్కు పైన నాయకులు ప్రసంగించాలని చెప్పారు. దీని కోసంభారీ జన సమీకరణ చేపట్టాలని అన్నారు అన్ని విభాగాల నాయకులు సీనియర్ నాయకులు పాల్గొనాలని చెప్పారు. పాదయాత్రలు, వాహన ప్రదర్శనలు చేపట్టాలి. ప్రజలను భాగస్వాములను చేసి బిజెపి ఓట్ చోరీలపై ప్రసంగాలు చేయాలని అన్నారు. సెప్టెంబర్ 15 నుంచి అక్టోబర్ 15 వరకు జాతీయ స్థాయి లో ఉద్యమం చేపట్టాలని కోరారు. నెల రోజుల పాటు గడప గడప కు తిరిగి సంతకాల సేకరణ ఉద్యమాన్ని చేపట్టాలని జూమ్ మీటింగ్‌లో పాల్గొన్నవారికి వివరించారు. ఓట్ల చోరీకి వ్యతిరేకంగా 5 కోట్ల సంతకాల సేకరణ చేయాలని లక్ష్యం చేరుకోవడానికి నాయకులు రాష్ట్రమంతటా తిరిగి సంతకాల సేకరణ కార్యక్రమంలో విస్తృతంగా పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు.టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ 24 నుంచి రెండో విడత జనహిత పాదయాత్ర ప్రారంభం అవుతుందని అందులో పెద్దఎత్తున ప్రజలు పాల్గొనేలా ప్రణాళికలు వేసి విజయవంతం చేయాలని కోరారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీ కమిటీలు వెంటనే వేయాలని సూచించారు.కాంగ్రెస్ పార్టీ ఆస్తుల వివరాలు వెంటనే పంపాలి..వరదలల్లో ప్రజలకు అండగా ఉండాలి...మండల కమిటీలను నెలాఖరు లోగా వేయాలి.. గ్రామ కమిటీలను సెప్టెంబర్ 15 వరకు పూర్తి చేసి పంపాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లోకి విస్తృతంగా తీస్కెళ్లాలని కోరారు..రాహుల్ చేపట్టిన బిజెపి ఇసి అక్రమాలపై ఓట్ చోరీ అంశాన్ని ప్రజల్లో బాగా ప్రచారం చేపట్టాలని అన్నారు.

## చెరువు మధ్యలోకి ఈదుకుంటూ వెళ్లి విద్యుత్ పునరుద్ధరణ చేసిన లైన్‌మెన్

### అభినందించిన డిప్యూటీ సిఎం భట్టి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు13:** చెరువు మధ్యలోకి ఈదుకుంటూ వెళ్లి విద్యుత్ పునరుద్దరణ చేసిన లైన్‌మెన్ హైముద్దీన్‌ని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క అభినందించారు. భారీ వర్షాలు కురుస్తున్నా విద్యుత్ అంతరాయం కలగకుండా సిబ్బంది తీవ్రంగా కృషి చేస్తున్నారంటూ వారి సేవలను కొనియాడారు. చెట్లు,స్తంభాలు నేలకొరగడంతో వైర్లు తెగిపడినా సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని బాగు చేస్తున్నారని ప్రశంసించారు. సిద్దిపేట నాగసముద్రం చెరువు మధ్యలో తెగిపోయిన లైన్‌ను పునరుద్దరించేందుకు లైన్‌మెన్ హైముద్దీన్ సాహసం చేశారు. తాడు సాయంతో చెరువు మధ్యలోకి ఈదుకుంటూ వెళ్లి స్తంభం విద్యుత్ కనెక్షన్‌ను పునరుద్దరించారు.

## నేడు నెక్లెస్ రోడ్డులో తిరంగా ర్యాలీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు13:** దేశ ప్రజల్లో జాతీయ భావాన్ని మరింత పెంచేందుకు బిజెపి చేపట్టిన'హర్ ఘర్ తిరంగ్' (ప్రతి ఇంటా మువ్వన్నెల జెండా) కార్యక్రమంలో భాగంగా గురువారం (14న) నెక్లెస్ రోడ్డు నుంచి అంబేద్కర్ విగ్రహం వరకూ భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆ పార్టీ ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్ రెడ్డి తెలిపారు.79వ స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని మూడు రోజులుగా దేశ వ్యాప్తంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలు జరుగుతున్నాయని మనోహర్ రెడ్డి బుధవారం విలేఖరుల సమావేశంలో చెప్పారు. ఇదిలాఉండగా గురువారం ఉదయం 10.30 గంటలకు నెక్లెస్ రోడ్డు నుంచి ప్రారంభమయ్యే తిరంగా ర్యాలీలో పార్టీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ఇతర ముఖ్య నాయకులూ పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ ర్యాలీలో విద్యార్థులూ పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా 40 లక్షల ఇండ్లపై త్రివర్ణ పతాకాలు ఎగుర వేసేందుకు ఏర్పాట్లు చేశామని ఆయన చెప్పారు. కుల, మతాలకు, రాజకీయాలకు అతీతంగా నాయకులు, కార్యకర్తలు, ప్రజలూ ఇందులో పాల్గొనాలని ఆయన కోరారు. ఇప్పటికే రెండు రోజులుగా తిరంగా ర్యాలీలు జరుగుతున్నాయని ఇందులో తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొంటున్నారని ఆయన తెలిపారు. ప్రజలంతా ఐక్యంగా నిలబడి దేశ భక్తిని చాటాలని మనోహర్ రెడ్డి కోరారు. ప్రధాని నరేంద్ర మోడి పిలుపుతో ప్రజల మధ్య జాతీయ ఐక్యతను చాటే ఘనత దక్కిందన్నారు.

## గోల్డ్‌మాన్‌శాక్స్ సిఇఒపై ట్రంప్ ఫైర్!

**న్యూఢిల్లీ, ఆగస్టు 13:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రముఖ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ అయిన గోల్డ్‌మన్ శాక్స్ సీఈఓ డేవిడ్ సోలమన్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బ్యాంకును నడపడం మానేసి, ఆయనకు అలవాటున్న డిస్కో జాకీ (డీజే) పని చూసుకోవడం మంచిదని విమర్శించారు. తమ ప్రభుత్వం విధించిన టారిఫ్‌ల (సుంకాలు) ప్రభావాన్ని తక్కువ చేసి చూపుతూ గోల్డ్‌మన్ శాక్స్ ఇచ్చిన నివేదికపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ట్రంప్ విధించిన సుంకాల భారాన్ని అమెరికా వినియోగదారులే మోస్తున్నారని గోల్డ్‌మన్ శాక్స్ తన నివేదికలో పేర్కొంది. జూన్ వరకు సుంకాల వ్యయంలో సుమారు 22 శాతం భారాన్ని వినియోగదారులే భరించారని, కొత్త టారిఫ్‌లు కూడా ఇదే పద్ధతిలో కొనసాగితే ఈ భారం 67 శాతానికి పెరిగే అవకాశం ఉందని ఆ నివేదిక అంచనా వేసింది. ఈ నివేదికపైనే ట్రంప్ మండిపడ్డారు.

# దారులన్నీ గోదారులే..



'హర్ ఘర్ తిరంగ'లో భాగంగా బుధవారం న్యూఢిల్లీలోని తన నివాసంలో జెండా ఎగురవేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా దంపతులు

## గోల్కొండకు త్రివర్ణ శోభ

>> రఘునందన్‌రావు, అడిషనల్ సీపీ విక్రమ్ సింగ్ మాన్, డిజిపి డాక్టర్ జితేందర్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, ఐఅండ్‌పిఆర్ కమిషనర్ సి. హెచ్ ప్రియాంక,అదనపు డీజీపీ మహేష్ భగవత్, సంజయ్ కుమార్ జైన్, అదనపు పోలీస్ కమిషనర్ (లా ఆర్డర్) వి.ఎస్. మాన్, డిజి ప్రిజన్స్ సౌమ్య మిశ్రా, డిజి ఫైర్ సర్వీసెస్ నాగిరెడ్డి, ప్రోటోకాల్ డైరెక్టర్ శివలింగయ్య, జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి, జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, విద్యుత్, జిహెచ్ఎంసి, ప్రోటోకాల్, రెవెన్యూ, హెచ్ఎండిఏ, సీనియర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### వారం - వర్జ్యం

14-08-2025, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
శ్రావణ మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, కృష్ణపక్షం
షష్ఠి రా.2.07
రేవతి ఉ.9.05
వర్జ్యం : రా.3.51-5.21
దు.ఉ.10.06-10.57, 2) 3.11-4.02
రాహుకాలం - మ.1.30-3.00

### వార్తాఫలం

**మేషం:** దూరప్రయాణాలు చేయవలసి వస్తుంది. సంతాన విద్యావిషయంలో పట్ల శ్రద్ధ కనబరుస్తారు.

**వృషభం:** ముఖ్యమైన వ్యవహారాలలో తొందరపాటు వద్దు. ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉంటుంది.

**మిథునం:** దూరప్రాంతాల నుండి అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు. ఉద్యోగులకు బదిలీల సూచన.

**కర్కాటకం:** సన్నిహితులకు మీ సహాయ సహకారాలు అందిస్తారు. క్రీడలయందు ఆసక్తి కలిగివుంటారు.

**సింహం:** జీవితభాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

**కన్య :** పదేపదే మీ సహాయాన్ని ఆర్జించే కొందరిని మీకు దూరంగా ఉంటుతారు.

**తుల :** ఇంటాబయటా ప్రోత్సాహకరంగా ఉంటుంది. ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి.

**వృశ్చికం:** సన్నిహితులను కలిసి ఆనందంగా గడుపుతారు. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం.

**ధనుస్సు:** సంఘంలో మీకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు లభిస్తుంది. గృహం కొనుగోలుచేస్తారు.

**మకరం:** కుటుంబంలో శుభకార్యాలు నిర్వహిస్తారు. భాగస్వామ్య వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి.

**కుంభం:** క్రయ విక్రయాలలో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడం శ్రేయస్కరం.

**మీనం :** ఆర్థికాభివృద్ధిని సాధిస్తారు. స్థలాలు, గృహం కొనుగోలు చేస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

>> ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలు అతలాకుతలం చేశాయి. చెరువులు, కుంటలు, వాగులు పొంగి పొర్లుతున్నాయి. హనుమకొండ జిల్లా పరకాలలో చలివాగు, కంటాత్మకూరు వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. త్రినగరిలోని పలు కాలనీలు ఇంకా వరద ముంపులోనే ఉన్నాయి. లోతట్టు ప్రాంతాల ప్రజలకు వరంగల్ మహా నగర పాలక సంస్థ అల్పాహారం సహా భోజనాన్ని అందిస్తోంది. వరద ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలను ఖాళీ చేయించి పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. ములుగుజిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తుండగా చెరువులు, చిన్న నీటి వనరులు మత్తడిపోస్తున్నాయి. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం నారాయణపురం వద్ద ఆకేరు వాగులో పడి ఓ పశువుల కాపరి గల్లంతయ్యాడు. ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది గజఈతగాళ్ల సాయంతో గాలింపు చేపట్టారు. సూర్యాపేట జిల్లా కోదాడలో లోతట్టు ప్రాంతాలైన షిరిడి సాయి నగర్, గణేష్ నగర్లతో పాటు పలు కాలనీవాసులను మున్సిపల్ సిబ్బంది ముందస్తుగా ఖాళీ చేయించారు. పెద్ద చెరువు వరద ముంపును దృష్టిలో పెట్టుకుని ప్రజలను చైతన్యపరిచారు.హైదరాబాద్‌లో భారీగా పడుతున్న వర్షాలకు భువనగిరి జిల్లాలో మూసీ నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. వలిగొండ మండలం సంగెం సమీపంలోని భీమలింగం వద్ద ప్రమాదకరరీతిలో ఉధృతి కనిపిస్తోంది. పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి జనం అటువైపు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. భువనగిరి జిల్లాలో రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు పర్యటించారు. బీబీనగర్ మండలం రుద్రవెల్లి సమీపంలో మూసీ వరదను పరిశీలించారు. పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో వర్షాలకు ఎర్రవాగు పొంగిపొర్లుతుండటంతో రోడ్డుపైకి వరద చేరి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నేరేడుచర్ల మండలం నరసయ్య గూడెంలో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. మంచిర్యాల జిల్లా తాండూరులోని రైల్వే అండర్ బ్రిడ్జి మునిగిపోయింది. భీమిని మండలం పెద్దపేట, రాజారం మధ్య వాగు ఉధృతికి రాకపోకలు నిలిచిపోయాయి.ఎర్రవాగు, నల్లవాగు ఉప్పొంగి పొలాలను ముంచెత్తాయి. ఆసిఫాబాద్ సందీప్‌నగర్‌లో ఇళ్లలోకి వరద చేరింది. మంచిర్యాల జిల్లా మందమర్రిలోని కళ్యాణిఖని ఉపరితల గనిలో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. గనిలోని నీటిని తొలగించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గంలో కుంటాల, పొచ్చెర గాయత్రీ జలపాతలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఏజెన్సీ ప్రాంతాల్లో వాగులు ప్రవహించడంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వరద ఉధృతి కారణంగా పెళ్లికొడుకును బంధువులు భుజాలపై మోసుకెళ్లిన వింత ఘటన కరీంనగర్ జిల్లా గన్నేరువరంలో జరిగింది. ఊర చెరువు మత్తడి ప్రవాహం ఎక్కువై రాకపోకలు నిలిచిపోవడంతో విధి లేని పరిస్థితిలో బంధువులు పెళ్లికొడుకును భుజాలపై మోసుకుంటూ అవతలి ఒడ్డుకు చేర్చారు. ఏటా ఈ తిప్పలు తప్పడం లేదని ఇప్పటికైనా అధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. నిర్మల్ జిల్లా కడెం జలాశయానికి ఎగువ నుంచి భారీగా వరద చేరుతోంది. ఇన్‌ఫ్లో దృష్ట్యా అధికారులు దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం స్వర్ణ ప్రాజెక్టులోకి వరద నీరు చేరికతో నీటిని కిందకు వదులుతున్నారు.హైదరాబాద్‌లో భారీ వర్షాలు,వరదలతో మూసారాంబాగ్ బ్రిడ్జిపై నుంచి రాకపోకలు బంద్ అయ్యాయి. మూసీ వరద ఉధృతి కారణంగా పోచంపల్లి-బీబీనగర్ మధ్య రాకపోకలు నిలిపివేశారు.హైదరాబాద్‌లో యాకత్‌పురలో వరద ఉధృతికి నాలాలో కొట్టుకుపోయిన వ్యక్తి, కాపాడిన హైడ్రా సిబ్బంది. వర్షాల ప్రభావంతో శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు రావాల్సిన 5 విమానాల దారీ మళ్లింపు, 3 విమానాలు విజయవాడకు,2 ఫ్లైట్లు తిరుపతి,బెంగుళూరుకు తరలించారు. కాగా భారీ వర్షాలు ఉన్న చోట్ల పలు జిల్లాల్లో స్కూళ్లకు గురువారం సెలవులు ప్రకటించారు. హైదరాబాద్‌లో స్కూళ్లకు ఒక పూట సెలువులు ఇచ్చారు.



వరంగల్ జిల్లాలో మోకాలిలోతు నీటిలో ప్రయాణిస్తున్న బస్సు

ఎగువ నుంచి శ్రీశైలం డ్యామ్‌కు వరద పోటెత్తుతున్నది. జూరాల, సుంకేశుల ప్రాజెక్టుల నుంచి వరద కొనసాగుతున్నది. ఈ క్రమంలో అధికారులు ప్రాజెక్టు ఏడు గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం సుంకేశుల, జూరా ప్రాజెక్టుల నుంచి 1,37,399 క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చి డ్యామ్‌లో చేరుతున్నది. శ్రీశైలం జలాశయం పూర్తి నీటిమట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుతం 882.70 అడుగుల మేర నీరుంది. పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థం 215.8 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 202.05 టీఎంసీల నీరు నిల్వ ఉంది. శ్రీశైలం కుడి, ఎడమ గట్టు జలవిద్యుత్ కేంద్రాల్లో కరెంటు ఉత్పత్తి కొనసాగుతుంది. జల విద్యుత్ కేంద్రాల ద్వారా 65,651 క్యూసెక్కులు సాగర్‌కు వెళ్తున్నది. స్పిల్‌వే నుంచి 1.89లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు వెళ్తుంది.

## కన్నెపల్లిలో 23 సెం.మీ

>> ఆదిలాబాద్, జనగామ, కామారెడ్డి, కుమురంభీం, ఆసిఫాబాద్, మహబూబాబాద్, మంచిర్యాల, నల్గొండ, రంగారెడ్డి, సిద్దిపేట, వరంగల్ జిల్లాలకు ఆరెంజ్ వార్నింగ్ హెచ్చరికలు జారీచేశారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముంది. పశ్చిమ మధ్య, వాయవ్య బంగాళాఖాతంలో బుధవారం ఏర్పడనున్న అల్పపీడనం శుక్రవారం నాటికి మరింత బలపడనున్నట్లు వాతావరణశాఖ అంచనా వేస్తోంది. బుధవారం ఉదయం మంచిర్యాల జిల్లా కన్నెపల్లిలో 23సెం.మి అత్యధికవర్షపాతం నమోదైంది. అదేజిల్లాలోని బిమినిలో 22.5సెం.మి వర్షంకురిసింది. కురంభీమ్ జిల్లా రెబ్బనలో 20సెం.మి, జయశంకర్‌జిల్లా చిట్యాలలో 18సెం.మి, మంచిర్యాల జిల్లా తాండూర్‌లో 180సెం.మి, ములుగుజిల్లా మంగపేటలో 16.4సెం.మి, మంచిర్యాల నెన్నలలో 14సెం.మి, జనకపూర్‌లో 13.7సెం.మి,జయశంకర్‌జిల్లా రేగొండ 13.3సెం.మి, కుమురంభీమ్ జంబుగా 12.9,కుంచవెల్లి 12.7సెం.మి,తిర్యాణి మండలం గిన్నెదరిలో,పెద్దకోడూర్‌బెల్లంపల్లి, మానకొండూర్ 12 సెం.మిఅన్నారు. ములుగు వెంకటపూర్,11సెం.మి కురిసింది. సుమారు 30కేంద్రాలలో 8.6 సెం.మికు పైగా వర్షాపాతం నమోదైంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో భారీ వర్షం కుస్తుంది. మంచిర్యాల, కుమురంభీం జిల్లాల్లో అత్యధికంగా 23 సెం.మీ వర్షపాతం నమోదైంది. జిల్లాలోని తాండూరులోని రైల్వే అండర్ వంతెన నీట మునిగింది. ముందస్తు జాగ్రత్తగా రైల్వే గేటును అధికారులు మూసివేశారు. భీమిని మండలం పెద్దపేట, రాజారం మధ్య వాగు ఉప్పొంగడంతో రాకపోకలు నిలిచాయి. చిన్నతిమ్మాపూర్ వద్ద ఎర్రవాగు ఉప్పొంగింది. మరోవైపు నల్లవాగు ఉప్పొంగడంతో పంట పొలాలు నీట మునిగాయి.కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో వర్షం దంచికొడుతోంది. దీంతో వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. తిర్యాని మండలం మాణిక్యపూర్‌వాగు ఉధృతికి రాకపోకలు నిలిచాయి. ఆసిఫాబాద్‌లోని సందీప్‌నగర్‌లో ఇళ్లలోకి వర్షపు నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వరంగల్‌లో కురిసిన భారీ వర్షాల వరద ముంపు నుంచి కాలనీవాసుసు తేరుకుంటున్నారు. మైసయ్యనగర్, డీకేనగర్, ఎన్టీఆర్ నగర్, శివనగర్ కాలనీల్లో వరగ కాస్త తగ్గుముఖం పట్టింది. వరద తగ్గడంతో పునరావాస కేంద్రాల నుంచి కాలనీ వాసులు ఇంటికి చేరుకుంటున్నారు.



బుధవారం శ్రీశైలం ప్రాజెక్టు గెట్లు తెరిచి నీటిని దిగువకు వదిలిన దృశ్యం

## 202 టిఎంసిలకు చేరిన శ్రీశైలం డ్యాం

### 7 గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 13, ప్రభాతవార్త:** శ్రీశైలం జలాశయానికి వరద క్రమంగా పెరుగుతున్నది. సుంకేసుల, జూరాల డ్యాంల నుంచి భారీగా వరద వచ్చి చేరుతున్నది. దీంతో 7గేట్లు 10అడుగుల మేర ఎత్తి సాగర్‌కు నీటిని విడుదల చేస్తున్నారు. బుధవారం సాయంత్రం 6గంటల సమాచారం మేరకు శ్రీశైలానికి జూరాల పవర్‌హౌజ్ ద్వారా 36,628క్యూసెక్కులు, స్పిల్ వే ద్వారా 54,352క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 42,669క్యూసెక్కుల వరద జలాశయానికి చేరుకుంటున్నది. డ్యాం నుంచి 1,37,399క్యూసెక్కులు దిగువకు విడుదలవుతున్నాయి. డ్యాం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులకుగానూ 882.70అడుగులకు చేరగా, 215.8070 టీఎంసీలకు గానూ ప్రస్తుతం 202.050టీఎంసీలకు చేరింది. డ్యాంకు 1,89,651క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతున్నది. విద్యుత్ ఉత్పత్తి కోసం 65,651 క్యూసెక్కులు విడుదల చేయగా కుడి,ఎడమ జల విద్యుత్ కేంద్రాల వద్ద విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతున్నది. అదేవిధంగా ఉమ్మడి పాలమూరులోని జూరాలకు ఎగువన కర్ణాటకలో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రాజెక్టులకు భారీ వరద వచ్చి చేరుతున్నది. ఎగువన కురుస్తున్న వర్షాలకు జూరాలకు వరద పోటెత్తుతున్నది. దీంతో 8 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయానికి 90,000క్యూసెక్కుల ఇన్ ఫ్లో నమోదైంది. జూరాల పూర్తి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం జూరాలలో 4.284టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. పవర్‌హౌస్‌కు 36,628క్యూసెక్కులు, స్పిల్ వే ద్వారా 54,352క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అదేవిధంగా ఆర్డీఎస్‌కు 50 క్యూసెక్కులు, కోయిల్ సాగర్ లిఫ్ట్ కు 315 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. జూరాల నుంచి 91,340క్యూసెక్కుల అవుట్ ఫ్లో నమోదయింది.

## గాడ్సే, సావర్కర్ మద్దతుదారుల నుంచి రాహుల్‌కు ముప్పే!

### పుణే కోర్టులో రాహుల్ న్యాయవాది ప్రత్యేక పిటిషన్

**న్యూఢిల్లీ, ఆగస్టు 13:** వినాయక్ దామోదర్ సావర్కర్‌ను ఉద్దేశించి వివాదాస్పద వ్యాఖ్యలుచేసారంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై పరువునష్టంకేసు నమోదయిన సంగతి తెలిసిందే. సావర్కర్, గాడ్సే భావజాలాన్ని అనుసరిస్తున్న వారినుంచి తనకు ముప్పుపొంచి ఉందని రాహుల్ పూణె కోర్టుకు తెలిపారు. ఈ నేపథ్యంలో తనకు అవసరమైన భద్రత అందించడం కేంద్రం బాధ్యత అని అన్నారు. 2023లో లండన్ పర్యటన సమయంలో సావర్కర్‌ను ఉద్దేశిస్తూ రాహుల్ గాంధీ వివాదాస్పద వ్యాఖ్యలుచేసారు. ఈ క్రమంలో సావర్కర్ మునిమనవడు సాత్యకి సావర్కర్ ఆయనపై పరువునష్టం దావా దాఖలుచేసారు.ఈకేసుకు సంబంధించి ప్రాథమిక ఆధారాలున్నట్లు పోలీసులు గతంలోనే తేల్చారు. దీనిపై పూణెలోని ప్రజాప్రతినిదులకోర్టులో విచారణ ఇంకా ప్రారంభించాల్సి ఉండగా రాహుల్ తరపు న్యాయవాది కోర్టుకు తాజాగా ఈపిటిషన్ ఇచ్చారు. తనకు నాథూరామ్ గాడ్సే, సావర్కర్ కుటుంబాలతోస ంబంధం ఉందని సాత్యకి గతంలో వెల్లడించారని, ఆయన గత చరిత్రను దృష్టిలోపెట్టుకుని ప్రస్తుత రాజకీయ వాతావరణం పరిగణనలోనికి తీసుకుంటే సావర్కర్,గాడ్సే భావజాలానికి మద్దతు ఇచ్చే వ్యక్తులనుంచి రాహుల్‌కి ముప్పు పొంచి ఉండే అవకాశాలు కొట్టివేయలేమని పిటిషన్‌లో తెలిపారు.

## నిండు కుండలు

>> క్యూసెక్కులు, కుడి గట్టు విద్యుత్ కేంద్రం నుంచి 30,590 క్యూసెక్కులు నీటిని వదులుతున్నారు. నాలుగు స్పిల్ వే గేట్ల ద్వారా 1,08,628 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం 883 అడుగులకు చేరింది. ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థం 215.80 టీఎంసీలు కాగా ప్రస్తుతం 202.35గా ఉంది.
జూరాలలో గరిష్టంగా 9.66టిఎంసిలు నీటిని నిలుపుకొనే సామర్థ్యం ఉన్నప్పటికి అందులో ప్రస్తుతం 7.99 టిఎంసిలు నీరు ఉంది.లాల్‌బహుద్దూర్‌శాస్త్రీ ఆలమట్టి డ్యామ్‌లో 129.672 టిఎంసిలకు గాను 127.67 టిఎంసిల నీరు వచ్చిచేరింది. పులిచింతలో 45.77టిఎంసిలునీరు నిలుపుకొనే సామర్థ్యం ఉండగా 39టిఎంసిలు నీరు చేరింది .గోదావరి బేసిన్‌లో సింగూర్‌లో 29 టిఎంసిల గరిష్ట నిల్వకు గాను 22 టిఎంసిల నీరు వచ్చిచేరింది. నిజామ్‌సాగర్ ప్రాజెక్టులో 17.8టిఎంసిల నీరు నిలుపుకొనే సామర్థ్యం ఉండగా అందులో 5.64టిఎంసిల నీరు ఉంది. శ్రీరామసాగర్‌లో 80 టిఎంసి నీరు నిలుపుకొనే సామర్థ్యం ఉండగా 45టిఎంసిల నీరు ప్రస్తుతం వచ్చిచేరింది. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతోంది.
ఎల్లంపల్లి ప్రాజెక్టు ఇన్‌ఫ్లో 16,027 క్యూసెక్కులు, అవుట్‌ఫ్లో 551 క్యూసెక్కులుగా ఉంది. పూర్తిస్థాయి నీటి సామర్థ్య 20.17 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి సామర్థం 13.71 టీఎంసీలకు చేరింది. నిర్మల్ జిల్లా కడెం జలాశయానికి వరద నీరు చేరుతోంది. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు కాగా ప్రస్తుతం 695.300 అడుగులకు చేరింది. ఇన్‌ఫ్లో 3242 క్యూసెక్కులుగా ఉంది. కడెం జలాశయం 2 గేట్ల ద్వారా దిగువకు 12,135 క్యూసెక్కుల నీటి విడుదల చేస్తున్నారు. సంగారెడ్డి జిల్లా సింగూరు ప్రాజెక్టుకు వరద నీరు కొనసాగుతుంది. ప్రాజెక్టు ఇన్‌ఫ్లో 4,638 క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో 633 క్యూసెక్కులుగా ఉంది. పూర్తిస్థాయి నీటి సామర్థం 29.917 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి సామర్థం 22.145 టీఎంసీలకు చేరింది. మధ్యమానేరు జలాశయం గరిష్ఠసామర్థ్యం 27 టిఎంసిలకు గాను 7.85టిఎంసిలు నీరు వచ్చింది. ఎల్ఎండిలో 24 టిఎంసిలకుగాను 6.88టిఎంసిల నీరు వచ్చిచేరింది. చెరువులు కుంటల్లో కూడా సగటున 68శాతం నీరు వచ్చిచేరింది.

## భారత్ పౌరసత్వం లభించకముందే సోనియాకు ఓటుహక్కు

**న్యూఢిల్లీ, ఆగస్టు 13:** కేంద్ర ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తున్న సంగతి తెలిసిందే. బీజేపీకి తొత్తుగా వ్యవహరిస్తూ ఓట్లను తొలగిస్తోందని ఆరోపిస్తోంది. ఈ నేపథ్యంలో, కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకురాలు సోనియా గాంధీని లక్ష్యంగా చేసుకుని బీజేపీ తీవ్రమైన ఆరోపణలు చేసింది. ఆమెకు భారత పౌరసత్వం లభించక ముందే, ఢిల్లీ ఓటర్ల జాబితాలో ఆమె పేరు నమోదైందని ఆరోపించింది. ఈ మేరకు బీజేపీ ఐటీ విభాగం అధిపతి అమిత్ మాలవీయ సోషల్ మీడియా వేదికగా కొన్ని ఆధారాలను బయటపెట్టడం జాతీయ రాజకీయాల్లో కలకలం రేపుతోంది. బీజేపీ ఐటీ సెల్ హెడ్ అమిత్ మాలవీయ ఈ వివాదాన్ని తెరపైకి తెచ్చారు. 1980 నాటి ఢిల్లీ ఓటర్ల జాబితాకు సంబంధించిన ఒక చిత్రాన్ని ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఆ జాబితాలో సోనియా గాంధీ పేరు స్పష్టంగా ఉందని, ఒక విదేశీ పౌరురాలికి ఇది ఎలా సాధ్యమైందని ఆయన ప్రశ్నించారు. ఇది నిబంధనలకు పూర్తిగా విరుద్ధమని, తీవ్రమైన తప్పిదమని ఆయన పేర్కొన్నారు. వాస్తవానికి, ఇటలీలో జన్మించిన సోనియా గాంధీ 1968లో రాజీవ్ గాంధీని వివాహం చేసుకున్నారు. ఆ తర్వాత 1983 ఏప్రిల్ 30న ఆమె భారత పౌరసత్వాన్ని అధికారికంగా స్వీకరించారు.
అయితే, పౌరసత్వం పొందడానికి మూడేళ్ల ముందే, అంటే 1980లోనే ఆమె పేరు ఓటర్ల జాబితాలో చేరడంపై మాలవీయ సందేహాలు వ్యక్తం చేశారు. ఒక ఇటలీ పౌరురాలి పేరును భారత ఓటర్ల జాబితాలో ఎలా చేర్చారు? అప్పటి ప్రభుత్వం ఒత్తిడితో ఇది జరిగిందా? లేక గాంధీ కుటుంబం మోసపూరితంగా ఈ పని చేసిందా? అని మాలవీయ వరుస ప్రశ్నలు సంధించారు. ఈ మొత్తం వ్యవహారంపై గాంధీ కుటుంబంతో పాటు, నాటి ఎన్నికల సంఘం అధికారులు కూడా సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కొత్త ఆరోపణలతో కాంగ్రెస్ పార్టీ ఇరకాటంలో పడగా, దీనిపై ఆ పార్టీ ఏ విధంగా స్పందిస్తుందో వేచి చూడాలి.

## అక్టోబరు వరకు ప్రత్యేక రైళ్లు పొడిగింపు

**హైదరాబాద్,ఆగస్టు13, ప్రభాతవార్త:**తెలుగురాష్ట్రాలలో ప్రత్యేక రైళ్లను అక్టోబరు 15 వరకు పొడగించనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు పేర్కొన్నారు. ప్రధానమార్గాల్లో రద్దీ దృష్ట్యా 54రైళ్లు నడుస్తాయని వివరించారు. కాచిగూడ–మధురైతోపాటు తిరుపతి, నాగర్‌సోల్‌కు అందుబాటులో ఉంటాయన్నారు. అదేవిధంగా హైదరాబాద్–కొల్లాం, హైదరాబాద్–కన్యాకుమారి మార్గంలో రాకపోకలు సాగిస్తాయని వెల్లడించారు. సికింద్రాబాద్ –తిరుపతి నడుమ 10రైళ్లు,కాచిగూడ–నాగర్‌సోల్ రూట్‌లో 8రైళ్లు, నాందేడ్–తిరుపతికి 10రైళ్లు, నాందేడ్–ధర్మవరంకు 10రైళ్లు ఉన్నాయని అధికారులు తెలిపారు. ఆరు ప్రధానమార్గాల్లో 54ప్రత్యేక రైళ్లను అక్టోబరు15వరకు పొడగించారు. ఇక హైదరాబాద్– కొల్లాం వెళ్లే ప్రత్యేక రైలు ఆగస్టు16నుంచి అక్టోబరు 11వరకు ప్రతి శనివారంఅందుబాటులో ఉంటుందన్నారు.అదేవిధంగా హైదరాబాద్–కన్యాకుమారి ప్రత్యేకరైలు అక్టోబరు8వరకు ప్రతి బుధవారం నడుస్తున్నట్లు వివరించారు.

### భారీ వర్షాలకు రైళ్ల రాకపోకలపై ఆంక్షలు

## 18వరకు పదిరైళ్లు నిలిపివేత

**హైదరాబాద్,ఆగస్టు13, ప్రభాతవార్త:** తెలుగురాష్ట్రాలలో అతిభారీ వర్షాల కారణంగా అక్కడక్కడ వరదప్రవాహం పోటెత్తడంతో రైళ్ల వంతెనలపై రాకపోకలకు రైల్వే అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ప్రయాణీకుల భద్రతను దృష్టిలో పెట్టుకుని వేగాన్నితగ్గించాలని సూచనలు చేశారు. ఐదు రోజుల పాటు 10రైళ్లు రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. అంతేకాకుండా పలు రైళ్లకు అంతరాయంఏర్పడుందని వివరించింది, పాపటపల్లి – డోర్నకల్ బైపాస్ నడేమ మూడోరైల్వేలైను నిర్మాణ పనుల నేపథ్యంలో రాకపోకలను మళ్లించి నట్లు పేర్కొంది. 14 నుంచి 18వ తేదీ వరకు డోర్నకల్ విజయవాడ (ట్రెయిన్ నెంబర్ 67767), విజయవాడ డోర్నకల్ (ట్రెయిన్ నెంబర్ 67768), కాజీపేట డోర్నకల్ (ట్రెయిన్ నెంబర్ 67765), డోర్నకల్ కాజీపేట (ట్రెయిన్ నెంబర్ 67766), విజయవాడ సికింద్రాబాద్ (ట్రెయిన్ నెంబర్ 12713), సికింద్రాబాద్ విజయవాడ (ట్రెయిన్ నెంబర్ 12714), విజయవాడ భద్రాచలం రోడ్ (ట్రెయిన్ నెంబర్ 67215), భద్రాచలం రోడ్ విజయవాడ (ట్రెయిన్ నెంబర్ 67216), గుంటూరు సికింద్రాబాద్ (ట్రెయిన్ నెంబర్ 12705), సికింద్రాబాద్ గుంటూరు (ట్రెయిన్ నెంబర్ 12706)లను రద్దు చేశారు. అదేవిధంగా మరో 26రైళ్లలో కొన్నింటిని ఒక రోజు, మరికొన్నింటిని రెండు రోజుల పాటు రాక పోకలు ఉండవని వెల్లడించింది, మూడు రైళ్లు ఆలస్యంగా బయల్దేరతాయని, ఏమైనా సందేహాలుంటే సహాయం కోసం 139 డయల్ చేయాలని రైల్వే అధికారులు

## నాంపల్లి కోర్టు తీర్పుపై హైకోర్టుకు సిబిఐ అప్పీలు

### ఓబుళాపురం గనుల కేసు

**హైదరాబాద్, ఆగస్టు 13, ప్రభాతవార్త:** ఉమ్మడి ఎపిలో వెలుగు చూసిన ఓబుళాపురం గనుల అక్రమమైనింగ్ కేసులో నాటి గనులశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, అప్పట్లో గనులశాఖను పర్యవేక్షించిన సీనియర్ ఐఎఎస్ అధికారి కృపానందంలను నాంపల్లి కోర్టు నిర్దోషులుగా ప్రకటించడాన్ని సిబిఐ హైకోర్టులో అప్పీల్ చేసింది. ఈ మేరకు సిబిఐ తరపు న్యాయవాది బుధవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో వీరిని నిర్దోషులుగా ప్రకటించ డం సరైంది కాదని, వీరిద్దరు కూడా దోషులేనని సిబిఐ వాదించింది. ఈ కేసులో దోషులుగా తేలిన గాలి జనార్ధన్ రెడ్డి సహా ఇతర నిందితులకు వీరిద్దరు సహకరించారని సిబిఐ పేర్కొంది. కాగా సిబిఐ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన హైకోర్టు తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేసింది.

## జనజీవనానికి ఆటంకాలు లేకుండా తక్షణ చర్యలు చేపట్టాలి: మంత్రి పొంగులేటి

**హైదరాబాద్,ఆగస్టు 13 ప్రభాతవార్త:** భారీ వర్షాలతో జనజీవనానికి ఆటంకం లేకుండా తక్షణ చర్యలు చేపట్టాలనిరెవెన్యూ విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రెవెన్యూ అధికారులను ఆదేశించారు.రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీవర్షాలు మరో 4రోజుల పాటు కొనసాగుతాయని వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో రెవెన్యూ యంత్రాంగం పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలన్నారు.సిఎం రేవంత్ రెడ్డి సూచనలకుఅనుగుణంగా భారీ వర్షాల వలన ప్రజలకు ఇబ్బంది కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.లోతట్టు ప్రాంతాలు,వరద ముంపు ప్రాంతాల్లో ప్రత్యేకంగా చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా విపత్తుల నిర్వహణా శాఖ ఆయా జిల్లాల్లో ఇరిగేషన్, విద్యుత్,పంచాయితీరాజ్, రహదా రులు,పోలీస్ విభాగాలతో కలిసి సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ప్రతి జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూమ్‌లు నిరంతరం పనిచేసేలా చూడాలన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో పరిస్థితి గురించి ఆరా తీశారు. భారీ వర్షాలు కురుస్తున్న హనుమకొండ, వరంగల్ ,జనగాం మహబూబాబాద్, భూపాలపల్లి తదితర జిల్లాలపై ఎక్కువ దృష్టి సారించాలన్నారు. ప్రజలతో నేరుగా సంబంధం ఉండే రెవెన్యూ విభాగం నిరంతరం పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని,ప్రజాజీవనానికి ముఖ్యంగా రాకపోకలకు ఆటంకంలేకుండా చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

## రూ.25లక్షలు విలువైన వజ్రం, వైజయంతి పొదిగిన బంగారులక్ష్మీపతకం విరాళం



**తిరుమల,ఆగస్ట్ 13ప్రభాతవార్తప్రతినిధి:**ప్రపంచంలోనే అత్యంత సంపన్నవంతమైన బంగారుదేవుడు, కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి ఓ దాత వజ్రం,వైజయంతి పొదిగిన బంగారులక్ష్మీపతకాన్ని విరాళంగా అందించాడు. బెంగుళూరుకు చెందిన దాత కెఎం శ్రీనివాసమూర్తి శ్రీవారి పంచభేరాల్లో ఒకరైన భోగశ్రీనివాసమూర్తికి అలంకరించేందుకు 148గ్రాముల బరువుగల 25లక్షలు రూపాయలు విలువైన లక్ష్మీపతకాన్ని అందజేశారు. బుధవారం ఉదయం ఆలయంలోపల రంగనాయకుల మండపంలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి దాత అందజేశారు. తిరుమలేశునిపై భక్తివిశ్వాసాలతో ఈ విరాళం ఇచ్చినట్లు తెలిపారు.

## ఎస్వీ అన్నప్రసాదానికి రూ.కోటి విరాళం




**తిరుమల,ఆగస్ట్ 13ప్రభాతవార్తప్రతినిధి:** ధార్మికసంస్థ తిరుమలతిరుపతిదేవస్థానం నిర్వహిస్తున్న పలు ట్రస్ట్‌లు, పథకాలకు భక్తులైన దాతలు తమవంతుగా విరాళాలందించి అవసరమైన వారికి సేవలందించేందుకు ముందుకు వస్తున్నారు. ఇందులో భాగంగా తిరుమలకు వచ్చిన భక్తులకు ఆకలి అనేది తెలియకుండా నిరంతరాయంగా రుచిగా శుచిగా అందిస్తున్న ఉచిత అన్నప్రసాదం ట్రస్ట్‌కు ఓ దాత బుధవారం ఉదయం ఒకకోటి రూపాయలు విరాళాలిచ్చాడు. బెంగుళూరుకు చెందిన కల్యాణ్‌రామన్ కృష్ణమూర్తి అనే దాత ఈ భారీ విరాళాలకు సంబంధించి డిడిని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి అందజేశాడు.



# సూర్యాపేట జిల్లాలో భారీ వర్షాలు

### అలుగులు పోస్తున్న చెరువులు

### అధికారులకు సెలవులు రద్దు

### వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్

**ప్రభాతవార్త, నడిగూడెం,(సూర్యాపేట):** రెండు రోజులుగా జిల్లా వ్యాప్తంగా వర్షాలు దంచి కొడుతున్నాయి. చెరువులన్నీ జలకళను సంతరించుకున్నాయి. జిల్లాలోని పలు మండలాల్లో చెరువులు అలుగుపోస్తున్నాయి.అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. వరద ప్రభావిత ప్రాంతాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఎలాంటి నష్టం వాటిల్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ప్రభుత్వము మూడు రోజులపాటు అధికారులకు సెలవులను రద్దు చేసింది. జిల్లాలో సరాసరి 43.1మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. అత్యధికంగా నాగారంమండలంలో 187.9 మిల్లీమీటర్లు తిరుమల గిరిలో 180.4 మిల్లీమీటర్లు తుంగతుర్తిలో 132.3 కిలోమీటర్లు జాజిరెడ్డిగూడెంలో 121.3మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. నాగారం మండలంలో పనిగిరి, పసునూరు, పస్తాల, లక్ష్మాపురం, వర్ధమానుకోట, నాగారం, కొత్తపల్లి, ఈటూరు గ్రామాలలో ఉన్న కల్వర్టులవద్ద ప్రమాదకరంగా నీరు ప్రవహిస్తుంది. అరవపల్లి మండలంలో పాఠశాలల ఆవరణలో వరద నీరు చేరింది. తిరుమలగిరి మండలం లో భారీ వర్షం కురిసింది. వలిగొండ, తొర్రూరు రహదారిలో తొండ గ్రామం వద్ద బ్రిడ్జి నిర్మాణం సాగుతున్న నేపథ్యంలో భారీగా వరద నీరు చేరింది. మద్దిరాల మండలంలో కుక్కడం గుమ్మడవెల్లి పోలుమళ్ళ చిన్ననెమలి కుంటపల్లి గ్రామాలలోని చెరువులు నిండాయి. ఆత్మకూరు మండలం చివ్వెంలా ముకుందాపురం రహదారిలో ఏపూరు బ్రిడ్జిపై బిక్కేరు వాగు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు అంతరాయం కలిగింది. తుంగతుర్తి మండలంలో చెరువులు అలుగు పోశాయి. సంగం కోడూరు రహదారిపై వరద నీరుప్రవహించడంతో ఇబ్బంది కలిగింది. తుంగతుర్తి నియోజకవర్గం లోని తిరుమలగిరి, నాగారం, అర్వపల్లి, తుంగతుర్తి, మద్దిరాల, నూతనకల్ మండలాల్లో భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. వరి నాట్లు వేయగా వరద నీరు ప్రవహించటంతో కొట్టుకుపోయాయి. దీంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తిరుమలగిరి మండలంలో మాలిపురం, గుండెపురిలో చెరువులు అలుగు పోస్తు న్నాయి. ఎస్సారెస్పీ కెనాల్‌కు గండ్లు పడిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి సహాయక చర్యలు చేపట్టారు. కోదాడ నియోజకవర్గంలోని చిలుకూరు మండలంలో నారాయణపురం గ్రామ చెరువు అలుగు పోస్తుంది. వరద ప్రభావిత ప్రాంతాలను కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్, అదనపు కలెక్టర్ రాంబాబు పర్యటించారు. సహాయక చర్యలను చేపట్టాలని, ప్రజలను అప్రమత్తం చేసి నష్టం వాటిల్లకుండా చూసుకోవాలని ఆదేశించారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని మఠంపల్లి, రఘునాథపాలెం రోడ్డులో మఠంపల్లిబ్రిడ్జి వద్ద నీరు పొంగి ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో రఘునాథపాలెం వెళ్లే మోడల్ స్కూల్ విద్యార్థులు వాగు దాటేందుకు ఇబ్బంది పడుతున్న విషయాన్ని గమనించిన కలెక్టర్ తేజస్సు నందులాల్ పవర్ తన కారులో విద్యార్థులను ఎక్కించుకొని మోడల్ స్కూల్‌కు తీసుకెళ్లారు. వర్షం తగ్గకపోతే రాత్రి భోజనం ఏర్పాటు చేసి వర్షం తగ్గిన తర్వాత వాహనాన్ని ఏర్పాటుచేసి విద్యార్థులను గృహాలకు పంపాలని కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా మఠంపల్లి మండలం చౌటపల్లి గ్రామంలో మేళ్లచెరువు వెళ్లే రోడ్డు బ్రిడ్జిపై నీరు ప్రవహిస్తుండగా ప్రజలు వెళ్లకుండా గ్రామపంచాయతీ సిబ్బందిఅక్కడే ఉండి జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. తుంగతుర్తి పరిధిలో సంగెం గ్రామంలో భారీ వర్షాలకు తెగిన రోడ్డును సూర్యాపేట ఆర్డీవో వేణుమాధవ్ బుధవారంపరిశీలించారు. తిరుమలగిరి మండలం తొండ గ్రామంలో వర్షానికి ఇబ్బందులు పడ్డ వారికి లైన్స్ క్లబ్ తొర్రూరు వారి సహకారంతో 39 కుటుంబాలకు వారానికి సరిపడా నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్లో 24 గంటల పాటు అందుబాటులో ఉండేలా కంట్రోల్‌రూమ్ ఏర్పాటు ఏర్పాటు చేశారు. ఎవరికైనా సహాయం కావాలంటే 6281 492 368 నెంబర్‌కి ఫోన్ చేసి సమాచారం అందజేస్తే వెంటనే సహాయక చర్యలు చేపడతామని కలెక్టర్ ప్రజలకు సూచించారు.

# నిండుకుండల్లా ప్రాజెక్టులు

### అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి: మంత్రులు తుమ్మల, పొంగులేటి


### పొంగి ప్రవహిస్తున్న పాలవాగు



**ఖమ్మం, బ్యూరో ప్రభాతవార్త:** ఉమ్మడి జిల్లా వ్యాప్తం గా బుధవారం నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ప్రజాజీవనం స్పందించిపోయింది మరో రెండు రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించడంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది ఉమ్మడి జిల్లాను ప్రభుత్వం రెడ్ అలర్ట్ గా ప్రకటించింది అధికార యంత్రాంగం ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి ఎలాంటి ఆస్తి నష్టం ప్రాణం నష్టం జరగకుండా చూడాలని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు పొంగలేటి శ్రీనివాస్ రెడ్డిలు ఉమ్మడి జిల్లా కలెక్టర్లకు విజ్ఞప్తి చేశారు ఎప్పటికప్పుడు లోతట్టు ప్రాంత ప్రజానీకాన్ని మైదాన ప్రాంతా లకు తరలించాలని వరద నీరు నిలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఉమ్మడి జిల్లా కలెక్టర్లను కోరారు. ఉద్యోగులు ఎవరికి సెలవులు ఇవ్వద్దని అందరూ విధి నిర్వహణలో ఉండాలని హితవు పలికారు చెరువులు కుంటలు కాలువలకు గళ్ళు పడకుండా ఎప్పటికప్పుడు నీటిపారుదల శాఖ అధికారులు పర్యవేక్షి ంచాలని పేర్కొన్నారు ఎక్కడైనా చెరువులు కుంటలు కాలువలకు గళ్ళు పడితే వెంటనే పూడ్చివేయాలని వివరించారు. ఖమ్మం జిల్లాలో 39 మిల్లీమీటర్ల వర్షపాతం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 12 మిల్లీమిటర్ల వర్షం నమోదయింది ఉమ్మడి జిల్లాలోని ఎర్రుపాలెం మండలంలో 54 మిల్లీమీటర్లు నేలకొండపల్లిలో 16.4 నగర్లో 16.2 ముదిగొండలో 13.4 పినపాకలో 27.3 ఇల్లందులో 15 మణు గూరులో 24, దమ్మపేటలో 40 ఇల్లందులో 15.3 మిల్లీమీటర్ల చొప్పున వర్షపా తం నమోదయింది మున్నేరు నీటి ప్రవాహం పెరగటంతో ఖమ్మం సీపీ సునీల్ దత్ ఖమ్మం కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో పాటు అధికార యంత్రాంగం ఆ ప్రాంతాలను పరిశీలించి లోతట్టు ప్రాంత వాసులు వెంటనే ఖాళీ చేయాలన్నారు. ప్రధానంగా ఇరిగేషన్ ప్రాజెక్టులైన పాలేరు వైరా లంకాసాగర్ బేతపల్లి తాలిపేరు ప్రాజెక్టులు పొంగి ప్రవహిస్తున్నాయి, కొన్ని ప్రాంతాలలో సాగులో ఉన్న వరి పొలాలు వరద ప్రవాహానికి కొట్టుకుపోవటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# సింగూరు ప్రాజెక్టు క్రస్ట్ గేట్లు ఎత్తివేత

### ఇన్ ఫ్లో 4,336 క్యూసెక్కులు, అవుట్ ఫ్లో 8,959 క్యూసెక్కులు




**పుల్‌కల్,అగస్టు 13ప్రభాతవార్త:** పుల్కల్ మండలంలోని ఎం. బాగారెడ్డి సింగూరు ప్రాజెక్టుకు పెద్ద ఎత్తున వరద నీటి ప్రవా హం వస్తున్నది. ఎగువ ప్రాంతాలైన కర్ణాటక, మహారాష్ట్రలలో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రాజెక్టులోకి వరద తీవ్రత అం తకంతకు పెరుగతున్నది.బుధవారం సాయంత్రానికి ప్రాజెక్టులోకి 4.338 క్యూసెక్కుల నీరు వరద రూపంలో వచ్చి చేరుతున్నట్లు నీటి పారుదల శాఖ అధికా రులు తెలి పారు.ప్రాజెక్టు 11వ నంబరు క్రస్టు 1.5 మీటరు ఎత్తు ఎత్తి నీటిని దిగువకు వదిలారు. ఇం దులో క్రస్ట్ గేట్ ద్వారా 7,694 క్యూసెక్కులు, జెన్కో గేట్ ద్వారా 1.265 క్యూసెక్కులు మొత్తంగా 8.959 క్యూసెక్కుల నీరు దిగువకు వెళుతున్నట్లు ఆ శాఖ అధికారులు వెల్లడిం చారు. కాగా ప్రాజెక్టులో 29.917 టీఎంసీల నీటి సామర్థ్యానికి గాను, ప్రస్తుతం ప్రాజెక్టులో 22284 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదలవుతున్న దృష్ట్యా మత్స్యకారులు. గొర్రెల కాపరులు నది పరివాహక ప్రాంతానికి వెళ్ళ కూడదని పుల్కల్,చౌటకూర్ తహసీలార్లు కృష్ణ, అనుదీప్‌లు సూచించారు.

# కృష్ణమ్మ పరుగులు



**ప్రభాతవార్త , నాగార్జునసాగర్ ఆగస్టు 13:** రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎడతెరిపి లేకుండా భారీగా వానలు దంచి కొడుతున్నాయి. ఎగువనున్న శ్రీశైలం ప్రాజెక్టు నుంచి నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు భారీగా వరద ఉధృతి కొనసాగుతుంది, శ్రీశైలంప్రాజెక్టు ఇన్ ఫ్లో,1,89,651 వేల క్యూసెక్కులు నీరు కొనసాగుతుండగా,ప్రాజెక్టు,నుంచి,ఔట్‌ఫ్లో,254784,క్యూసెక్కుల,నీరు నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు విడుదల అవుతుంది,ప్రాజెక్టు నుంచి 26 ప్రధాన రేడియల్ క్రస్ట్ తెరిసి నీటిని దిగకు విడుదల చేస్తున్నారు,బుధవారం సాయంత్రానికినాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు,కాగా ప్రస్తుత నీటిమట్టం588.90,అడుగులకు చేరుకుంది,ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిసామర్థం 312.0450 టీఎంసీలు కాగా ప్రస్తుతం 308.7614,టీఎంసీల నీరు నిల్వ ఉంది,సాగర్ నుంచి కుడి కాల్వ ద్వారా 4050,క్యూసెక్కులు,ఎడమ కాల్వ నిల్ గా వుంది,మెయిన్ పవర్ హౌస్ ద్వారా 28705,క్యూసెక్కులు ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800క్యూసెక్కులు, ప్రాజెక్ట్ నుంచి ఔట్‌ఫ్లో 296645 విడుదల వుతుండగా, ప్రాజెక్టు రేడియేల్ 26 క్రస్ట్ గేట్ల ద్వారా, 262090, క్యూసెక్కుల నీరు విడుదలవు తుంది, ఇందులో 8గేట్లు పది అడుగులు, 18గేట్లు ఐదు అడు గులు,తెరిచి నీటిని నీటిని విడుదల చేస్తున్నారు.

# పికప్ వ్యాన్ ట్రక్కు ఢీ: 11 మంది మృతి



**దౌసా,(రాజస్థాన్), ఆగస్టు 13:** రాజస్థాన్‌లో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 11మంది స్పాట్లోనే మరణించారు. రాజస్థాన్ లోని దౌసాజిల్లాలో బుధవారం తెల్లవారు జామున ప్యాసింజర్ పికప్ వ్యాన్ ట్రక్కును ఢీకొట్టడంతో ఏడుగురు చిన్నారులు సహా 11మంది మరణించారు. మరో 9మంది తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహా యక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను వెంటనే ఆసు పత్రికి తరలించారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు చెప్పారు. బాధితులంతా ఉత్తర ప్రదేశ్‌కి చెందిన వారుగా తెలుస్తోంది. వీరంతా ఖాతు శ్యామ్, సాలాసర్ బాలాజీ ఆలయాలకు సందర్శించి తిరిగి వస్తుండగా మనోహర్పూర్ హైవేపై తెల్లవారు జామున 4గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగిందని దౌసా పోలీసు సూపరింటెండెంట్ సాగర్ తెలిపారు. ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన పికప్ వ్యాన్‌లో 20మంది ప్రయాణిస్తున్నారని, హైవే సర్వీస్ లేన్‌లో ఆగి ఉన్న వ్యాన్ ఢీకొట్టిందని అధికారులు చెప్పారు. గాయపడిన ముగ్గురువ్యక్తులు స్థానిక ఆసుపత్రిలో చికిత్స పొందు తున్నారని, తొమ్మిదిమందిని తదుపరి వైద్యసంరక్షణ కోసంసూచించామని చెప్పారు. ఈప్రమాదంపై రాజస్థాన్ ముఖ్యమంత్రిభజన్‌లాల్ శర్మ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.

## మంత్రి శ్రీధర్‌బాబుకు అరుదైన గౌరవం

### ఇండియాస్ 100 మోస్ట్ ఇన్‌ఫ్యూయెన్షియల్ పీపుల్ ఇన్ ఎఐ-2025 జాబితాలో చోటు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఆగస్టు12:** రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు అరుదైన గౌరవం దక్కింది. అనలిటిక్స్ ఇండియా మ్యాగజైన్ తాజాగా ప్రకటించిన ఇండియాస్ 100 మోస్ట్ ఇన్‌ఫ్లూయెన్షియల్ పీపుల్ ఇన్ ఏఐ – 2025 జాబితాలో ఆయనకు చోటు లభించింది. తమ సమర్థవంతమైన నాయకత్వం, నూతన ఆవిష్కరణలకు ప్రోత్సాహమిస్తూ భారత్ ను ఏఐ రంగంలో అగ్రగామిగా తీర్చి దిద్దేందుకు కృషి చేస్తున్న వ్యక్తులకు ఇందులో చోటు కల్పించారు. విధాన రూపకర్తల విభాగంలో మంత్రి శ్రీధర్ బాబుతో పాటు కేంద్ర మంత్రులు అశ్విని వైష్ణవ్, పీయూష్ గోయల్, కేంద్ర మాజీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్, ఇండియా ఏఐ మిషన్ సలహాదారు ఆకృత్ వైష్, ఇండియా ఏఐ మిషన్ సీఈవో, ఎన్ఐసీ డైరెక్టర్ జనరల్ అభిషేక్ సింగ్, ఎన్ పీసీఐ సీఈవో దిలీప్ అస్బే, నీతి ఆయోగ్ మాజీ సీఈవో అమితాబ్ కాంత్, నాస్కామ్ మాజీ అధ్యక్షులు దేబజాని ఘోష్ తదితర ప్రముఖులను ఎంపిక చేసినట్లు నిర్వాహకులు ప్రకటించారు. మంత్రి శ్రీధర్ బాబు నాయకత్వంలో ఏఐ రంగంలో తెలంగాణ ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ మారిందని, అందుకే ఆయనను ఈ జాబితాలో చేర్చినట్లు అనలిటిక్స్ ఇండియా మ్యాగజైన్ నిర్వాహకులు ప్రకటించారు.

**సీఎం రేవంత్ రెడ్డి ప్రోత్సహంతోనే ఈ గుర్తింపు ; మంత్రి శ్రీధర్ బాబు :** ఇది నా ఒక్కడికి లభించిన గుర్తింపుకాదు. యావత్తు తెలంగాణ ప్రజలకు దక్కిన గౌరవం. సమ్మిళిత వృద్ధి, మెరుగైన జీవితాలను అందించేందుకు ఏఐని వినియోగించాలన్న మా ప్రభుత్వ సుదూర దృష్టికి ఈ గుర్తింపు నిదర్శనం. సీఎం రేవంత్ రెడ్డి ప్రోత్సాహంతోనే నాకు ఈ జాబితాలో చోటు దక్కింది. ఆయన నాయకత్వంలో తెలంగాణను ఏఐ కేపిటల్ ఆఫ్ ది గ్లోబ్ గా తీర్చిదిద్దేలా పకడ్బందీ కార్యాచరణతో ముందుకెళ్తున్నాం. నూతన ఆవిష్కరణలకు సమాన్యాన్ని జోడించి, సాంకేతిక పురోగతి ఫలితాలు రాష్ట్రంలోని ప్రతి పౌరుడికి అందేలా కృషి చేస్తున్నామని చెప్పారు.

## వారంరోజుల్లో లొంగిపోవాలని రెజ్లర్ సుశీల్‌కు సుప్రీం ఆదేశం

**న్యూఢిల్లీ, ఆగస్టు 13:** ఒలింపిక్ పతక విజేత రెజ్లర్ సుశీల్‌కుమార్‌కు ఇచ్చిన బెయిల్‌ను సుప్రీంకోర్టు రద్దుచేసింది. వారం రోజుల్లో లొంగిపోవాలని ఆదేశించింది. గత మార్చి నాలుగోతేదీ ఢిల్లీ హైకోర్టుజారీచేసిన బెయిల్ ఉత్తర్వులను జస్టిస్ సంజయ్ కరోల్,జస్టిస్‌ప్రశాంత్‌కుమార్ మిశ్రాతో కూడిన సుప్రీంకోర్టు బెంచ్ రద్దుచేసింది. జూనియర్ జాతీయ రెజ్లింగ్ ఛాంపియన్‌సాగర్ ధన్కర్ హత్యకేసులో సుశీల్‌కుమార్‌పై తీవ్ర ఆరోపణలు వచ్చాయి. తనకుమారుడి హత్యకేసులో నేరారోపణలు ఎదుర్కొంటున్న సుశీల్‌కుమార్‌కు ఇన్నిరోజులు బెయిల్ ఇవ్వడంపై సాగర్ తండ్రి అశోక్ ధన్కర్ సుప్రీంకోర్టులో పిటిషన్ వేసారు. కుమార్ తరపున ప్రముఖ న్యాయవాది మహేశ్ జెత్మలానీ, ధన్కర్ తరపున సిద్ధార్థ మృదుల్ వాదనలు వినిపించారు. 2021లో ఢిల్లీ ఛత్రసాల్ స్టేడియంలో ధన్కర్‌తోపాటు ఆతడి ఇద్దరుస ఏహితులపైసుశీల్‌కుమార్ దాడి చేసినట్లు కేసులు నమోదయ్యాయి. ఈ కేసులో తీవ్ర గాయాలతో ధన్కర్ ప్రాణాలు విడిచినట్లు పోస్టుమార్టంలో తేలింది. అరెస్టునుంచి 18 రోజులపాటు సుశీల్‌కుమార్ తప్పించుకున్నాడు. చివరికి ముంద్కా ప్రాంతంలో ఒక అథ్లెట్‌నుంచి నగదు తీసుకుని పరారవుతుండగా పోలీసులు పట్టుకున్నారు.

## కేంద్ర నిరక్ష్యంపై పోరాటం: వ్యవసాయ మంత్రి తుమ్మల

**హైదరాబాద్, ఆగస్టు 13, ప్రభాతవార్త :** రాష్ట్రానికి అవసరమైన యూరియా ఎరువుల సరఫరాలో కేంద్రం నిర్లక్ష్యం చూపుతోందని, దీనిపై పోరాటం చేస్తామని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. రైతులతో, వ్యవసాయంతో కేంద్రం ఆటలాడుతోందని ఆరోపించారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటనలో రాష్ట్రం తరఫున ఎన్ని లేఖలు రాసిన కూడా చేసింది ఏమీ లేదన్నారు. కేంద్రం రాష్ట్రం మీద సవతి తల్లి ప్రేమను చూపిస్తుందని చెప్పారు. ఈ ఖరీఫ్‌లో రాష్ట్రానికి 9.80 లక్షల టన్నుల యూరియా కేటాయించినా, ఏప్రిల్ నుండి జూలై వరకు 32 శాతం కొరత ఏర్పడిందని తెలిపారు. ఈ నెలలో అవసరం 3 లక్షల టన్నులని ముందుగానే తెలియజేసినా, కేంద్రం రిక్త హస్తము ఇచ్చిందని విమర్శించారు. ఏప్రిల్–జూలై నెలల్లో ఏర్పడిన 2.10 లక్షల టన్నుల కొరతతో పాటు ప్రస్తుత నెలలో ఉన్న 57 వేల టన్నుల లోటును భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## అన్నమయ్యకీర్తనలు భక్తప్రపంచానికి అందాలి

### రాష్ట్రస్థాయిలో యువతకు పోటీలు నిర్వహించాలి :టిటిడి ఇఒ శ్యామలరావు

**తిరుమల,ఆగస్ట్ 13ప్రభాతవార్తప్రతినిధి:** అన్నమయ్య కీర్తనలను సకాలంలో రికార్డ్‌చేసి భక్తప్రపంచానికి అందించేలా చర్యలు తీసుకోవాలని టిటిడి ఇఒ జె.శ్యామలరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. అన్నమయ్య 14,973 కీర్తనలను ఆలపించారని, ఇందులో 4,850 కీర్తనలను ఎస్వీ రికార్డింగ్ ప్రాజెక్ట్‌రికార్డుచేసి 4,540 కీర్తనలను మాత్రమే అప్‌లోడ్‌చేశారన్నారు. అన్నమయ్య కీర్తనలపై రాష్ట్రస్థాయి,ప్రాంతీయస్థాయి. జిల్లాస్థాయిలో పోటీలు నిర్వహించి యువతను భాగస్వామ్యం చేయాలని సూచించారు. అన్నమాచార్యప్రాజెక్టుపై బుధవారం రాత్రి టిటిడి ఇఒ శ్యామలరావు ,జెఇఒ వీరబ్రహ్మం, ధార్మికప్రాజెక్టుల ప్రత్యేక అధికారి రాజగోపాల్; అన్నమాచార్యప్రాజెక్ట్ సంచాలకురాలు డాక్టర్‌సి.లత, ఎస్వీరికార్డింగ్ ప్రాజెక్ట్ ప్రత్యేక అధికారి విబీషణశర్మతో సమావేశం నిర్వహించారు.అన్నమయ్యకీర్తనలను ప్రాచుర్యంలోనికి తీసుకువచ్చేందుకు యూట్యూబ్‌ఛానెల్ ఏర్పాటు అంశాన్ని పరిశీలించాలన్నారు.

## వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో అందరికీ శుభాలు కలగాలి

**తిరుమల,ఆగస్ట్ 13ప్రభాతవార్తప్రతి నిధి:** కలియుగప్రత్యక్షదైవమ్ ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలకు శుభాలు కలగాలని, సుఖసంతోషాలతో ఉండాలని దేవుని ప్రార్థించినట్లు పలువురు ప్రముఖులు తెలిపారు. బుధవారం ఉదయం తెలంగాణ బిజెపి నేత విష్ణువర్ధన్‌రెడ్డి, నిజామాబాద్ ఎమ్మెల్యే సూర్యనారాయణ ఉదయం విఐపి బ్రేక్‌లో వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## అమెరికాలోనూ శ్రీవారి ఆలయం నిర్వహణ అద్భుతంగా ఉంది

### తెలంగాణ మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్

**తిరుమల,ఆగస్ట్ 13ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో తెలుగురాష్ట్రాల ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని, అమెరికాలోనూ శ్రీవారి ఆలయం నిర్వహణ అద్భుతంగా ఉందని తెలంగాణమాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. తిరుమల గతంలోకంటే ఇప్పుడు చాలా బావుందని, ఆలయంలోపల చక్కటి దర్శన ఏర్పాట్లు చేశారని అభినందించారు. తెలంగాణ నుండి తిరుమలకు వచ్చే భక్తులకు టిటిడి మంచి దర్శనాలు చేయిస్తోందన్నారు. తెలంగాణ,ఆంధ్రప్రదేశ్‌రాష్ట్రాల తెలుగువారంతా ఒక్కటేనని అన్నారు. తెలంగాణలో ఉన్న ఆంధ్రవాసులూ ఆత్మీయులేనని మాజీమంత్రి వ్యాఖ్యానించారు. దేవుని ఆశీస్సులతో తెలుగురాష్ట్రాల్లో మంచివర్షాలు కురుస్తున్నాయని, నీటికొరత లేదన్నారు.

**తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద ఒక క్రొత్త రాజకీయ పార్టీగా రిజిస్ట్రేషన్ కావడానికి జారీచేయబడిన నోటీసు**

**(తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘము ఆదేశములతో ప్రచురించబడినది)**

తేది:14/08/2025

రాజకీయ పార్టీల రిజిస్ట్రేషన్ మరియు గుర్తుల కేటాయింపు ఉత్తర్వు, 2018 యొక్క నిబంధనలకు లోబడి **మజ్దూర్ జనతా పార్టీ** (పార్టీ పేరు) అధ్యక్షులు అయిన **శ్రీ రాపెల్లి శ్రీనివాస్** గారు తమ పార్టీని 'రిజర్వు గుర్తు లేని రాజకీయ పార్టీగా' తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద నమోదు చేసుకొనుటకై అభిలషిస్తున్నట్లు సాధారణ ప్రజానీకానికి తెలియజేసేందుకు ఈ నోటీసు ఇవ్వడమైనది. ఈ పార్టీలో **(1) శ్రీ రాపెల్లి శ్రీనివాస్**గారు **అధ్యక్షులు, (2) శ్రీ మిర్జా ఆసీపుల్లా బేగ్**గారు **ప్రధాన కార్యదర్శి, (3) శ్రీ పోశెట్టి సాయినోల్ల** గారు **కోశాధికారి,** ప్రధాన కార్యవర్గ సభ్యులు మరియు పార్టీ యొక్క ప్రధాన కార్యాలయము ఇ.నెం. 1-13-410, మొదటి అంతస్తు, మహాలక్ష్మినగర్, రోడ్‌నెం.1, న్యూహౌసింగ్ బోర్డ్ ఎదురుగా, వినాయక్‌నగర్, హైదరాబాద్ రోడ్, నిజామాబాద్-503001 తెలంగాణ రాష్ట్రం, భారతదేశం; సదరు పార్టీ రిజిస్ట్రేషనుపై ఎవరికైనా ఏవిధమైన అభ్యంతరాలు ఉన్నట్లయితే, అట్టి అభ్యంతరాలను కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘము, మొదటి అంతస్తు, DTCP భవనము, A.C గార్డ్స్, హైదరాబాద్-500 004 గారికి ఈ ప్రకటన ప్రచురితమైన పదిహేను రోజుల్లోగా పంపవలెను. నిర్ణీత గడువులోగా అభ్యంతరాలు రానియెడల, తెలంగాణ రాష్ట్రములో పార్టీల పరంగా జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసేందుకు **మజ్దూర్ జనతా పార్టీ** (పార్టీ పేరు) ను ఒక రాజకీయ పార్టీగా నమోదు చేయు ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల సంఘం చేపడుతుంది.

అధ్యక్షులు,
**రాపెల్లి శ్రీనివాస్,**
**మజ్దూర్ జనతా పార్టీ**

వార్త

తోటి వారికి మీ వల్ల హెచ్చు ఉపకారమూ, సాధ్యమైనంత తక్కువ అపకారమూ జరిగేటట్లు చూసుకోవడమే సరైన ప్రవర్తన.

-హెచ్. లాంగ్‌ఫెలో

# ఈ వాచాలత దేనికోసం?


ఇరు దేశాల మధ్య లేదా ఇరు వర్గాల మధ్య సంబంధాలు బెడిసికొట్టినప్పుడు అటువారు ఇటు వారిపై, ఇటు వారు అటువారిపై వ్యాఖ్యలు చేసేటప్పుడు ఎంతో సంయమనం అవసరం. కానీ దాయాది దేశం ఎన్నోసార్లు భంగపడినా ఇండియాపై తన వాచాలత ప్రదర్శిస్తూనే ఉంది. మీదు మిక్కిలి పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఆసిఫ్ మునీర్ మాత్రం అనేకసార్లు తమ దేశ వైషమ్యాలను పదేపదే కుట్రపూరిత మాటలతో హెచ్చరికలతో భారత్ మీద తెగబడుతున్నాడు. ఒకపక్క రెండు దేశాల మధ్య 'కాల్పుల విరమణ ఒప్పందం' అమలులో ఉన్నా మునీర్ మాత్రం తన అక్కసునంతా వెళ్లగక్కుతున్నారు. తన ద్వేషపూరిత వ్యాఖ్యానాలతో భారత్‌కు హెచ్చరికలు పంపడంలో ద్వేషాన్ని రగల్చడంలో ఆయనకు ఆయనే సాటి. ఆ కారణంచేతనే ఆనాటి పుల్వామా దాడి జరిగింది. పహల్గామ్‌లో యాత్రికులపై ఉగ్రదాడి జరిగిందంటే మునీర్ వ్యాఖ్యల పర్యవసానమే. ఉగ్రదాడులకు ప్రేరేపించింది. ఇన్నాళ్లు తన స్వదేశంలో నుంచే భారత్ మీద అవాకులు చవాకులు పేలిన అసీంతాజాగా అమెరికా గడ్డ మీదనుంచి భారత్‌కు హెచ్చరికలు చేస్తున్నాడు. అమెరికా నుంచి ఆ దేశ మిత్రదేశమైన భారత్‌పై ప్రేలాపనలుఎవరి వత్తాసుతో చేసినవో అర్థంచేసుకోలేని పరిస్థితి లేదు. భారత్ ఈ విషయంలో ఎంతో అప్రమత్తమై ఉన్నా యుద్ధకాంక్షతో ఉన్న పాక్ వైపరీత్యాలను అడుగడుగునా గుర్తించి ఎదుర్కోవాల్సిందే. ఇప్పుడు భారత్ అదే ధోరణిలో ముందడుగు వేస్తోంది. అమెరికా భారత్‌తో ట్రేడ్ డీల్స్ కుదుర్చుకోవడానికి ఒత్తిడి చేసే క్రమంలో పాక్‌ను ప్రయోగిస్తోందనే అభిప్రాయం కలుగుతోంది. భారతదేశ విభజన క్రమంలో దాదాపు పదిలక్షల మంది ఊచకోతకు గురయ్యారు. ఆ తర్వాతైనా ఎవరికి వారు వారి దేశాలను అభివృద్ధి చేసుకోవడంలో నిమగ్నమవ్వాల్సి ఉండగా పాకి స్థాన్ భారత్‌పై కయ్యానికి కాలుదువ్వుతోంది. నిన్నమొన్నటి కాల్పుల విరమణతో బుద్ధి తెచ్చుకోవాల్సింది పోయి పాక్ మళ్లీ మునీర్‌ను ముందుకు తెస్తోంది. మరోపక్క బెనజీర్ భుట్టో తనయుడు బిలావల్‌భుట్టో కూడా భారత్‌పై రెచ్చిపోతున్నాడు. పహల్గాం ఉగ్రదాడి అనంతరం పాక్‌తో సింధుజలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేసింది. ఇప్పుడు సింధుజలాల గురించి పాక్ ఆర్మీ అధ్యక్షుడు ఆసిం మునీర్, బిలావల్ ఇద్దరూ కవ్వింపు మాటలు మాట్లాడుతున్నారు. సింధు నదిపై భారత్ ఆనకట్ట కడితే క్షిపణులతో పేల్చేస్తామని అమెరికాలోని ప్రవాస పాకిస్థానీయుల సభలో ఆసిమ్ మునీర్ అన్న మాటలివి. భారత్ అనేది తళతళమెరిసే మెర్సిడెస్, హైవేపై ఫెరారీలా పరుగెడ్తుంది. పాకిస్థాన్ ఇసుక రాళ్లతో నిండిన డకోటా ట్రక్కు. ఎవరు ఎవరిని ఢీకొంటే ఎంత నష్టమో అర్థం చేసుకోవడం మంచిదని మునీర్ హితోక్తి హెచ్చరికలు చేస్తున్నాడు. పాకిస్థాన్‌తో పెట్టుకుంటే భారత్‌కు నష్టమని పాక్ ఆర్మీచీఫ్ వ్యాఖ్య. మేం మునిగితే సగం ప్రపంచాన్ని తమతోనే తీసుకెళ్తామని అందుకు అణుప్రయోగంసిద్ధంగా ఉందని హెచ్చరికలు చేశాడు. పాక్ ఉనికికి ముప్పువాటిల్లు తోందంటే చూస్తూ ఊరుకోబోమని, సగం ప్రపంచాన్ని తమతో తీసుకెళ్తామని యుద్ధం తీసుకొస్తామన్న ఆరోపణలు చేశారు. మునీర్ చేసిన వ్యాఖ్యలన్నీ భారత్ లక్ష్యంగాచేసినవే. అమెరికాలో ఉండగా మరో దేశస్థుడెవరూ భారత్ మీద అణుబెదిరింపులు చేయరు, చేయలేరు. కానీ మునీర్ తనకు ట్రంప్ ఇస్తున్న ప్రాముఖ్యాన్ని బట్టి భారత్ మీద మరింత రెచ్చిపోయాడు. పాకిస్థాన్ వద్ద క్షిపణులకుకొదవేం లేదు. కాల్పుల విరమణ సందర్భంగా జరిగిన వ్యవహారంలో భారత్‌కు స్పష్టత లేనందున మునీర్ తన పాక్‌ను మోస్తూ యుద్ధకాంక్షను వ్యక్తం చేస్తున్నాడు. ఇదంతా విభజన తాలూకు ఆవేదన, ఇటీవల యుద్ధాల్లో తోకముడిచిన సందర్భంలో అక్కసు. తాజాగా యుద్ధ సమయంలోభారత్ తీసుకున్న కఠిన చర్యలు కారణంగా పాక్ రగిలిపోతోంది. దీనికితోడు పాక్‌కు అనవసర ప్రాధాన్యత కల్పించడంతో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చర్యలు కూడా అగ్నికి ఆజ్యం పోస్తున్నట్లుగా ఉంది. ఇకపోతే పాకిస్థాన్ మాజీ మంత్రి బిలావల్ భుట్టో సింధుజలాల ఒప్పందం ఇలాగే కొనసాగితే భారత్‌పై యుద్ధం తప్పమరో ప్రత్యామ్నాయం ఉండదని తేల్చి పారేశారు. కాల్పుల విరమణ జరిగి మూడు నెలలు అయిపోయింది. భారత్ కూడా సర్దుకుంటోందనే అంచనాతో పాక్ ప్రధాని కూడా యూటర్న్ తీసుకున్నట్లు మాట్లాడుతున్నారు. పరోక్షంగా కూడా ఆయనకు భారత్‌తో సంధి కలిసి రాదనే ఉద్దేశంతో ఉన్నారు. అయితే భారత ప్రధాని నరేంద్రమోడీ 'ఆపరేషన్ సిందూర్' కొనసాగుతూనే ఉందనిభారత్ సైన్యం అప్రమత్తంగానే ఉన్నందున ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోగలమన్న ఆలోచనతో ఉన్నారు. పాక్‌కు బుద్ధి చెప్పే ప్రయత్నంలో సింధు నదీ జలాల ఒప్పందం అమలును భారత్ ఆపేసింది. దాంతో పాక్‌లో నదీ జలాల కొరత ఏర్పడింది. పండే పంటలకు కూడా నీళ్లు అందని పరిస్థితి. ఈ నేపథ్యంలో బిలావల్ ప్రజల తరపున తానున్నానంటూ చెప్పుకునే ప్రయత్నంలో భారత్‌కు వార్నింగ్ ఇచ్చారు. పాక్‌లోని అన్ని ప్రావిన్స్‌ల ప్రజలు భారత్‌తో పోరాడేందుకు ముందుకు కదిలి భారత్‌ను ఓడిస్తారని, భారత్‌కు ఓటమి తప్పదన్న ధోరణిని వ్యక్తం చేశారు. సింధునదీ జలాల ఒప్పందం నిలుపుదలతో 250మిలియన్‌ల మంది పాకిస్థాన్ వాసులకుఆహార కొరతఏర్పడే ప్రమాదముందని ఆదేశ ఆర్థిక వేత్తల అంచనా. మళ్లీ అలాంటి పరిస్థితి ఏర్పడకుండా భారత్‌తో చెలిమికి ముందడుగు వేయాల్సిన పాకిస్థాన్ యుద్ధ జ్వాలలు రేకె త్తించే ప్రయత్నాల దిశగా కదులుతోంది. ఈ దశలో పాక్ దుశ్చేష్టలపైన, ట్రంప్ ఆగడాలపైన ఓ కన్నేసి ఉండాల్సిన సమయం ఆసన్నమైంది.

అభ్యుదయాన్ని సాధించాలి అంటే చరిత్రను పునరావృతం చేయడం కాదు. కొత్త చరిత్రను సృష్టించాలి.



మహాత్మా గాంధీ

మనం స్వీకరించే ఆనందం కన్నా మరొకరికి ఆనందం పంచడం వల్ల మనకు మరింత ఆనందం లభిస్తుంది.



షేక్స్పియర్

## ప్రజావాక్కు



### నిజాయితీకి తూట్లు..

ఆంధ్రప్రదేశ్ ఇంటర్ విద్యావ్యవస్థలో రెగ్యులర్, ఎం.టి.ఎస్, పార్ట్ టైం, కాంట్రాక్ట్, గెస్ట్ అని ఐదు రకాల నియామకాలతో ప్రభుత్వం ద్వారా తరగతులు నడుస్తున్నాయి. అందరు చేసేది పని ఒకటే. కాని వేతనాల వ్యత్యాసం కొండకు కొమ్మకు ఉన్నంత ఉంటుంది. వీరిలోనే అన్ని రకాలఉన్నత విద్యావంతులున్నప్పటికీ గౌరవ మర్యాదల్లో కూడా చాలా వ్యత్యాసముంటుంది. ఏదో ఒక రూపంలో పని చేయించుకొని పబ్బంగడుపుకొనే ధోరణే తప్ప మానవతా దృక్పథంతో ఆలోచించేవారు లేరు. అంతే కాదు గెస్ట్ లెక్చరర్ల వంటికొన్ని నియామకాలు, అనుభవానికి, ఉన్నత విద్యలకు, అవకాశమివ్వాలని ఉన్నతాధికారుల గైడెన్స్ ఉన్నప్పటికీ, ప్రజాప్రతినిధులు సిఫారసు చేసినప్పటికీ లక్ష్య పెట్టక అక్కడి అధికారులు లంచాలు, బంధుప్రీతితో తన జాబులో పనిలా తమకనుకూలురను నియమించుకొని నిజాయితీకి తూట్లు పొడిచారు.

- డా.దన్నాన అప్పలనాయుడు, చీపురుపల్లి

### వైవిధ్యమే దేశ బలం

భారత దేశ వైవిధ్యం గురించి మనం పుస్తకాలలో భారత దేశ వైవిధ్యమే భారత దేశ బలం అని చదివాము. కానీ ఇప్పుడు ఆ వైవిధ్యత స్థానాన్ని ఆధిపత్య భావనలు ఆక్రమించాయి. అయితే ఆవైవిధ్యత కేవలం మనుషుల మధ్యనే కాదు జీవరాశుల మధ్య కూడా ఉంది. తెలంగాణలో కూడా దక్కని ఉర్దూ భాషా ఈ ప్రాంత సంస్కృతిలోను సాంప్రదాయంలోను కలిసి ఈ ప్రాంతానికి వైవిధ్యం అందించింది. కానీ ఈ దేశ పాలకులు బీహార్‌లో చేస్తున్నదేమిటి సర్ పేరుతో దేశ పౌరులకు ఓటు లేకుండా చేస్తున్నారు.

- భారత అవినాష్, జనగామ

### బలి పశువులను చేస్తున్నారు

ఎలక్షన్ కమిషన్ పై రాహుల్ గాంధీ పేల్చిన బాంబు చిన్నదేమి కాదు. ఓట్లు చోరీ జరిగిందని నిరూపించడానికి ఆయన విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఈనాటికి కూడా ఇంకా పాత పద్ధతిలోనే ఓటింగ్ జరుపుతున్నారు. రాజకీయపార్టీలు రాజకీయ నాయకులు వారి వ్యక్తిగత ప్రయోజనాల కోసం పార్టీ ప్రయోజనాల కోసం, ఉన్నత అధికారులను, ఉద్యోగులను బలి పశువులుగా చేస్తూ ఉంటారు.

- వీరగంట భాస్కర్ రావు,బొబ్బిలి

### మాతృభాషలో విద్యకు ప్రాధాన్యమివ్వాలి

భారత విద్యావ్యవస్థలో రోటు లెర్నింగ్ పద్ధతి ఇంకా ప్రబలంగా ఉంది. విద్యార్థులు పాఠ్యాంశాలను కంఠస్థం చేయడంలోనే పరిమితం అవ్వడంతో, వారి ఆలోచన శక్తి, సృజనాత్మకత, సమస్య పరిష్కార నైపుణ్యాలు పరిమితమవుతున్నాయి. ఈ పరిస్థితిని మార్చేందుకు సృజనాత్మకత, లేటరల్ థింకింగ్, సాఫ్ట్ స్కిల్స్ అభివృద్ధి అత్యవసరం. విద్య పరీక్షల మార్కులకు మాత్రమే పరిమితం కాకుండా, విద్యార్థుల మేధో వికాసానికి దోహదపడేలా ఉండాలి. ప్రపంచంలోని ఉత్తమ విద్యా విధానాలు వ్యక్తిత్వ వికాసం, స్వతంత్ర ఆలోచన, సృజనాత్మకతకు ప్రాధాన్యం ఇస్తున్నాయి. భారత విద్యలో కూడా ఇలాంటి మార్పులు అవసరం. పుస్తకాలతో పాటు ప్రాక్టికల్ అనుభవం ఇవ్వడం ద్వారా నేర్చుకున్న విషయాలను జీవితంలో అన్వయించగలిగే సామర్థ్యంపెరుగుతుంది. మాతృభాషలో విద్యకుప్రాధాన్యమివ్వడం భావనాత్మక స్పష్టతకుదోహదం చేస్తుంది.

-సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

### అన్నిటికి అమెరికా పై ఆధారమేనా?

మన దేశంలో విద్య నుండి ఉద్యోగం వ్యాపారం అన్నీ రంగాలు అమెరికా పై ఆధారపడుతున్నాయి. మన దేశంలో చదివి విదేశంలో ఉద్యోగం. మన దేశంలో గ్రాడ్యుయేట్ అమెరికాలో ఉన్నత విద్య. అమెరికాలో వరుడితోనే వివాహం. ఇలా ప్రతిదీ అమెరికాపై ఆధార పడుతున్నాం. వ్యాపార ఎగుమతులు దిగుమతులకు కూడా ఆ దేశంపైనే విపరీతంగా ఆధార పడిన మనం ఇప్పుడు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు అనే పరిస్థితిలోఉన్నాం. కావునా ఇకనైనా అమెరికా పై అతిగా ఆధార పడవద్దు. ప్రపంచంలో అనేక దేశాలున్నాయి అని గ్రహించాలి. అగ్రరాజ్యం అహంకారం తొలగించాలి.

-శ్రిష్టి శేషగిరి, సికింద్రాబాద్

### మూగ జీవులపై ప్రేమ

మూగ జీవులను రక్షించండి అంటూ గోలపెడుతున్న ఈ మానవతావాదులు, ఈ జంతు ప్రేమికులకు ఆ వీధి కుక్కల స్వైర్య విహారం వల్ల ఎంత మంది పసిపిల్లల ప్రణాలకు హానికరం వస్తోందో, ఎంతమంది రేబిస్ వాత పడి బాధ పడుతున్నారో కనబడుట లేదా. ఇటువంటి సమయంలో సుప్రీం కోర్ట్ వారి వాత కొంతవరకూ ఎంతో సమంజసం. జంతు జాలంపై మక్కువ చూపేవారిని ఒక డాగ్స్ క్లబ్‌గా ఏర్పడి చక్కగా చూసుకోమంటే ఒక్కడు మళ్ళీ కనపడడు.

- గార్లపాటి సీతారామయ్య, హైదరాబాద్

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ట్రంప్ టారిఫ్‌లు భారత్‌కు సమస్యే!

**ట్రంప్ రాజనీతిజ్ఞుడుగా కాకుండా రాజకీయ నాయకుడిగా ఈ రెండవ టర్మ్‌లో వ్యవహరిస్తుండటం అత్యంత దురదృష్టకరం. ప్రధాని మోడీని నిజమైన స్నేహితుడిగా అభివర్ణించి, ఆ దేశంలోని భారతీయుల సహకారాన్ని ఎన్నికలలో వాడుకోటానికి వేసిన ఎత్తుగడగా ఇప్పుడు అందరూ అంటున్నారు. అయినా ఏం లాభం! మన దేశ రాజకీయ నిపుణులు, వారి ఆలోచనలు కూడా పదును పెట్టి, వ్యూహ, ప్రతివ్యూహాలతో ఇలాంటి సమస్యలను పరిష్కరిస్తేనే భారత్ సాధించిన ఆర్థికాభివృద్ధి కుంటుపడకుండా ఉంటుంది. అమెరికా ఇప్పటికే యు.కె, ఇండోనేషియా, ఫిలిప్పైన్స్, జపాన్, సౌత్‌కొరియా దేశాలతో ఒప్పందాలు కుదుర్చుకున్నది. రష్యాతోపాటు అరబ్ దేశాలతో సామరస్య ఒప్పందాలు త్వరితగతిన ఏర్పరుచుకుంటేనే, చమురు సమస్యతోపాటు అమెరికన్ హెచ్చుటారిఫ్‌ల సమస్యను భారత్ అధిగమించగలదు. భారత్ ఈ విషయంలో వెనుకడుగు వేయదనే ప్రస్తుతం ఆశావాదంతో ఉండక తప్పదు.**



రావులపాటి సీతారాం రావు

అమెరికా 'టారిఫ్'ను ఆయుధంగా వాడి ఆర్థికంగా పోయిన ప్రాముఖ్యతను పునఃప్రతిష్టించుకోవాలని చూస్తున్నది. డొనాల్డ్ ట్రంప్ రాజకీయాల్లో ఉన్నా బిజినెస్ పరంగా ఆలోచించే నాయకుడు. అందుకనే దౌత్య వ్యవహారాల్లో ఏది ఆయన ప్రకటించినా రాజకీయ వాసన బదులు వాణిజ్య వాసనలు గుభాళిస్తుంటాయి. ఏ విధంగా ట్రంప్ తలపెట్టిన హెచ్చు టారిఫ్‌లు భారత్‌ను ప్రభావితం చేస్తాయని విశ్లేషించినప్పుడు ఆర్థిక నష్టాలు మెండుగానే ఉండే సూచనలు కనపడ్తున్నాయి. వాటిని అధిగమించడానికి భారత్ ప్రభుత్వం నడుం బిగించి కొన్ని చర్యలు తలపెట్టినట్లు ఉంది. ఆ హడావిడి ప్రభుత్వంలోని అధికారుల మాటలు, చేతల ద్వారా బహిర్గతమవుతున్నాయి. జులై 30 నాడు యు.ఎస్ ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ ఇండియా దేశ దిగుమతులపై 25 శాతం టారిఫ్‌తోపాటు పెనాల్టీలు వేస్తున్నట్లుగా ప్రకటించడం అందరికీ తెలిసిన విషయమే. ఈ ప్రకటనతో ముందు ముందు అమెరికాతో చేసుకోబోయే ద్వైపాక్షిక ఒడంబడికల ప్రభావం ఏరకమైన అనిశ్చిత వాతావరణం భారత్ ఆర్థిక స్థితిగతులపై ఉంటుందో అని ఆర్థిక నిపుణులు లెక్కలు వేస్తున్నారు. ప్రభుత్వమూ ఆ పనిలోనే మునిగి తేలుతున్నది. ఆక్వారంగంలో కూడా దిగుమతులపై దాదాపు 50 శాతం టారిఫ్ ఉంటుందని హెచ్చరించటం వల్ల తెలుగు రాష్ట్రాలు ప్రత్యేకంగా నిరాశకు లోనవుతున్నాయి. ఆ రంగంలో ఉన్నవారు ఎదుర్కోబోయే ఒడిదుడుకులలో తలపట్టుకొని, ప్రభుత్వాలు ఏవిధంగా తమకు సహాయపడగలవో అని సంబంధిత అధికారుల, పలుకుబడి ఉన్న ప్రభుత్వంలో ఉన్న నాయకుల చుట్టూ తిరుగుతున్నారు. సమస్యకు పరిష్కారం ప్రధాన మంత్రి మోడీ చేతుల్లో ఉంది. అయితే ప్రపంచ దేశాల మధ్య నడిచే ఏ ఒప్పందం అయినా రాజకీయంగా ఎవరు ఏ ప్రకటనలు చేసినా, వాస్తవ పరిస్థితులు దేశాల మధ్య సంబంధాలు, హేతుబద్ధమైన నిర్ణయాలు తీసుకోవటంలో ప్రభావం చూపుతాయి. అందుకనే ఒక్కొక్కప్పుడు దేశ నాయకుల ప్రకటనలకు వాస్తవ ఒప్పందాలకు పొంతన కుదరదు. అనుకోనిరీతిలో బెదిరిస్తున్న దేశం స్థానంలో మరో దేశం రంగం మీద ప్రత్యక్షమయి, మేమున్నాం పర్వాలేదు అని భరోసా ఇవ్వటం కూడా కొత్తేమీ కాదు. అందుకనే కొంచెం దూరంగా ఉన్న రష్యా, భారత్ విషయంలో అమెరికా వ్యవహారం న్యాయబద్ధంగా లేదు. నేనున్నాను భారత్‌కు చేయూతనివ్వడానికి అనే సంకేతం ఇవ్వడం భారత్‌కు అనుకూలమైన పరిణామంగా భావించక తప్పదు. ప్రధాని మోడీకి నిర్ణయాలు తీసుకోవటంలో ఒక వెసులుబాటు కల్పించినట్లయింది. అమెరికా ఒక అడుగు వెనక్కు వేయడానికి అవకాశం దొరికినట్లయింది. దౌత్య సంబంధాలు ఎప్పుడూ ఒకే మాదిరి ఉండవు. కాలానుగుణంగా మార్పులు అనివార్యం. ట్రంప్ ప్రకటన, ఇండియా, రష్యాతో ఎనర్జీ మిలటరీ ఎక్విప్మెంట్



పరంగా పెట్టుకున్న సంబంధాల వల్ల ఈ టారిఫ్ విధానాలు మేము అవలంబించాల్సి వస్తున్నది అని చెప్పకనే చెప్పినట్లు అయింది. ఇంతకు మునుపు 'బ్రిక్స్' దేశాల మీద వేసిన పెనాల్టీలను దృష్టిలో పెట్టుకొని అంచనాలు వేస్తే భారత్ దాదాపు 35 శాతం టారిఫ్‌కు లోబడి ఉండాల్సి వస్తుంది. అమెరికాలో భారత్ నుంచి వస్తువులు దిగుమతులు చేసుకుంటున్నవారు ఈ టారిఫ్‌లు చెల్లించాల్సి వస్తుంది. అంటే ఇండియన్ ఇంపోర్టెడ్ గుడ్స్ ఎక్కువ ధరలు చెల్లించాల్సి వస్తుంది. భారత్‌కు ఈ పరిణామం రానున్న కాలంలో సమస్యగా మారుతుంది. దుస్తులు, విలువైన రాళ్ళ, ఆటోపార్ట్స్, లెదర్ వస్తువులు, ఎలక్ట్రానిక్ పరికరాల్లాంటివి దారుణంగా ఈ టారిఫ్ వల్ల నష్టపోతాయి. వియత్నాం, కాంబోడియా లాంటి దేశాలు, భారత్‌తో పోలిస్తే తక్కువ టారిఫ్ చెల్లింపుల వల్ల లాభపడ్తాయి. భారత్‌ను ఇరుకునపెట్టే ఈ ట్రేడ్ సమస్య నుంచి అనేక రకాల చర్యలు తీసుకుంటేనే అధిగమించగలదు. ట్రేడ్ డీల్స్‌లో ఒప్పందాలు దేశాల మధ్య కుదుర్చుకోవటానికి చాలా కాలం పడుతుంది! 2025 ఫిబ్రవరిలో నరేంద్రమోడీ, డొనాల్డ్ ట్రంప్ ఒక ప్రకటన చేశారు. వారు కుదుర్చుకోబోయే ట్రేడ్ ఒప్పందపు మొదటి భాగం కొద్ది రోజుల్లో పూర్తవుతుందని! ఇప్పటివరకు ఆ ఒప్పందం కుదిరిన సంగతి ఇరు దేశాలూ మాట్లాడటం లేదు. మీడియాలో వివరాలు కనపడటం లేదు. ఈ మధ్యనే భారత్ - బ్రిటన్‌ల మధ్య కుదిరిన కాంప్రహెన్సివ్ ఎకనామిక్, ట్రేడ్ ఒప్పందం దాదాపు మూడేళ్లచర్యల తర్వాతనే సాధ్యపడింది. ఇండియా ఈ హెచ్చు టారిఫ్‌లు చెల్లించాల్సిందేనా? ఏదో ఒక ఒప్పందంతో రెండు దేశాల మధ్య ఏర్పడిన ఈసమస్య తీరిపోతుందని, ట్రంప్ టారిఫ్‌లను వెనక్కి తీసుకుంటదని ఊహాగానాలు వినిపిస్తున్నా భారత్‌లోని అధికారులూ, ప్రభుత్వంలోని నాయకులూ మౌనంగా ఉండటమే ఈ సమస్యకు పరిష్కారం లేదని చెప్పకనే చెప్పినట్లు భావించక తప్పదు. ట్రంప్ మాత్రం టారిఫ్‌లు వెనక్కి తీసుకోవటం లేదని ఖండితంగా చెప్తున్నారు. అయితే 2025 సంవత్సరంలోని మొదటి భాగం ట్రేడ్ ఒప్పందం కుదిరినట్లేనని ఇరుదేశాలూ సంకేతాలు ఇస్తున్నా ఎంతవరకు సాధ్యం అవుతుందో చెప్పటం కష్టం. రష్యాను ట్రంప్ ఈ టారిఫ్ సమస్యతో ఇండియాకు ముడిపెట్టి అంతకు మునుపు రష్యా, అమెరికాల సానుకూల ఒప్పందాలను పక్కకు నెట్టేసి భారత్‌కు దౌత్య పరంగా ఇబ్బందిని కలిగించడానికి ప్రయత్నిస్తున్నది నూటికి నూరుపాళ్లు నిజం. ట్రంప్ రాజనీతిజ్ఞుడుగా కాకుండా రాజకీయ నాయకుడిగా ఈ రెండవ టర్మ్‌లో వ్యవహరిస్తుండటం అత్యంత దురదృష్టకరం. ప్రధాని మోడీని నిజమైన స్నేహితుడిగా అభివర్ణించి, ఆ దేశంలోని భారతీయుల సహకారాన్ని ఎన్నికలలో వాడుకోటానికి వేసిన ఎత్తుగడగా ఇప్పుడు అందరూ అంటున్నారు. అయినా ఏంలాభం! మన దేశ రాజకీయ నిపుణులు, వారి ఆలోచనలు కూడా పదును పెట్టి, వ్యూహ, ప్రతివ్యూహాలతో ఇలాంటి సమస్యలను పరిష్కరిస్తేనే భారత్ సాధించిన ఆర్థికాభివృద్ధి కుంటుపడకుండా ఉంటుంది. అమెరికా ఇప్పటికే యు.కె, ఇండోనేషియా, ఫిలిప్పైన్స్, జపాన్, సౌత్‌కొరియా దేశాలతో ఒప్పం దాలు కుదుర్చుకున్నది. రష్యాతోపాటు అరబ్ దేశాలతో సామరస్య ఒప్పందాలు త్వరితగతిన ఏర్పరుచుకుంటేనే, చమురు సమస్యతోపాటు అమెరికన్ హెచ్చుటారిఫ్‌ల సమ స్యను భారత్ అధిగమించగలదు. భారత్ ఈ విషయంలో వెనుకడుగు వేయదనే ప్రస్తుతం ఆశావాదంతో ఉండక తప్పదు. ●

# ప్రమాదం అంచున ప్రజాస్వామ్యం!

ఫిరోజ్ ఖాన్

ఫాసిజం అనేది ఒక్క రాత్రిలో రాదు. మెల్లమెల్లగా దేశంలోకి చొచ్చుకు వస్తుంది. వ్యవస్థలను క్రమంగా బలహీనపరుస్తుంది. ఆ తర్వాత ప్రజాస్వామ్యాన్ని పూర్తిగాసమాధి చేస్తుంది. జర్మనీలో నాజీ అనుభవాలను దృష్టిలో ఉంచుకొని చాలా మంది చరిత్రకారులు, రచయితలు చేసిన వ్యాఖ్యలివి. ప్రస్తుతం భారతదేశం అటువైపే ప్రయాణిస్తున్నదా? అనే తీవ్రమైన ఆందోళన ప్రజాస్వామ్యవాదులను కలచివేస్తున్నది. ఎన్నికల నిర్వహణలో ఎలక్షన్ కమిషన్ వ్యవహరిస్తున్న తీరును ఇటీవల రాహుల్ గాంధీ బయటపెట్టాక ఈ ఆందోళన మరింత పెరిగింది. ఇండియాలో కూడా అలాంటి సిద్ధాంతాలను అనుసరిస్తున్నారా అనే అనుమానం వ్యక్తమవుతున్నది. ఈ అనుమానం వాస్తవరూపం దాల్చే దారిలో అడుగులు పడక ముందే ప్రజలు, ముఖ్యంగా యువత మేల్కొనాల్సిన అవసరముంది. లేకుంటే ప్రజాస్వామ్యానికి ప్రమాదం ఏర్పడి, ప్రజల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుంది. దేశంలో ప్రస్తుతం జరుగుతున్న కొన్ని పరిణామాలు ఆనాటి జర్మనీలో నాజీల పాలనా లక్షణాలను గుర్తుకు తెస్తున్నాయని విమర్శకులు, మేధావులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాజీ పాలనలో హిట్లర్ ఒక్కడినే దేశరక్షకుడిగా చిత్రీకరించారు. అప్పుడు జర్మనీలో జాతీయతను ఒక ఆయుధంగా మలిచి ప్రశ్నించే, విమర్శించే వారిని దేశద్రోహులుగా ముద్రవేసేవారు. ఇప్పుడు ఇండియాలోనూ భారత్ మాతాకీ జై వంటి నినాదాలను జాతీయతకు, తమ రాజకీయ ఎజెండాకు ఒక సాధనంగా మలుచుకుంటున్నారు. భారత్‌లో విపక్ష పార్టీల నేతలు, వారి కుటుంబ సభ్యులపై ఈడీ, సిబిఐ, ఐటీ వంటి ప్రభుత్వ సంస్థల ద్వారా వారిని బలహీనపర్చే కార్యక్రమం కొనసాగుతున్నది. ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించే నేతలు, మేధావులు, సామాజిక కార్యకర్తలపై దేశద్రోహం ముద్రవేసి అనేకసంవత్సరాలుగా జైళ్లలో ఉంచుతున్నారు. సీఏఏ, ఎన్ఆర్సీ వంటి చట్టాలు ఇందులో భాగమే అనే అభిప్రాయాలున్నాయి. గోరక్షకుల దాడులు, మత మార్పిడి ఆరోపణలతో దాడులు, మణిపూర్‌లో జాతి హింస వంటివి ఈ వివక్షను స్పష్టంగా సూచిస్తున్నాయి. ముఖ్యంగా ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాల్సిన ఎలక్షన్ కమిషన్‌పై వస్తున్న తీవ్రమైన ఆరోపణలు ఇందుకు నిదర్శనం. అయితే ప్రజల్లో ఉన్న అనుమానాలను నివృత్తి చేసేలాఈసీ సరైన జవాబు ఇవ్వకపోవడం ఈ అనుమానాలను మరింత బలోపేతం చేస్తున్నది. కొన్నేళ్లుగా వెలువడుతున్న తీర్పులను చూస్తే న్యాయవ్యవస్థపైనా ఒత్తిడి ఉన్నట్లు స్పష్టమవుతున్నది. అంతేకాకుండా గతంలో బిజెపి ప్రతినిధిగా పని చేసిన ఒక నాయకురాలిని బాంబే హై కోర్టు జడ్జిగా ప్రతిపాదించడం కూడా ఇందులో భాగమేననే చర్చ జరుగుతున్నది. ఎలాంటి నేరం చేయకున్నా దేశంలోని అనేకమంది కవులు, రచయితలు, ప్రొఫెసర్లు, న్యాయవాదులు జైళ్లలో మగ్గుతున్నారు. కానీ బహిరంగంగా మారణహోమానికి పిలుపునిచ్చే వారికి మాత్రం బెయిల్ దొరుకుతున్నది అని అరుంధతి రాయ్ ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. విమర్శనాత్మక ఆలోచనలను అణచివేస్తున్నారని ఆమె పేర్కొన్నారు. విమర్శలు చేసినందుకు జేఎన్‌యూ వంటి వర్సిటీల్లో విద్యార్థులు, ప్రొఫెసర్లు దాడులకు గురైన సందర్భాలు ఉన్నాయి. ఇదీ జర్మనీలో నాజీల విధానాన్ని గుర్తుకు తెస్తున్నాయన్నారు. జోసెఫ్ గోబెల్స్ నాయకత్వంలోని ప్రచార మంత్రిత్వ శాఖ జర్మనీలో మీడియాను పూర్తిగా నియంత్రించింది. ఇప్పుడు భారతదేశంలో మీడియా స్వేచ్ఛ క్రమంగా క్షీణిస్తున్నదని రిపోర్టర్స్ విత్‌ఔట్ బోర్డర్స్ వంటి సంస్థలు గుర్తించాయి. 2025 వరల్డ్ ఫ్రీడమ్ ఇండెక్స్ ప్రకారం 180దేశాల్లో మీడియా స్వేచ్ఛలో ఇండియా 151వ స్థానంలో ఉన్నది. అంతేకాకుండా ప్రతిసంవత్సరం వివిధ కారణాలతో వందలాది మంది జర్నలిస్టులను అరెస్ట్‌చేస్తున్నారు. జర్నలిస్టుల హత్యలు సైతం జరుగుతున్నాయి. నాజీల పాలనలో మీడియా అంతా ప్రభుత్వ అనుకూల వార్తలను మాత్రమే ప్రసారం చేసేది. భారత్‌లోనూ ప్రస్తుతం మీడియా ప్రభుత్వ వ్యతిరేక వార్తలకు చోటివ్వకుండా ప్రభుత్వ భజననే చేస్తున్నది. భారతదేశ ప్రధాన ప్రతిపక్షనేత లేవనెత్తిన సందేహాలను దేశవ్యాప్తంగా అనేక పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా కవర్ చేయకపోవడం, అప్రధాన వార్తగా ప్రచురించడం ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నది. ఇంటర్నెట్ షట్‌డౌన్‌లు, సోషల్ మీడియా కంటెంట్‌ను బ్లాక్ చేయడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు. ప్రస్తుతం దేశపాలకులు అనుసరిస్తున్న విధానాలు ప్రజల్లో ఒకరకమైన అనుమానం, భయాన్ని సృష్టిస్తున్నాయి. చరిత్ర చెప్పిన పాఠాలనుంచి ప్రజలు ఇప్పటికైనా నేర్చుకోవాలి. ప్రజాస్వామ్య పరిరక్షణకు ముందుకు కదలాలి. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడం ప్రతిపౌరుడీ బాధ్యత. ●

# ఆర్థిక క్రమశిక్షణతోనే కుటుంబాల్లో ఆనందాలు!

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి

ధనం మూలం ఇదం జగత్ ప్రపంచంధనంతోనే నడుస్తుంది. డబ్బు ఎవరికీ చేదుకాదు. ధనమేరా అన్నిటికీ మూలం. ధనం విలువ తెలుసుకొనుట మానవ ధర్మం. డిజిటల్ యుగంలో ఆర్థిక వనరులే అన్నింటినీ శాసిస్తున్నాయి. నేటి మానవ బంధాలన్నీ వాణిజ్య బంధాలుగా మారాయి. డబ్బు సంపాదించడం ఒక ఎత్తు, సంపాదించిన డబ్బును వినియోగించడం మరోఎత్తు. ఎంత సంపాదించామన్న దాని కన్న ఎంత ఆదా చేస్తున్నామన్నది ముఖ్యమని మన జీవిత అనుభవాలు స్పష్టం చేస్తున్నాయి. ఆర్థిక క్రమశిక్షణ కొరవడిన కుటుంబాలు బజారున పడడం చూస్తున్నాం. ఆదాయాన్ని క్రమ ప్రణాళికతో ఖర్చుచేయడం వల్ల ఆ వ్యక్తితో పాటు కుటుంబం కూడా సుఖసంతోషాలతో, ధైర్యంగా జీవనయానం కొనసాగిస్తారు. అనాలోచితంగా, విచ్చలవిడిగా ఖర్చు చేసిన వారు ఎంత సంపాదించినా ప్రయోజనం శూన్యమే. నేటి ఆదాయం రేపటికి పునాది కావాలి. ఆర్థిక క్రమశిక్షణ చిన్నతనం నుంచే అలవాటు కావాలి. ఉన్నత విద్యావంతుల్లో కూడా ఆర్థిక నిరక్షరాస్యత కనిపిస్తున్నది. ఆర్థిక అవగాహన లేమితో కుటుంబాలు అశాంతి నెలవులుగా మారుతున్నాయి. నేటి పిల్లలు, యువతలో ఆర్థిక నిరక్షరాస్యత రాజ్యమేలుతున్నది. ఎంత సంపాదించామన్నది ముఖ్యం కాదని, ఆదాయంలో ఎంత పొదుపు చేశామన్నదే ప్రధానమని మరిచిన ఏఐ ప్రపంచంలో మనం ఉన్నాం. నేటి పిల్లల నుంచి కురువృద్ధుల వరకు అందరికీ ఆర్థిక అక్షరాస్యత కల్పించటానికి ప్రతి ఏటా 14 ఆగస్టున 'జాతీయ ఆర్థిక అవగాహన దినం' లేదా నేషనల్ ఫైనాన్సియల్ అవేర్నెస్ డే' పాటించడం జరుగుతోంది. మన విద్యా వ్యవస్థలో కూడా ఆర్థిక అక్షరాస్యతను బోధించడం లేదు. చిన్న పిల్లలకు పాకెట్ మనీ ఇచ్చినప్పుడు వారు గల్ల గురిగిలో వేసి దాచుకోవడం మనకు తెలుసు. అదే అలవాటు క్రమంగా ఆర్థిక క్రమశిక్షణకు పునాదిగా మారుతుంది. చిన్నతనంలోనే విచ్చలవిడిగా ఖర్చు చేయడం అలవాటు అయితే రేపటి వారి భవిత అంధకారంలోకి జారిపోవడం ఖాయమని తెలుసుకోవాలి. పిల్లాడి స్థాయిలో అలవాటు అయిన ఆర్థిక క్రమశిక్షణ రేపటి కుటుంబ శాంతికి పునాదిగా మారుతుంది. జాతీయ ఆర్థిక అవగాహన దినం వేదికగా వేతనం పొందడం, పొదుపు చేయడం, ఆర్థిక ప్రణాళికలు వేయడం, కనీస ఖర్చులు చేయడం, తప్పని పరిస్థితుల్లో అప్పు చేయడం, ఆస్తులను పెట్టుకోవడం లేదా కాపాడుకోవడం లాంటి అంశాలను అవగాహన కలిగించాలి. మన నెలసరి ఆదాయంలో కొంత కుటుంబ ఖర్చులకు, కొంత పిల్లల చదువులకు, కొంత అత్యవసర సామాజిక ఖర్చులకు వెచ్చించిన పిదప తప్పనిసరిగా కొంత డబ్బును పొదుపు లేదా ఆదా చేయడం అలవాటుగా మారాలి. నేడు పొదుపు చేసినధనం రేపటి ఊహించని అత్యవసర సమయాల్లో మనల్ని ఆదుకుంటుంది. పొదుపు చేసిన డబ్బును సరైన పద్ధతిలో పెట్టుబడి పెడుతూ, మన ఆస్తిని పెంచుకోవచ్చు. ఉద్యోగ నిర్వహణలో నైపుణ్యాలున్నట్లే, మన ఆదాయాన్ని సరైన పద్ధతిలో ఖర్చు చేసే ఆర్థిక నైపుణ్యాలను కూడా నేర్చుకోవాలి. చిరిగిన బట్టలు వేసుకోవడం, తెగిన చెప్పును తిరిగి తిరిగి



వాడడం, కనీస అవసరాలకు ఖర్చు చేయకపోవడం, తింటే ఖర్చు అవుతుందని కాలే కడుపుతో పడుకోవడం లాంటివని పిసినారి గుణాలుగా భావిస్తాం. విలాసాలను కూడా కనీస అవసరాలు అనుకుంటూ, గోరుతో పోయే దానిని గొడ్డలి దాకా తెచ్చుకున్నట్లు, తక్కువ ఖర్చుతో జరిగే పనికి అనేక రెట్లు అధికంగా ధనాన్ని నీటి వలె ఖర్చు చేయడం వల్ల భవిష్యత్తు చిక్కుల్లో పడుతుంది. రుణ విష వలయంలోకి నెట్టి వేస్తుంది. డబ్బు ఉన్నపుడు ఎగిరి పడడం, లేనప్పుడు కుంగి పోవడం ధీరత్వం కాదు. అప్పులు చేయడం, ఆర్థిక చిక్కులతో ఆత్మహత్య చేసుకోవడం వీరత్వం కాదు. ప్రాధాన్యాలను మరిచి విచక్షణారహితంగా ఖర్చు చేయవద్దు. కనీస అవసరాలకు, విలాసాలకు మధ్య వ్యత్యాసం తెలుసుకోవాలి. మన పిల్లలకు పాఠశాల స్థాయి నుంచి కంప్యూటర్ లిటరసీ నేర్పినట్లే, ఆ చిన్నారులకు ఫైనాన్సియల్ లిటరసీ కూడా నేర్పాలి. ఆకర్షణీయ వేతనం అందించిన విద్యకు సరి సమానంగా ఆదాయాన్ని ఖర్చు చేసే ఆర్థిక అక్షరాస్యత కూడా అవసరమని తెలుసుకోవాలి. చాప ఉన్నంత వరకే కాళ్లు చాపుకున్నట్లు, ఆదాయ పరిమితులను గమనించి ఖర్చులను కుదించుకోవాలి. అనారోగ్యాలు, ప్రమాదాలు చెప్పి రావు కాబట్టి రేపటి అత్యవసరాలను నేటి పొదుపు ఆదుకునే విధంగా ప్రణాళికలు వేసుకోవాలి. దీపం ఉన్నప్పుడే ఇళ్లు చక్క బెట్టుకున్నట్లు, డబ్బు ఉన్నప్పుడే ఆదా చేయడం నేర్చుకోవాలి. మన నెలసరి ఆదాయంలో కొంత మొత్తం పొదుపు చేయడం వల్ల అనేక ప్రయోజనాలు కలుగుతాయని తెలుసుకోవాలి. ఆదా చేసిన వ్యక్తుల్లో ధైర్యం, మనో శాంతి, భయం తొలగడం, ప్రతికూల సమయాలను ఎదుర్కోగలగడమనే ధీమా, కుటుంబ సభ్యుల భద్రత, ఆనంద ఆరోగ్యకర వాతావరణం, పిల్లలకు ఆర్థిక క్రమశిక్షణ అలవడడం, ఆస్తులను పెంచడం, పిల్లలకు ఉన్నత చదువులను అందించగలగడం లాంటి ప్రయోజనాలు కలుగుతాయి. ప్రేమ పేరుతో గాని లేదా ఫాల్స్ ప్రిస్టేజ్ కోసం అంటూ పిల్లలు లేదా యువత అడిగినంతనే అధిక మొత్తంలో డబ్బును అందించడం వల్ల ఆ చిన్నారులకు లేదా యువతకు విచ్చలవిడిగా ఖర్చు చేయడం దురలవాటుగా మారుతుంది. నేడు చేసిన పొదుపు రేపటికి భరోసాను అందిస్తుంది. కుటుంబ అవసరాలు, పిల్లల విద్యకు తగిన ఖర్చులకు వెనకాడకుండా కొంత సొమ్మును విధిగా పొదుపు చేయాలి. ఉద్యోగంలో చేరిన రోజే పదవి విరమణ తేదీ ఖరారు అవుతుంది కాబట్టి తొలినాళ్ల నుంచే పొదుపుమార్గం ఎంచుకోవాలి. ఆర్థిక క్రమశిక్షణతో వృత్తిలో ఎదుగుదల, సాఫీగా వైవాహిక జీవితం కొనసాగడం, సొంత ఇల్లు కల సాకారం కావడం, పిల్లలకు ఉన్నత విద్య అందించడం, ఊహించని ఖర్చులను తట్టుకోవడం, వాహనాలను కలిగి ఉండడం లాంటి ప్రయోజనాలు కలుగుతాయి. తెలియక పోవడం తప్పుకాదు, తెలిసి పొదుపు చేయకపోవడం తప్పు అని గమనించాలి. ఆర్థిక క్రమశిక్షణ కొరవడిన కుటుంబాల్లో గొడవలు, అప్పుల బాధలు, అశాంతి, భవిష్యత్తు పట్ల అనిశ్చితి, మానసిక ఒత్తిడితో అనారోగ్యాలు, కుటుంబ పోషణలో ఇబ్బందులు, పిల్లల పెంపకంలో అవాంతరాలు లాంటి అవాంఛనీయ పరిస్థితులు ఎదురవుతాయి. నాడు నగదుతో మాత్రమే జరిగిన క్రయవిక్రయాలు నేటి యువత చేతుల్లో క్రెడిట్ కార్డులు, డెబిట్ కార్డులు, ఆన్‌లైన్ చెల్లింపులు, ఈ వాణిజ్యాలు లాంటి సౌకర్యాలు కొన్ని సందర్భాల్లో ప్రమాదకర పరిస్థితులకు దారి తీయడం చూస్తున్నాం. నేటి యువత ఆర్థిక అక్షరాస్యత ప్రాధాన్యాన్ని తెలుసుకొని, పొదుపుకు ప్రాధాన్యమిస్తూ, ఖర్చులకు పరిమితులను ఏర్పరచుకొని ముందుకు సాగితే వారి భవిష్యత్తు సాఫీగా, ఆనందంగా కొనసాగుతుంది.. ●

# ట్రంప్, మోడీ మధ్య త్వరలో చర్చలు!



## సెప్టెంబర్ 26న అమెరికాకు ప్రధాని మోడీ
## ఐరాస సర్వసభ్యసమావేశంలో ప్రసంగం
## అనంతరం సుంకాల వివాదంపై ట్రంప్‌తో భేటీ

**న్యూఢిల్లీ, ఆగస్టు 13:** భారత్‌తో వాణిజ్యసుంకాలు అధికంగా విధించి వాణిజ్య యుద్ధానికి తెరతీసిన ట్రంప్ ఇపుడు భారత్‌తో సంప్రదింపులకు ఆసక్తిచూపిస్తున్నారు. 50శాతం సుంకాలు విధించి భారత్‌ను చిక్కుల్లోకి నెట్టాలని చూస్తున్న ట్రంప్ మరోవైపు పాకిస్థాన్‌తో దోస్తీకి తహతహలాడుతున్నారు. ఐఎంఎఫ్ రుణమంజూరులో ప్రాధాన్యత ఇవ్వడం, ఆసిమ్‌మునీర్‌కు రెండుసార్లు ఆతిథ్యం ఇచ్చి భారత్‌పై రెచ్చగొట్టే వ్యాఖ్యలను ప్రోత్సహించడం వంటి చర్యలకు పాల్పడుతున్న సంగతి ప్రపంచదేశాలకు తెలిసిందే. మరోపక్క భారత్‌తో చర్చలు సంప్రదింపులకు ఆసక్తిచూపిస్తున్న ట్రంప్‌ను దారిలోకి తెచ్చుకోవాలని భారత్‌సైతం పావులు కదుపుతోంది. కయ్యానికి కాలుదువ్వే వైఖరి లేదని, మిత్రదేశంతో చర్చలు సంప్రదింపులద్వారా పరిష్కరించుకోవాలనే చూస్తోంది. ఆదిశగా వచ్చే సెప్టెంబరు 26న న్యూయార్క్‌లో జరిగే ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సమావేశంలో ప్రసంగించేందుకు మోడీ వెళ్తున్నారు. సమితికు చెందిన ఈ ప్రతిష్ఠాత్మక సమావేశాల సందర్భంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సహా పలు దేశాల ప్రభుత్వాధినేతలతో భారత ప్రధాని భేటీ అయ్యే అవకాశాలు ఉన్నాయి. ప్రత్యేకించి ట్రంప్ మోడీ భేటీకి అధికారికంగా షెడ్యూల్‌ను ఫిక్స్ చేయించేందుకు భారత విదేశాంగ శాఖ కసరత్తు మొదలుపెట్టిందని సంబంధిత వర్గాలు అంటున్నాయి. డొనాల్డ్ ట్రంప్ కూడా మోదీతో భేటీకి ఆసక్తితోనే ఉన్నారని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఈ సమావేశం ద్వారా అమెరికాతో ఏర్పడిన పొరపొచ్చాలను తొలగించుకొని, రాజీకి వచ్చే దిశగా భారత్ ప్రయత్నాలు చేసే ఛాన్స్ ఉందని పరిశీలకులు అంటున్నారు. ఒకవేళ ఈ భేటీ సవ్యంగా జరిగితే, అక్టోబరులో క్వాడ్ సదస్సు కోసం భారత్‌కు రావాల్సిందిగా ట్రంప్‌ను ప్రధాని మోడీ ఆహ్వానించే అవకాశం ఉంది. క్వాడ్ కూటమిలో అమెరికా, భారత్‌తో పాటు ఆస్ట్రేలియా, జపాన్‌లు సభ్యదేశాలుగా ఉన్నాయి. వాస్తవానికి జూన్ నెలలో పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్‌తో పాటు భారత ప్రధాని మోడీని వైట్‌హౌస్‌కు ట్రంప్ ఆహ్వానించారు. అయితే ఆ ఆహ్వానాన్ని భారత్ తిరస్కరించింది. మునీర్‌తో కలిసి ట్రంప్‌తో భేటీ అయ్యేందుకు నో చెప్పింది. నాటి నుంచే భారత్ అమెరికా మధ్య గ్యాప్ పెరుగుతూ వచ్చింది. చివరిసారిగా ఈ ఏడాది ఫిబ్రవరిలో వైట్ హౌస్ వేదికగా ట్రంప్‌తో నరేంద్రమోదీ సమావేశమయ్యారు. ఏడు నెలల గ్యాప్ తర్వాత సెప్టెంబరు చివరి వారంలో ఈ ఇద్దరూ మళ్లీ భేటీ కాబోతున్నారు. ట్రంప్ మోదీ భేటీకి సంబంధించిన అజెండాలో భారత్ అమెరికా మధ్య జరగాల్సిన ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం ఉండే అవకాశం ఉంది. భారత వ్యవసాయ రంగాన్ని, డైరీ రంగాన్ని అమెరికా కంపెనీల కోసం తెరిచేందుకు భారత్ విముఖంగా ఉంది. అయితే ఆ రంగాల్లోనూ తమ కంపెనీలకు ప్రవేశాన్ని కల్పించాల్సిందే అని అమెరికా వాదిస్తోంది. ఈ విభేదాల వల్లే ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై ఇరుదేశాల నడుమ పలు విడతలుగా చర్చలు జరిగినా, ఏకాభిప్రాయం మాత్రం కుదరలేదు. దీంతో తొలుత భారతదేశానికి చెందిన వస్తు, ఉత్పత్తులపై అమెరికా 25 శాతం అదనపు దిగుమతి సుంకాన్ని విధించింది. ఆ తర్వాత కూడా ట్రేడ్ డీల్‌పై పురోగతి జరగకపోవడంతో ఈ సుంకాన్ని రెట్టింపు చేసి 50 శాతానికి చేర్చింది. ఇది ఆగస్టు 27 నుంచి అమల్లోకి రానుంది. అంటే భారత్‌పై 50 శాతం సుంకం అమల్లోకి వచ్చిన దాదాపు నెల రోజుల తర్వాత ట్రంప్‌తో మోడీ భేటీ కాబోతున్నారు. ఈ సుంకాలను పూర్వ స్థితికి చేర్చాలని, వాణిజ్య ఒప్పందంపై చర్చలను ముందుకు తీసుకెళ్లాలని అమెరికాను భారత్ కోరే అవకాశం ఉంది. కేంద్ర బిందువుగా రష్యా ముడి చమురు ప్రస్తుతం భారత్‌పై అమెరికా ఆగ్రహం పెరిగేందుకు కారణమవుతున్న మరో ప్రధాన అంశం రష్యా ముడి చమురు. రష్యా నుంచి క్రూడ్ ఆయిల్‌ను కొనే అతిపెద్ద దేశంగా భారత్ ఉండటం అనేది అమెరికాను కలవరపరుస్తోంది. ముడి చమురును కొని భారత్ అందిస్తున్న నిధుల వల్లే ఉక్రెయిన్‌తో నేటికీ రష్యా యుద్ధాన్ని కొనసాగించగలుగుతోంది అనేది అగ్రరాజ్యం అభిప్రాయం. దీనిపై ట్రంప్‌కు మోడీక్లారిటీ ఇచ్చే అవకాశం ఉంది. చౌక ధరకు లభిస్తోందనే ఏకైక కారణంతోనే రష్యా నుంచి ముడి చమురును కొంటున్నామని భారత్ మొదటినుంచీ చెబుతోంది. భారతదేశ ఇంధన భద్రత కోసమే రష్యా ముడి చమురును కొంటున్నాం తప్ప, ఉక్రెయిన్ రష్యా యుద్ధంపై తమకు ఆసక్తి లేదని భారత్ అంటోంది. ఈ అంశాలను వివరించి భారత్‌పై ట్రంప్‌కు ఏర్పడిన దురుద్దేశాలను దూరం చేసేందుకు ప్రధానమంత్రి మోడీ ప్రయత్నించే అవకాశం ఉందని పరిశీలకులు అంటున్నారు.

# బీహార్ సర్‌లో 11 ధృవపత్రాల పరిశీలన మంచిదేకదా!



## పిటిషనర్లకు సుప్రీం బెంచ్ సూటి ప్రశ్నలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 13:** బీహార్‌లో ఓటర్ల జాబితాను సవరించాలనే ఎన్నికల కమిషన్ (ఎిది) నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు బుధవారం మరోసారి విచారించింది. ఈ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చీ ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. గతంలో ఏడు ధ్రువీకరణ పత్రాలకంటే ప్రస్తుతం 11 పత్రాలను అనుమతించడం ఓటర్లకు ప్రయోజనకరంగా ఉంటుందని ధర్మాసనం పేర్కొంది. ఆధార్ మినహా అనేక ఇతర డాక్యుమెంట్లను పరిగణలోకి తీసుకోవడాన్ని ధర్మాసనం గుర్తు చేసింది. గతంలో బీహార్‌లో నిర్వహించిన రివిజన్‌లో ఏడు ధ్రువీకరపత్రాలను అనుమతించారని, ప్రత్యేక సవరణలో 11 డాక్యుమెంట్లను ఈసీ అనుమతి ఇస్తుందని.. దీన్ని పరిశీలిస్తే ఓటర్లకు అనుకూలంగానే కనిపిస్తుందని ధర్మాసనం తెలిపింది. ఆధార్ అనుమతించడం లేదనే పిటిషనర్ల వాదనను అర్థం చేసుకున్నప్పటికీ అనేక పత్రాలను పరిగణలోకి తీసుకుంటున్నట్లుగా ధర్మాసనం గుర్తు చేసింది. అయితే, ఈ వాదనలతో పిటిషనర్ తరఫు న్యాయవాది అభిషేక్ సింఘ్వీ విభేదించారు. ధ్రువపత్రాల సంఖ్య ఎక్కువగా ఉన్నా అందరికీ అందుబాటులో లేవని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పాస్‌పోర్టులను ఉదహరించారు. బీహార్‌లో కేవలం ఒకటి నుంచి రెండుశాతం మంది వద్దే పాస్ పోర్టులు ఉన్నాయన్నారు. దీనికి స్పందించిన ధర్మాసనం 36లక్షల మందికి పాస్‌పోర్టులు ఉన్నాయని, ఇది మంచి సంఖ్యగానే కనిపిస్తోందని చెప్పింది. ప్రభుత్వ విభాగాల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకున్న తర్వాతే ధ్రువపత్రాల జాబితా రూపొందిస్తారని జస్టిస్ జోయ్‌మల్య బాగ్చీ తెలిపారు. ఇదిలా ఉండగా పౌరులను చేర్చడం, కానివారిని ఓటరు జాబితా నుంచి మినహాయించడం ఎన్నికల కమిషన్ అధికార పరిధిలోనిదని ధర్మాసనం పేర్కొంది. సర్‌లో ఆధార్, ఓటర్ కార్డును పౌరసత్వానికి రుజువుగా పరిగణించలేమన్న ఈసీ వాదనలను సమర్థించింది. పార్లమెంట్ లోపల, వెలుపల 'సర్' అంశంపై వివాదం పెరుగుతున్న నేపథ్యంలో ఈసీ చేపట్టిన ఈ కార్యక్రమంపై విశ్వాసం కోల్పోవడమే సమస్య అని అంతకు మించి ఏమీ లేదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.


# కౌన్‌బనేగా కరోడ్‌పతిలో ఆర్మీ అధికారులు!

## యూనిఫామ్‌తో రావడంపై నెట్టింట విమర్శల వెల్లువ

**న్యూఢిల్లీ,ఆగస్టు 13:** ప్రముఖ రియాలిటీ షో ఖౌన్ బనేగా కరోడ్‌పతిఖ (కేబీసీ)లో భారత సైనిక అధికారులు పాల్గొనడం వివాదానికి దారితీసింది. పహల్గామ్ దాడి అనంతరం భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'కు సంబంధించిన వివరాలు వెల్లడించిన కల్నల్ సోఫియా ఖురేషి, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ ఈ షోలో కనిపించడంతో సోషల్ మీడియాలో తీవ్ర దుమారం రేగింది. సాయుధ దళాలను వ్యక్తిగత ప్రచారం (పీఆర్), రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారంటూ నెటిజన్లు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 15న ప్రసారం కానున్న ఈ ప్రత్యేక ఎపిసోడ్‌కు సంబంధించిన టీజర్‌ను నిర్వాహకులు ఇటీవలే విడుదల చేశారు. ఇందులో హోస్ట్ అమితాబ్ బచ్చన్ సైనిక అధికారులకు ఘన స్వాగతం పలికారు. ఈ ప్రోమోలో కల్నల్ ఖురేషి మాట్లాడుతూ పాకిస్థాన్ పదేపదే ఉగ్ర చర్యలకు పాల్పడుతోంది. దీనికి గట్టిగా బదులివ్వడం అవసరం, అందుకే ఆపరేషన్ సిందూర్ చేపట్టామని వివరించారు. ఈ ఎపిసోడ్‌లో వీరితో పాటు, భారత నావికాదళంలో యుద్ధనౌకకు కమాండర్‌గా నియమితులైన తొలి మహిళా అధికారి కమాండర్ ప్రేరణా దేవ్‌స్థలే కూడా పాల్గొన్నారు. అయితే, అత్యంత కీలకమైన ఆపరేషన్‌లో పాల్గొన్న అధికారులు ఇలా యూనిఫాంలో ఒక ఎంటర్‌టైన్‌మెంట్ షోలో కనిపించడంపై నెటిజన్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఏ దేశంలోనైనా కీలకమైన సైనిక ఆపరేషన్ తర్వాత అధికారులు ఇలా టీవీ షోలలో పాల్గొనడం చూశామా అన్నారు.



# బ్రిటన్ జైళ్లనుంచి 26 వేలమంది ఖైదీల విడుదల



**లండన్, ఆగస్టు 13:** సుమారు 26 వేల మంది ఖైదీలను బ్రిటన్ సర్కారు విడుదలచేసింది. జైళ్లలో సరిపోను స్థలం లేకపోవడం వల్ల ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల ప్రధాని కీర్ స్టార్మర్ సాఫ్ట్‌జస్టిస్ కార్యక్రమాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఆయన బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఇప్పటికే బ్రిటన్ జైళ్లలో ఉన్న సుమారు 26 వేల మంది ఖైదీలు రిలీజైనట్లు తెలుస్తోంది. సుదీర్ఘ కాల శిక్షను అనుభవిస్తున్న ఖైదీలు కూడా ఫ్రీ అయినట్లు వెల్లడించారు. ఖైదీలతో జైళ్లు నిండిపోయాయని, జైళ్లను ఫ్రీగా మార్చాలన్న ఉద్దేశంతో సాఫ్ట్ జస్టిస్ ప్రోగ్రామ్‌ను మొదలుపెట్టినట్లు ప్రధాని స్టార్మర్ ఇటీవల తెలిపారు. ప్రభుత్వ డేటా ప్రకారం సెప్టెంబర్ 2024 నుంచి మార్చి 2025 వరకు 14 ఏళ్లకుపైగా శిక్ష పడిన సుమారు 248 మంది జైళ్ల నుంచి రిలీజయ్యారు. విడుదలైన ఖైదీల్లో 2600 విదేశీయులు కూడా ఉన్నారు. స్టార్మర్ ప్రభుత్వ స్కీమ్ కింద ప్రతి నెల సగటున 3461 మందిని విడుదల చేస్తున్నారు. 40 శాతం శిక్షను అనుభవించిన ఖైదీలను ఎక్కువగా రిలీజ్ చేశారు. అయితే ఈ ఏడాది కాలం పూర్తి అయ్యేలోగా దాదాపు 45 వేల మంది ఖైదీలు జైళ్ల నుంచి విడుదల అయ్యే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. రిలీజైన ఖైదీలు ప్రధాని స్టార్మర్‌కు థ్యాంక్స్ తెలిపారు. జీవితకాలం లేబర్‌పార్టీ ఓటర్లుగా మిగిలిపోతామన్నారు. కానీ కొందరు ఖైదీలు రిలీజైన వెంటనే మళ్లీ నేరాలకు పాల్పడినట్లు తెలుస్తోంది. జైళ్లలో రద్దీని తగ్గించేందుకే ఖైదీలను విడుదల చేస్తున్నట్లు న్యాయశాఖ ప్రతినిధి ఒకరు తెలిపారు.



# బీహార్ బిజెపి నేతలకు రెండేసి ఓట్లు!

## ఆర్జేడి చీఫ్ తేజస్వియాదవ్ ధ్వజం

**పాట్నా,ఆగస్టు 13:** కేంద్ర ఎన్నికల సంఘంపై ఆర్‌జేడీ అగ్రనేత తేజస్వి యాదవ్ మరోసారి సంచలన ఆరోపణలు చేశారు. బీహార్‌లోని బిజెపినేతలు, కార్యకర్తలకు ఒకే అసెంబ్లీ స్థానాల్లో రెండు చొప్పున ఓటరు ఐడీలను ఈసీ జారీ చేస్తోందని ఆయన ఆరోపించారు. విపక్ష నేతలు, కార్యకర్తల ఓట్లను మాత్రం తొలగిస్తోందన్నారు. తద్వారా రాష్ట్రంలోని ఓటరు జాబితాను తారుమారు చేసేందుకు బిజెపితో కలిసి ఈసీ పనిచేస్తోందని తేజస్వి ఆరోపించారు. బుధవారం పట్నాలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంతకుముందు బీహార్ డిప్యూటీ సీఎం విజయ్ సిన్హా గురించి తాము చెప్పామని, ఆ తర్వాతే అది నేరం, తప్పు అని అందరూ చెప్పడం మొదలుపెట్టారని గుర్తుచేశారు. ముజఫర్‌పుర్ మేయర్, ఆమె బంధువులకు రెండు ఓట్లున్నాయని బీహార్‌లోని ముజఫర్‌పుర్ మేయర్, బిజెపి నేత నిర్మలాదేవికి కూడా ఒకే అసెంబ్లీ స్థానంలో 2 ఓటరు ఐడీలు ఉన్నాయని తేజస్వి ఆరోపించారు. వాటిలోనూ సమాచారం భిన్నంగా ఉందన్నారు. నిర్మలాదేవికి చెందిన ఇద్దరు సమీప బంధువులకు కూడా 2 చొప్పున ఓటరు ఐడీలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఓటరు జాబితా సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ సందర్భంగా ఇతర రాష్ట్రాలకు చెందినవారి పేర్లను ఓటరు జాబితాల్లో చేర్చారని తేజస్వి ధ్వజమెత్తారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికలు సమీపించిన తరుణంలో ఇలా జరగడం దారుణమన్నారు. గుజరాత్ ప్రజలు ఇప్పుడు బీహార్ ఓటర్లుగా మారుతున్నారని తేజస్వి చెప్పారు. గుజరాత్ వాస్తవ్యుడైన బీహార్ రాష్ట్ర బిజెపి ఇంఛార్జి భీఖూభాయ్ దల్సానియాకు కూడా పట్నాలో ఓటుహక్కు వచ్చిందన్నారు.

# యశ్వంత్‌వర్మ పై పార్టీల నోటీసును అనుమతించిన స్పీకర్ ఓం బిర్లా

**న్యూఢిల్లీ, ఆగస్టు 13:** అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మను అభిశంసించాలంటూ వివిధ పార్టీలు ఇచ్చిన నోటీసును లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అనుమతించారు. దీంతో ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టినట్లయింది. నిబంధనల ప్రకారం ఈ అభియోగాలపై విచారణకు త్రిసభ్య కమిటీని ఆయన నియమించారు. దీనిలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరవింద్ కుమార్, మద్రాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మణీంద్ర మోహన్ శ్రీవాస్తవ, కర్ణాటక హైకోర్టు సీనియర్ న్యాయవాది బి.విఆచార్య ఉన్నారు. 91 సంవత్సరాల ఆచార్య దాదాపు ఆరు దశాబ్దాలుగా న్యాయవాద వృత్తిలో ఉన్నారు. కమిటీ వీలైనంత త్వరలో నివేదిక సమర్పిస్తుందని, అది అందేవరకు న్యాయమూర్తి తొలగింపు ప్రతిపాదన పెండింగ్‌లో ఉంటుందని ఓం బిర్లా ప్రకటించారు. జస్టిస్ వర్మను పదవి నుంచి తొలగించాలని 146 మంది లోక్‌సభ సభ్యులు ప్రతిపాదన సమర్పించారని తెలిపారు. జస్టిస్ యశ్వంత్ వర్మ ఢిల్లీ హైకోర్టులో సేవలందిస్తున్నప్పుడు అధికారిక నివాసంలో మార్చి 14న పెద్ద ఎత్తున నోట్లకట్టలు లభ్యమయ్యాయి. దానిపై అంతర్గత త్రిసభ్య సంఘం విచారణ జరిపింది.

# సుప్రీం తీర్పును పునఃపరిశీలిస్తాం



## చీఫ్‌జస్టిస్ గవాయి

**న్యూఢిల్లీ, ఆగస్టు 13:** ఢిల్లీలో తీవ్రమైన సమస్యగా మారిన వీధికుక్కల బెడదపై సుప్రీంకోర్టు కీలక తీర్పును వెలువరించిన సంగతి తెలిసిందే. వీటి వల్ల రేబిస్ మరణాలు పెరుగుతున్నాయని, 8 వారాల్లోపు వీధి కుక్కలను షెల్టర్లకు తరలించాలని జస్టిస్ పార్థీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్ లతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. ఈ తీర్పుపై పలువురు ప్రముఖులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తీర్పుపై పునరాలోచించాలని కోరతూ చీఫ్ జస్టిస్ కు లేఖ రాశారు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు స్పందించింది. ఈ విషయంలో ప్రజల భద్రతకు, మూగజీవాల హక్కులకు మధ్య కచ్చితమైన సమతుల్యత సాధించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసింది. వీధికుక్కల సమస్యకు భావోద్వేగాలతో కాకుండా హేతుబద్ధమైన పరిష్కారం కనుగొనాలని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం అభిప్రాయపడింది. వీధికుక్కల దాడులు, వాటి నియంత్రణకు సంబంధించిన పలు పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ మాట్లాడుతూ, సమాజంలో వీధికుక్కలకు ఆహారం పెట్టే జంతు ప్రేమికులు ఉన్నారు, అదే సమయంలో వాటిని చూసి భయపడే సామాన్య ప్రజలూ ఉన్నారు. ఈ సమస్యకు పరిష్కారం కనుగొనేటప్పుడు ఇరువర్గాల వాదనలను పరిగణనలోకి తీసుకోవాలని అన్నారు. సమస్య తీవ్రతను తాము గుర్తిస్తున్నామని, దీనికి ఒక ఆచరణాత్మకమైన పరిష్కారం కనుగొనడమే లక్ష్యమని తెలిపారు. కొన్ని ప్రాంతాలలో వీధికుక్కలు ప్రజలపై, ముఖ్యంగా పిల్లలపై దాడులకు పాల్పడుతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని ధర్మాసనం పేర్కొంది. అయితే, వాటిని విచక్షణారహితంగా చంపడం కూడా పరిష్కారం కాదని స్పష్టం చేసింది. జంతు జనన నియంత్రణ (ఏబీసీ) నిబంధనలను సమర్థవంతంగా అమలు చేయడంలో స్థానిక సంస్థల పాత్ర కీలకమని గుర్తుచేసింది. ఈ సమస్యను మానవజంతు సంఘర్షణగా చూడకుండా, ఇద్దరికీ ఆమోదయోగ్యమైన మార్గాన్ని అన్వేషించాలని సూచించింది. ఈ అంశంపై ఒక సమగ్రమైన పరిష్కార మార్గాన్ని కనుగొనేందుకు ప్రయత్నిస్తామని చెబుతూ, తదుపరి విచారణను వాయిదా వేసింది. ఈ వివాదానికి శాశ్వత పరిష్కారం చూపే దిశగా కోర్టు చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# సంక్షిప్తంగా..

## భారత్, చైనా మధ్య నేరుగా విమాన సర్వీసులు



**న్యూఢిల్లీ, ఆగస్టు 13:** దాదాపు ఐదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత భారత్ చైనా దేశాల మధ్య డైరెక్ట్ ఫ్లైట్ సర్వీసెస్ పునఃప్రారంభం కాబోతున్నాయి. భారత్‌చైనా మధ్య నిలిచిపోయిన విమాన సర్వీసులను సెప్టెంబర్ నెలలో పునరుద్ధరించే అవకాశం ఉందని బ్లూమ్‌బర్గ్ నివేదిక వెల్లడించింది. ఎయిర్ ఇండియా, ఇండిగో తదితర విమానయాన సంస్థలు చైనాకు సర్వీసులను నడిపేందుకు సిద్ధంగా ఉండాలని కేంద్రం సూచించినట్లు తెలిపింది. గల్వాన్ లోయలో 2020లో జరిగిన సైనిక ఘర్షణలతో భారత్‌చైనా మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. ఆ సమయంలోనే రెండు దేశాల మధ్య డైరెక్టుగా నడిపే విమాన సర్వీసులను రద్దుచేశారు. అదేవిధంగా చైనాకు సంబంధించిన పలు యాప్‌లను భారత్ నిషేధించింది. చైనా పెట్టుబడులపై కూడా కేంద్ర ప్రభుత్వం సుముఖత చూపలేదు. చైనా దిగుమతులపై భారత్ కఠిన ఆంక్షలు విధించింది. అయితే ఇటీవలి కాలంలో రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు తగ్గించే దిశగా చర్యలు కొనసాగించడంతో సానుకూల సంకేతాలు కనిపిస్తున్నాయి.

## ఐర్లాండ్‌లో మరో జాత్యంహంకార దాడి

డబ్లిన్, ఆగస్టు 13: డబ్లిన్‌లోని ఫెయిర్‌వ్యూ పార్క్‌లో ఆదివారం సాయంత్రం 5:30 గంటల సమయంలో ఒక భారతీయుడిపై ముగ్గురు టీనేజర్లు దాడి చేశారు. ఈ ఘటనలో బాధితుడు తీవ్రంగా గాయపడ్డాడు. అతడికి ఆసుపత్రిలో ఎనిమిది కుట్లు వేయాల్సి వచ్చింది. బాధితుడు తన అనుభవాన్ని వివరిస్తూ, నేను పార్క్ నుంచి ఇంటికి నడుస్తుండగా, ఒక టీనేజర్ ఎలక్ట్రిక్ స్కూటర్‌పై వచ్చి నా కడుపులో తన్నాడు. నేను దూరంగా వెళ్లడానికి ప్రయత్నించగా, మరో ఇద్దరు వచ్చి నన్ను కొట్టడం ప్రారంభించారు. నేను నేలపై పడిపోయిన తర్వాత కూడా వారు నాపై దాడి కొనసాగించారు. ఒక వ్యక్తి తన మెటల్ వాటర్ బాటిల్‌తో నా కంటి మీద కొట్టాడని తెలిపాడు. ఈ ఘటన సమయంలో అక్కడ ఉన్న కొంతమంది చూస్తూ ఉన్నారే తప్ప జోక్యం చేసుకోలేదని, అయితే ఇద్దరు టీనేజ్ యువకులు తనకు సహాయం చేసి పోలీసులకు సమాచారం అందించారని బాధితుడు చెప్పాడు. ప్రస్తుతం ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## కామన్‌వెల్త్ క్రీడల నిర్వహణకు భారత్ బిడ్

**న్యూఢిల్లీ, ఆగస్టు 13:** 2030 కామన్వెల్త్ క్రీడల ఆతిథ్యం దిశగా భారత్ ఒక కీలక ముందడుగు వేసింది. ఈ మెగా క్రీడల నిర్వహణకు భారత్ దాఖలు చేయనున్న బిడ్‌కు భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అధికారికంగా ఆమోదముద్ర వేసింది. బుధవారం జరిగిన ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో (ఎస్‌జీఎం) ఈ మేరకు ఏకగ్రీవ నిర్ణయం తీసుకున్నారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్ నగరాన్ని ప్రధాన వేదికగా ప్రతిపాదిస్తూ ఈ బిడ్‌ను సిద్ధం చేస్తున్నారు. ఈ పోటీ నుంచి కెనడా వైదొలగడంతో 2030 కామన్వెల్త్ క్రీడల ఆతిథ్య హక్కులను పొందేందుకు భారత్‌కు అవకాశాలు గణనీయంగా మెరుగుపడ్డాయి. ఇప్పటికే ప్రాథమిక ఆసక్తిని వ్యక్తం చేసిన భారత్, తుది బిడ్ పత్రాలను ఆగస్టు 31 లోపు సమర్పించాల్సి ఉంది. ఈ క్రీడల నిర్వహణకు అయ్యే పూర్తి ఖర్చును కేంద్ర ప్రభుత్వమే భరిస్తుందని ఐఓఏ స్పష్టం చేసింది. ఈ సమావేశం అనంతరం ఐఓఏ జాయింట్ సెక్రటరీ కల్యాణ్ చౌబే మాట్లాడుతూ, జనరల్ హౌస్ ఈ ప్రతిపాదనను ఏకగ్రీవంగా ఆమోదించింది.

## ఎదురు కాల్పుల్లో భారత్ జవాను మృతి

**ఉరి, ఆగస్టు 13:** జమ్మూకశ్మీర్‌లోని ఉరి సెక్టార్ సమీపంలో ఇవాళ ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. నియంత్రణ రేఖవద్ద జరిగిన కాల్పుల్లో ఓ సైనికుడు మృతిచెందాడు. ఇండియా, పాక్ సైనిక దళాలు ఫైరింగ్‌కు దిగాయి. చొరబాటు యత్నాన్ని ఆపే సమయంలో ఈ ఘటన జరిగింది. ఆర్మీ వర్గాల ప్రకారం ఈనెల 12వ తేదీ రాత్రి కొందరు చొరబాటుకు ప్రయత్నించారు. అయితే రెగ్యులర్‌కు భిన్నంగా ఈ చొరబాటు సాగినట్లు చెబుతున్నారు. చొరబాటు దారులకు అండగా పాకిస్థాన్ ఆర్మీ ఫైరింగ్ జరిపినట్లు తెలుస్తోంది. పాకిస్థాన్ బోర్డర్ యాక్షన్ టీమ్‌లు ఈ ప్రయత్నానికి సహకరించినట్లు స్పష్టమవుతోంది. చొరబాటు జరిగే సమయంలో ఎదురుకాల్పులు జరిగాయి. ఆ సమయంలో గాయపడ్డ జవాను ప్రాణాలు కోల్పోయాడు.



# దక్షిణ కొరియా మాజీ అధ్యక్షుని సతీమణి అరెస్టు



**సియోల్, ఆగస్టు 13:** దక్షిణకొరియా మాజీ అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ సతీమణి, మాజీ ఫస్ట్ లేడీ కిమ్ కియోన్ హీని అరెస్టు చేశారు. స్టాక్ మార్కెట్‌లో అవకతవకలు, మోసాలకు పాల్పడినట్లు ఆమెపై ఆరోపణలు ఉన్నాయి. మార్షల్ చట్టం అమలు చేసిన కేసులో ఇప్పటికే మాజీ అధ్యక్షుడు యూన్ సుక్ యోల్‌ను జైల్లో వేసిన విషయం తెలిసిందే. సియోల్‌లో సుమారు నాలుగు గంటల పాటు మాజీ ఫస్ట్ లేడీ కిమ్‌ను విచారించారు. తాను ఏ తప్పు చేయలేదని ఆమె పేర్కొన్నారు. కానీ కోర్టు మాత్రం అరెస్టు వారెంట్ జారీ చేసింది. సాక్ష్యాధారాలను తారుమారు చేసే అవకాశం ఉన్న నేపథ్యంలో కోర్టు ఆ ఆదేశాలు ఇచ్చింది. గతంలో కూడా మాజీ దేశాధ్యక్షులను జైలుకీడ్చిన ఘటనలు ఉన్నాయి.

# నిన్న ఆసిఫ్‌మునీర్.. నేడు ప్రధాని షరీఫ్!

## సింధుజలాలపై నోరుపారేసుకుంటున్న పాక్ ప్రముఖులు

**ఇస్లామాబాద్, ఆగస్టు 13:** సింధు నదీ జలాల విషయంలో భారత్, పాకిస్థాన్ మధ్య మాటల యుద్ధం తారస్థాయికి చేరింది. తమ దేశానికి చెందిన ఒక్క నీటి చుక్కను కూడా శత్రువులు లాక్కోలేరని పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తాజాగా భారత్‌ను ఉద్దేశించి తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఇస్లామాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, మా నీటిని అడ్డుకుంటామని బెదిరిస్తే, ఒక్క చుక్కను కూడా మీరు తీసుకోలేరని గుర్తుంచుకోండి. అలాంటి ప్రయత్నం చేస్తే గట్టి గుణపాఠం చెబుతామని వ్యాఖ్యానించారు. పహల్గామ్‌లో 26 మంది పౌరుల మృతికి కారణమైన ఉగ్రదాడి జరిగిన మరుసటి రోజైన ఏప్రిల్ 23న, 1960 నాటి సింధు జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేసిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. నీటి ప్రవాహాన్ని అడ్డుకునే ఏ ప్రయత్నాన్నైనా యుద్ధ చర్యగా పరిగణిస్తామని పాకిస్థాన్ పలుమార్లు స్పష్టం చేసింది. కేవలం ప్రధాని మాత్రమే కాకుండా, పాక్ సైన్యాధిపతి జనరల్ అసిమ్ మునీర్ కూడా తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. అమెరికాలోని ఫ్లోరిడాలో ప్రవాస పాకిస్థానీయులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ భారత్ డ్యామ్ కట్టే వరకు వేచి చూస్తాం, కట్టిన తర్వాత దాన్ని నాశనం చేస్తాం. సింధు నది భారతీయుల కుటుంబ ఆస్తి కాదని హెచ్చరించారు. పాక్ సైన్యాధిపతి వ్యాఖ్యలపై భారత విదేశాంగ శాఖ తీవ్రంగా స్పందించింది. పాకిస్థాన్ పదేపదే అణు బెదిరింపులకు పాల్పడటం వారి నైజమని, ఉగ్రవాద గ్రూపులతో అక్కడి సైన్యం కుమ్మక్కైందనడానికి ఇదే నిదర్శనమని పేర్కొంది. ఇటువంటి బెదిరింపులకు భారత్ తలొగ్గదని, దేశ భద్రత కోసం అన్ని చర్యలూ తీసుకుంటుందని స్పష్టం చేసింది. స్నేహపూర్వక దేశమైన అమెరికా గడ్డపై నుంచి ఇలాంటి వ్యాఖ్యలు రావడం విచారకరమని కూడా తెలిపింది. ఇదే అంశంపై పాక్ మాజీ విదేశాంగ మంత్రి బిలావల్ భుట్టో చేసిన వ్యాఖ్యలకు బీజేపీ నేత, నటుడు మిథున్ చక్రవర్తి ఘాటుగా బదులిచ్చారు. శాంతిని ప్రేమించే పాక్ ప్రజలతో తమకు ఎలాంటి విరోధం లేదని, కానీ అక్కడి ప్రభుత్వ పెద్దలకే తమ హెచ్చరిక అని ఆయన స్పష్టం చేశారు.



# డిజిపి కార్యాలయంలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ

**హైదరాబాద్,ఆగస్టు 13, ప్రభాతవార్త:** మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా కేంద్రం చేబట్టిన నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా డిజిపి కార్యాలయంలో బుధవారం ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా అధికారులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. పిఅండ్ ఎల్ ఐజి రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధికారులతో పాటు డిజిపి కార్యాలయ సిబ్బంది అందరు పాల్గొని డ్రగ్స్ నిర్మూలనకు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఐజి రమేష్ మాట్లాడుతూ డ్రగ్స్‌కు వ్యతిరేకంగా అందరు సమిష్టిగా పోరాడాలని, యువత పెడదారి పట్టకుండా చూడాలని కోరారు. ఈ క్రమంలో పోలీసులపై గురుతర బాధ్యత వుందని ఆయన అన్నారు. డ్రగ్స్ కట్టడికి అన్ని వర్గాల వారు విస్తృతంగా ప్రచారం చేయాలని, సమాజంలో అందరిని చైతన్యవంతులను చేయాలని ఆయన కోరారు. డ్రగ్స్ గురించి ఎవరి వద్ద ఎలాంటి సమాచారం వున్నా వెంటనే పోలీసులకు తెలపాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో శాంతి భద్రతల ఏఐజి రమణ కుమార్, డిఎస్‌పి ఉదయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు కాంగ్రెస్ కార్యకర్తలు అండగా ఉండాలి

## టిపిసిసి అధ్యక్షుడు,ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్

**హైదరాబాద్, ఆగస్టు 13,ప్రభాతవార్త:** భారీ వర్షాలతో రాష్ట్రంలో విపత్కర పరిస్థితులు ఎదుర్కొంటున్న ప్రస్తుత అపత్కాలంలో ప్రజలకు కాంగ్రెస్ కార్యకర్తలు అండగా ఉండాలని టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు. అధికార యంత్రాంగం సర్వశక్తులు ఒడ్డి పని చేస్తుందని వారికి స్థానిక పరిస్థితులపై మార్గదర్శకత్వం చేస్తూ సహక రించాలని ఆయన కోరారు. రాష్ట్రంలో భారీ వర్షాలతో అనేక లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. ప్రజలు, ప్రధానంగా పిల్లలు, మహిళలు, వృద్ధులు వరదలతో చాలా కష్టపడుతున్నారని ఆవేదన చెందారు. వానబాదితులకు సహాయ సహకారాలు అందించేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు ఎప్పడిక్కడ ముందుకు వచ్చి మీ వంతు సహాయ సహకారాలు అందించాలని ఆయన హితవు చెప్పారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉండి ప్రజలను వరద బాధితులను ఆదుకోండి. ముంపునకు గురైన ప్రాంతాలలో పోలీసులు, మునిసిపల్ సిబ్బంది, రెవెన్యూ, హైడ్రా తదితర శాఖలు చేస్తున్న సేవలకు మీ వంతు బాధ్యతగా సహకారం అందించాలని ముంపు ప్రాంతాలలో ప్రజలకు ఏమైనా అవసరాలు ఉంటే మంచినీరు, పాలు, ఆహార పదార్థాలు అందించండని కోరారు.

# స్వేచ్ఛను అణగదొక్కేందుకు బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ కుట్రలు

## చంద్రబాబు, జగన్‌లు ఇద్దరూ బిజెపి బానిసలు: తూర్పు జగ్గారెడ్డి

**హైదరాబాద్,ఆగస్టు 13,ప్రభాతవార్త:** దేశ ప్రజల స్వేచ్ఛను అణగదొక్కే కుట్ర బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ చేస్తున్నాయని, అందులో భాగంగానే రాహుల్ గాంధీ కుటుంబం మీద బిజెపి కక్ష పూరితంగా వ్యవహరిస్తుందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మాజీ ఎమ్మెల్యే తూర్పుజగ్గారెడ్డి ఆరోపించారు. గాంధీభవన్‌లో విలేఖరులతో మాట్లాడుతూ మూడోసారి బిజెపి అధికారంలోకి రావడానికి దొంగఓటు కుట్రదోహద పడిందని, అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ఉండకూడదని బిజెపి కుట్ర చేస్తోందని విమర్శించారు. ఎలక్షన్ కమిషన్ బిజెపి అడుగుజాడల్లో నడుస్తోందని, దొంగ ఓట్లను తయారుచేసే నైపుణ్యం కలిగినవి బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లు అన్నారు. దొంగ ఓట్ల ద్వారా అధికారంలోకి వచ్చారని జయప్రకాశ్‌రెడ్డి అనుమానం వ్యక్తంచేశారు. చంద్రబాబు, జగన్‌లు ఇద్దరూ బిజెపి బానిసలు అంటూ ఆరోపించారు. ఆంధ్ర ప్రదేశ్ రాజకీయాలు కల్లుదుకాణం తరహాలో ఉంటాయని తెలంగాణలో అందరు దమ్మున్న నాయకులే అని అన్నారు.

కిరణ్ కుమార్ రెడ్డి కాంగ్రెస్ హయాంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చివరి ముఖ్యమంత్రిగా పనిచేశారని ఇప్పుడు బిజెపి స్క్రిప్ట్ చదవాలి కాబట్టి అదే చేశాడని అన్నారు. కిరణ్ కుమార్ రెడ్డి బిజెపి లీడరా, ఎన్నికల కమిషనరా అర్థం కాలేదని, బిజెపి ప్రముఖ్ ఇచ్చిన చిట్టీ తీసుకుని చదివాడన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ హయాంలో కేంద్ర మంత్రిగా పని చేసినా పురందేశ్వరి ఎన్టీఆర్ కూతురైనా బిజెపి స్క్రిప్టు చదవాల్సిందే అని గుర్తు చేశారు.

# రాహుల్ ధర్నాలో జగన్ పాల్గొనాలి

## భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్ డిమాండ్

**హైదరాబాద్,ఆగస్టు 13,ప్రభాతవార్త:** తెలుగు ప్రజలను తప్పుదోవపట్టించేలా మాట్లాడటం మానుకొని విజయవాడలో జరగబోయే ధర్నాలో జగన్ కూడా రాహుల్‌గాంధీతో కలిసి పాల్గొనాలని భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాహుల్, చంద్రబాబు మధ్య రేవంత్‌రెడ్డి హాట్‌లైన్‌లో ఉంచడం వల్లే ఆంధ్రప్రదేశ్ ఎన్నికలపై రాహుల్ మాట్లాడలేదంటూ జగన్ వ్యంగంగా మాట్లాడటం తగదని మీ రాష్ట్రంలో ఏమైనా తప్పులు జరిగితే, ఎన్నికల్లో ఓటమికి కారణాలపై ఇసి, మోడీ, అమిత్‌షాలను బ్లేమ్ చేయాలికానీ లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడిని కాదని ఆయన హితవుచెప్పారు. ఇంటిగ్రిటీ గురించి మాట్లాడటం చాలా ఆశ్చర్యం కలిగిస్తోందని అన్నారు. హర్యానా, మహారాష్ట్ర, బీహార్, కర్ణాటక రాష్ట్రాల్లో ఎన్నికల కమిషన్ తీసుకుంటున్న నిర్ణయాలు దౌర్భాగ్యంగా ఉంటున్నాయని రాహుల్ అంటున్నారుఅలాంటిది మీరు రాహుల్‌గాంధీ మద్ధతు ఇవ్వాల్సిపోయి విమర్శలు చేయడం సబబు కాదన్నారు. ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత వైఎస్ జగన్ ఆలోచన విధానం ఏంటో నాకు అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే 18వ లోక్‌సభను కాపాడటానికే చంద్రబాబు ఎన్డీఏలో చేరారని లోక్‌సభలో ఎన్డీఏకూటమి బలం 275 దాటడానికి, మోడీసర్కారు అధికారంలో ఉండటానికి చంద్రబాబు కారకులని ఆయన తెలిపారు.

# కేంద్రీకృత అభివృద్ధి ఎంతో అవసరం

## సెస్ మాజీ చైర్మన్ సుదీప్తోం మండల్

**హైదరాబాద్,ఆగస్టు 13 ప్రభాతవార్త:** భారత దేశం అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలంటే ఉపాధి కేంద్రీ కృత అభివృద్ధి ఎంతో అవసరమని సెస్ మాజీ చైర్మన్ సుదీప్తోమండల్ అన్నారు. బుధవారం జరిగిన సెస్ మాజీ ఆర్ రాధాకృష్ణ స్మారకోపన్యాసం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఇప్పటివరకు అభివృద్ధిని స్థూల అభివృద్ధి సూచికగానే చూస్తున్నారు. కానీ గత దశాబ్దకాలం నుంచి స్థూల అభివృద్ధి సూచికలో పెరుగుదల ఉన్నా అభివృద్ధి సూచికలో మాత్రం పెరుగుదల కనపడం లేదన్నారు. ప్రపంచ ఆర్థికసూచిక (ఐఎంఎఫ్) వెల్లడించిన నివేదిక ప్రకారం భారతదేశస్థూల అభివృద్ధి 6.5శాతం పెరగడం ద్వారా చైనా దేశాన్ని అధిగమించడమే కాకుండా ప్రపంచంలో రెండో అతిపెద్దఆర్థిక వ్యవస్థగా రూపొందినట్లు చెప్పారు. దేశంలో ప్రధానమైన వ్యవసాయరంగం, ఉత్పత్తిరంగం ,తయారీ రంగంలో శ్రమతో కూడిన ఉపాధిని పెంచడానికి ఆయా రంగాలను ప్రొత్సహించేందుకు తగిన ఆర్థిక, సాంకేతిక సహకారాన్ని ప్రభుత్వాలు అందించాలని సూచించారు. విద్యారంగంలో సమూల మార్పును తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. పర్యావరణ సుస్థిరతను కాపాడుకు నేందుకు వ్యసాయ రగంలో పలు కార్యక్రమాలను చేపట్టడంతోపాటు వాటికి సంబంధించిన ప్రభుత్వ విధానాలను రూపొందించాలన్నారు. కార్యక్రమంలో సెస్‌డైరక్టర్ ప్రొఫెసర్ రేవతి, సెస్ వ్యస్థాపక సభ్యుడు మహేందర్‌రెడ్డి తదిరులు పాల్గొన్నారు.



తిరంగా ర్యాలీలో పాల్గొన్న ఆర్.కృష్ణయ్య తదితరులు

# దేశ సమగ్రతకు యువత కృషి చేయాలి: కృష్ణయ్య

**హైదరాబాద్, ఆగస్టు 13 ప్రభాతవార్త:** దేశ సమగ్రతకు యువత కృషి చేయాలని ఎంపీ, బీసీ సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య పిలుపునిచ్చారు. వేముల రామకృష్ణ బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎదగాల్సిన ఏ దేశమైన ఆదేశ యువత చేతిలో ఉంటుందని అన్నారు. 100 శాతం అక్షరాస్యత కలిగిన దేశంగా భారతదేశం అడుగులు వెయ్యాల్సిన అవసరం ఉందన్నారు. ఉన్నోడికి లేనోడికి ఒకే విద్య అందివ్వాలని, యువత రాజకీయాల్లోకి వచ్చినప్పుడే దేశం అభివృద్ధి సాధిస్తుందన్నారు. ర్యాలీలో మేరా భారత్ మహాన్ వందేమాతరం నినాదాలతో తిరంగా జండా పట్టుకొని యువత వర్షం లెక్కచేయకుండా భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జా కృష్ణ, కోలా జనార్ధన్, నంద గోపాల్, పృథ్వీ గౌడ్, మణికంఠ, బలరాం తదితరులు పాల్గొన్నారు.

# అడ్డగోలు ఆరోపణలు సరికాదు: మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**జగిత్యాల బ్యూరో ప్రభాతవార్త:** గత ప్రభుత్వంలో అడ్డగోలుగా తప్పులు చేసి నేడు మాపై తప్పుడు ఆరోపణలు చేయడం సమంజసం కాదని టిఆర్ఎస్ నేత ప్రవీణ్ పై రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ మండిపడ్డాడ. జగిత్యాల కేంద్రంలో ఏర్పాటైన మెడికల్ కాలేజీ గెస్ట్ హౌస్‌లో బుధవారం మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు బిఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. జీవో 17 గురించి కూడా ప్రవీణ్‌కు సరైన అవగాహన లేదని విమర్శించారు. కోడిగుడ్ల కొనుగోలు వ్యవహారంలో 600 కోట్ల అవినీతి జరిగింది అనే ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

ఈ సమావేశంలో జగిత్యాల నియోజకవర్గం ఎమ్మెల్యే సంజయ్ కుమార్ , పొలాస నందయ్య జిల్లా పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# హైడ్రా అన్నిరాష్ట్రాలకు అవసరం

## అంబర్‌పేట్‌లోని బతుకమ్మకుంటను సందర్శించిన ఢిల్లీ మున్సిపల్ బృందం



**హైదరాబాద్, ఆగస్టు 13,ప్రభాతవార్త:** హైడ్రా వంటి సంస్థ ప్రతి రాష్ట్రంలో ఉండాలని ఢిల్లీ మున్సిపల్ అధికారుల బృందం అభిప్రాయపడింది. అప్పుడే చెరువులు, నాళాలు, కాలువలు ఆక్రమణకు గురికాకుండా ఉంటాయని పేర్కొంది. ఈమేరకు అంబర్‌పేటలోని బతుకమ్మ కుంటను ఢిల్లీ మున్సిపల్ అధికారుల బృందం సందర్శించింది. చెరువు చుట్టూ తిరుగుతూ.. అభివృద్ధిని దశలవారీ తెలుసుకుంది. ఒకప్పుడు చెత్త, నిర్మాణ వ్యర్థాలతో నిండిన ప్రాంతం చెరువులా రూపాంతరం చెందడాన్ని చూసి ఆశ్చర్యపోయింది. ఈ చెరువు నిర్మాణం జాతీయ స్థాయిలో చర్చకు వచ్చిందని ఈ బృందానికి నేతృత్వం వహిస్తున్న ఢిల్లీ మున్సిపల్ హార్టికల్చర్ విభాగం అధిపతి డా. ఆశిష్ అన్నారు. ఢిల్లీలో కూడా చెరువులు చాలవరకు కబ్జాకు గురి అయ్యాయని హైడ్రా వంటి సంస్థతో వాటిని పునరుద్ధరించడం, పరిరక్షించడం సులభం అవుతుందని అన్నారు. ఈ చెరువు లేనప్పుడు వరద ప్రభావం ఎలా ఉంది... ఇప్పుడు ఎలా ఉంది అనే అంశంపై ఢిల్లీ బృందం ఆరతీసింది. చెరువు ఔట్‌లెట్లను కూడా ఈ బృందం పరిశీలించింది. హైడ్రా అధికారులు మోహనరావు, బాలగోపాల్, చెరువులను అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తున్న విమోస్ టెక్నోక్రాట్ ఎండీ పి. యూనస్‌తో పాటు హెచ్ ఎండీఏ, ఆస్కీ అధికారులు కూడా ఢిల్లీ బృందంతో పాటు బతుకమ్మకుంటను సందర్శించిన వారిలో ఉన్నారు.

# విద్యార్థుల ఫీజు బకాయిలను వెంటనే చెల్లించాలి

## డిప్యూటీ సిఎం భట్టిని కోరిన ఎంపి ఆర్. కృష్ణయ్య



డిసిఎం భట్టివిక్రమార్కకు వినతిపత్రం ఇస్తున్న ఆర్.కృష్ణయ్య తదితరులు

**హైదరాబాద్, ఆగస్టు 13,ప్రభాతవార్త:** రాష్ట్రంలో 14 లక్షల మంది విద్యార్థుల ఫీజు బకాయిలను వెంటనే చెల్లించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపి ఆర్. కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు.

ఈసందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ ప్రైవేట్ యూనివర్సిటీ అడ్మిషన్లలో బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు అమలు చేయాలని, బీసీ విద్యార్థులకు పూర్తి ఫీజులు ప్రభుత్వమే చెల్లించాలని అన్నారు. ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని, విద్యార్థుల తల్లిదండ్రులు పడరాని పాట్లు పడుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో నీలం వెంకటేష్, మణికంఠ, జిల్లపల్లి అంజి, భూపేష్, సి.రాజేందర్, పగిళ్ళ సతీష్, శివ, బలరాం, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్మీ జవాన్ అనిల్‌కు అశ్రునివాళి

## సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు

## కారేపల్లి క్రాస్ రోడ్డు నుండి సూర్య తండా వరకు భారీ బైక్ ర్యాలీ

## 8 నెలల బాబుని ఎత్తుకొని హృదయవిదారకంగా రోదించిన భార్య



**కారేపల్లి, ఆగస్టు 13 ప్రభాతవార్త:** దేశ సరిహద్దుల్లో 13 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తూ కాశ్మీర్ లోయలో జరిగిన ప్రమాదంలో వీరమరణం పొందిన ఖమ్మం జిల్లా సింగరేణి మండలం సూర్య తండా గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ బానోత్ అనిల్ కుమార్ కు అభిమానలోకం కన్నీటి వీడ్కోలు పలికింది. వీరుడా నీకు వందనం.. అమరుడా నీకు వందనం అంటూ నినదిస్తూ హోరెత్తించింది. అంతకుముందు ఆర్మీ అధికారులు అనిల్ భౌతిక కాయాన్ని ఆర్మీ వాహనంలో తీసుకురాగా, కారేపల్లి ఎక్స్ రోడ్ నుండి నుంచి స్వగ్రామం సూర్య తండా వరకు 10 కిలోమీటర్లు భారీ ర్యాలీ తీశారు. ఆర్మీ అధికారులు భౌతికకాయాన్ని మోసుకొచ్చి ఇంటి ముందు వేదికపై ఉంచగా, భార్య రేణుక తల్లి సాలు అన్న ప్రసాద్ కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు. అనంతరం అశేష జనవాహిని మధ్య ఇంటి నుంచి అంతిమ యాత్రగా వెళ్లి, పొలం వద్ద సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

**ప్రముఖుల నివాళి:** జవాన్ అనిల్ భౌతిక కాయం వద్ద పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. వైరా శాసనస భ్యులు మాలోతు రాందాస్ నాయక్ ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ, మాజీ శాసనస భ్యులు లావుడియా రాములునాయక్ బానోత్ చంద్రావతి బిజెపి జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు తదితరులు నివాళి అర్పించారు.

# రాజకీయ అక్కసుతోనే తెలంగాణకు అన్యాయం

## సెమీ కండక్టర్ ప్రాజెక్టు కేటాయింపులో కేంద్రం వివక్ష

## పునఃపరిశీలించి న్యాయం చేయాలని మంత్రి శ్రీధర్ బాబు డిమాండ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఆగస్టు12:** పారిశ్రామికాభివృద్ధిలో ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ గా నిలుస్తున్న తెలంగాణకు రాజకీయ అక్కసుతోనే కేంద్రం అన్యాయం చేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆవేదన వ్యక్తం చేశారు. సెమీకండక్టర్ ప్రాజెక్ట కేటాయింపులో వివక్ష చూపించి, రాష్ట్రంపై సవతి తల్లి ప్రేమను చూపిస్తుందంటూ బుధవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో మండిపడ్డారు. ప్రపంచ స్థాయి అధునాతన సిస్టమ్ అండ్ ప్యాకేజింగ్ ఫెసిలిటీ ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంది. మహేశ్వరంలో 10 ఎకరాల భూమి కేటాయించాం. అన్ని రకాల సబ్సిడీలకు ఆమోదం తెలిపాం. రికార్డు సమయంలో అన్ని అనుమతులిచ్చాం. ఇండియా సెమీకండక్టర్ మిషన్ తుది ఆమోదం లభిస్తే పనులు మొదలు పెట్టేందుకు సదరు ఇన్వెస్టర్ సిద్ధంగా ఉన్నారు. అయినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదు అని విమర్శించారు. అన్ని రకాలుగా అర్హతలున్నా తెలంగాణను విస్మరించి కనీస సంసిద్ధత లేని ఏపీకి ప్రాజెక్టును ఎలా కేటాయిస్తారని మంత్రి శ్రీధర్ బాబు కేంద్రాన్ని ప్రశ్నించారు. ఇలాంటి రాజకీయ ప్రేరేపిత నిర్ణయాలు దేశ పారిశ్రామి కాభివృద్ధికి మంచిది కాదు. అందుకే ఈ నిర్ణయాన్ని మరోసారి పున:పరిశీలించాల్సిన అవసరముంది. వాస్తవ పరిస్థితులను పరిగణలోనికి తీసుకుని తెలంగాణకు మేలు చేసేలా కేంద్రం నిర్ణయం తీసుకోవాలి అని డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి జోక్యం చేసుకుని తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలి. న్యాయం జరిగేలా చొరవ చూపాలి. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాల్సిన తెలంగాణ బీజేపీ ఎంపీలు చోద్యం చూస్తున్నారు. ఇప్పటికీ స్పందించకపోతే తెలంగాణ ప్రజలు అన్ని గమనిస్తున్నారని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో తగిన బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు.

# 19న ఓయు స్నాతకోత్సవంలో ఇస్రోచైర్మన్ నారాయణన్‌కు డాక్టరేట్

**హైదరాబాద్,అగస్టు13,ప్రభాతవార్త:** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ చైర్మన్ డాక్టర్ వి. నారాయణన్‌కు ఉస్మానియా విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ ను ప్రకటించింది. ఈ నెల 19న జరగనున్న ఓయూ 84వ స్నాతకోత్సవంలో ఓయూ కులపతి, రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్ హానోరిస్ (డాక్టరేట్ ఆఫ్ సైన్స్) అందిం చనున్నట్లు ఉపకులపతి ఆచార్య కుమార్ మొలుగరం తెలిపారు. బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో పాలక మండలి నిర్ణయాలను ప్రొఫెసర్ కుమార్ వివరించారు. ఇస్రో చైర్మన్ కు గౌరవ డాక్టరేట్ ప్రకటించటం ఆనందంగా ఉందన్నారు. ముఖ్యఅతిథిగా ఇస్రో చైర్మన్ డాక్టర్ నారాయణన్ 84వ ఓయూ స్నాతకోత్సవంలో ప్రసంగిస్తారని, ప్రపంచానికి, దేశానికి ఆయా రంగాల్లో విశిష్టసేవలందించిన అత్యంత ప్రతిష్టాత్మక వ్యక్తులకు ఉస్మానియా విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్లు అందించి సత్కరించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాజ్యాంగ నిర్మాత, భారత రత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్, రవీంద్ర నాథ్ ఠాగూర్, పండిట్‌జవహర్‌లాల్ నెహ్రూ, సి.రాజగోపాలాచారి, బాబూ రాజేంద్ర ప్రసాద్, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ, యాసర్ ఆరాఫత్, డాక్టర్ వై. నాయుడమ్మ, డాక్టర్ మన్మోహన్ సింగ్, శంతను నారాయణ్, జస్టిస్ ఎన్.వి రమణ సహా 49 మంది ప్రముఖులను గౌరవ డాక్టరేట్లతో ఓయూ సత్కరించుకుందన్నారు. 50వ గౌరవ డాక్టరేట్ ను ఇస్రోచైర్మన్ డాక్టర్ వి.నారాయణన్‌కు ఇవ్వాలని పాలకమండలి నిర్ణయించినట్లు చెప్పారు.

# తల్లిపాలవంటి మాతృభాష జాతి సంస్కృతికి ప్రతీక

## తెలంగాణ గవర్నరు, తెలుగు విశ్వవిద్యాలయం అధ్యక్షుడు జిష్ణుదేవ్‌వర్మ

## వైభవంగా మండలి వెంకట కృష్ణారావు శతజయంతి వేడుకలు

## సంస్కృతి పురస్కారాల ప్రదానోత్సవం



సత్యనారాయణ, మల్లికార్జున్‌లకు సంస్కృతి పురస్కారాలను ప్రదానం చేస్తున్న గవర్నరు జిష్ణుదేవ్‌వర్మ, నిత్యానందరావు, బుద్ధప్రసాద్, రమణాచారి తదితర అతిథులు

**హైదరాబాద్ (నాంపల్లి), ఆగస్టు 13 ప్రభాతవార్త :** మాతృభాష తల్లిపాలంతటి ప్రాముఖ్యత గలదని, మాతృభాష పరస్పరం సంభాషణల కోసమేకాదు జాతి సాంస్కృతికి ప్రతీక అని తెలంగాణ రాష్ట్ర గవర్నరు, సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం అధ్యక్షుడు జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. అందుకే జాతీయ నూతన విద్యావిధానంలో ప్రాథమికస్థాయి వరకు విద్యార్థులకు మాతృభాషలో బోధనకు ప్రాధాన్యం ఇచ్చిందంటూ ప్రతీఒక్కరూ విధిగా మాతృభాషలో వ్రాయడం, చదవడం అభ్యసించాలని, మాతృభాషలోనే మాట్లాడుకోవాలని, ప్రతీ ఇల్లు మాతృభాష పాఠశాల కావాలని సూచించారు. ప్రముఖ గాంధేయవాది, పేద బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి తన జీవితాన్ని అంకితం చేసిన సంఘసేవకుడు, మహోన్నత రాజకీయ నాయకుడు మండలి వెంకట కృష్ణారావు మాతృభాషకు చేసిన సేవలు అనితరసాధ్యమన్నారు. 1977లో ఏపి ఏర్పడిన భయంకర ఉప్పెన సమయంలో ప్రజలకు చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. తెలుగుజాతి ఐక్యతను, తెలుగుభాష–సాంస్కృతిక వికాసం, సంస్కృతి పరిరక్షణ, జాతీయ అంతర్జాతీయంగా చాటడానికి అంతర్జాతీయ తెలుగు కేంద్రాన్ని తెలుగు విశ్వవిద్యాలయానికి అనుబంధంగా పెట్టడం, ప్రతీ సంవత్సరం ఆయన ఆశయానికి కృషిచేస్తున్న వారికి సంస్కృతి పురస్కారాలతో సత్కరించడం ముదావహం అన్నారు.

తండ్రి ఆశయాలకు కొనసాగిస్తూ అన్నివిధాలా పాటుపడుతున్న మండలి బుద్ధప్రసాద్‌ను ఎంతగానో అభినం దించారు. సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం, మండలి వెంకట కృష్ణారావు అంతర్జాతీయ తెలుగు కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం తెలుగు విశ్వవిద్యాలయ ప్రతిష్టాత్మక మండలి వెంకట కృష్ణారావు సంస్కృతి పురస్కారాల ప్రదానోత్సవం వైభవంగా జరిగింది. విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు సభాధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గవర్నరు, విశ్వవిద్యాలయం అధ్యక్షుడు జిష్ణుదేవ్‌వర్మ ముఖ్యఅతిథిగా పాల్గొని గౌరవ అతిథులు తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి, ఏపి అవనిగడ్డ శాసనసభ్యుడు, ఏపి శాసనసభ పూర్వ ఉపసభాపతి డా. మండలి బుద్ధప్రసాద్, విశ్వవి ద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమం తరావు తదితరులతో కలిసి అజో–విభొ–కందాళం ఫౌండేషన్, అమెరికా అధ్యక్షుడు అప్పాజోస్యుల సత్యనారాయణను ఘనంగా సత్కరించి 2024 సంవత్సరానికిగాన తెలుగు భాషాభివృద్ధి మండలి, సోలాపూర్ అధ్యక్షుడు కమటం మల్లికార్జున్‌ను ఘనంగా సత్కరించి 2025 సంవత్సరానికిగాను సంస్కృతి పురస్కారాలను ప్రదానంచేసి శుభాభినందనలు తెలిపి తెలుగు భాష, సంస్కృతికి వారు చేస్తున్న కృషిని ప్రశం సించారు. ముందుగా సభకు విశ్వవిద్యాలయ విస్తరణ విభాగం రింగు రామమూర్తి స్వాగతం పలికారు. ఆచార్య వెలుదండ నిత్యానందరావు అధ్యక్షోపన్యాసంలో గాంధేయ విలువలు, నైతిక నిష్ఠాగరిష్టతకు, ధర్మకర్తృత్వ సిద్ధాంతానికి, నిస్వార్థసేవా పరాయణతకు నిలువెత్తు నిదర్శ నంగా నిలిచిన రాజకీయ నాయకుడు మండలి వెంకట కృష్ణారావు అని కొనియాడారు. పురస్కార స్వీకర్తలను అభినందించారు.

డా. కె.వి.రమణాచారి దేవుడిచ్చే ఆరు సుగుణాలు కలిగివున్న మండలి వెంకటకృష్ణారావు స్మరించుకొంటుండగా కుమారుడు బుద్ధప్రసాద్ వాటిని పుణికిపుచ్చుకుని ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నందుకు అభినందనలు తెలిపారు.

# ప్రాజెక్టులవద్ద వద్ద 24గంటలు పహారా

## అప్రమత్తంగా ఉండండి.. అలసత్వం వద్దు: మంత్రి ఉత్తమ్

**హైదరాబాద్,ఆగస్టు 13,ప్రభాతవార్త:** రాష్ట్రంలో భారీ నుండి అతి భారీ వర్షాలు సంభవించే అవకాశం ఉందంటూ వాతావరణ శాఖా హెచ్చరిస్తున్న నేపథ్యంలో నీటిపారుదల శాఖాధికారులు పోలీసులు రెవెన్యూ అధికారులతో సమన్వయంగా ఉంటూ రోజంతా ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరా శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం నీటిపారుదల శాఖాధికారులతో నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, నాగార్జునసాగర్ ,జూరాల, కడెంతో సహా ప్రధాన ప్రాజెక్టుల పై సమీక్ష చేశారు. వీడియో కాన్ఫరెన్స్ లో నీటిపారుదల శాఖా ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, జాయింట్ సెక్రటరీ కే. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్‌లతో, నీటి పారుదల ఉన్నతాధికారులతో నిరంతరం సమాచారం అందించాలని ఆదేశాలు జారీచేశారు. నీటి పారుదల శాఖలో లష్కర్ నుంచి నీటిపారుదల సెక్రటరీ, ఇఎన్‌సి వంటి ఉన్నతాధికారుల వరకు అందరూ విధి నిర్వహణలో ఉండాలి..ఎవ్వరూ సెలవులలో ఉండకూడదు, కాలువలు, చెరువులు, ప్రాజెక్టులు అన్నింటినీ ఎప్పటికప్పుడు పరిశీలన చేయండి. రాష్ట్రంలో ప్రాజెక్టులు, చెరువులు, కాలువల పరిస్థితి వాటి ఒ అండ్ ఎం విషయంలో తీసుకొన్న జాగ్రత్తలపై చర్చించి ఎక్కడైనా లోపాలు ఉంటే వాటిని సవరించుకోవాలని తెలిపారు.

# ఆరు గ్యారెంటీలపై భట్టి విక్రమార్కకు కేటీఆర్ సవాల్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, ఆగస్టు13:** దాదాపు అన్ని గ్యారంటీలు అమలు చేశామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేసిన ప్రకటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. దమ్ముంటే ఇదే మాట తెలంగాణలోని ఏదైనా ఒక గ్రామానికి వెళ్లి ప్రజలకు చెప్పాలని సవాలు విసిరారు. ఆరు గ్యారంటీల అమలుపైన కాంగ్రెస్ మోసాన్ని, ప్రాపగండాను చూసి కాంగ్రెస్ నేతలను గ్రామాల నుంచి తన్ని తరుముతున్నారని కేటీఆర్ తెలిపారు. భట్టి విక్రమార్కకు, ఆయన క్యాబినెట్ మంత్రులకు దమ్ముంటే ఏదైనా ఒక గ్రామానికి వెళ్లి ఆరు గ్యారంటీలు అమలు చేశామని చెప్పాలని డిమాండ్ చేశారు. ఆ గ్రామం నుంచి వీళ్ళని తరిమి వేయకుంటే శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాలు విసిరారు. గ్యారంటీ కార్డులు దాచుకోండి, 100 రోజుల్లో అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి రెండుసంవత్సరాలైనా ఒక్క గ్యారెంటీని సరిగ్గా అమలు చేయలేదని విమర్శించారు. బీఆర్ఎస్ కార్యకర్తలు వెంటనే వరద ప్రభావిత ప్రాంతాలకు వెళ్లి త్రాగునీరు, పాలు, ఆహారం, మందులు, బట్టలు వంటి కనీస అవసరమైన సహాయాన్ని అందించాలన్నారు.

# ఎంఎంఆర్‌పికి నీటి విడుదలచేయండి

## ఉత్తమ్‌కు శాసనమండలి చైర్మన్ లేఖ

**హైదరాబాద్, ఆగస్టు 13,ప్రభాతవార్త:** ఎంఆర్‌పి ప్రాజెక్ట్ 5వ యూనిట్ , పుట్టంగండి దగ్గర మోటార్ ని అమర్చి, 3.20 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ కోరారు. నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి లేఖ రాస్తూ ఐదవ యూనిట్ మోటార్ వల్ల నల్గొండ జిల్లాలోని 21 మండలాలకు నీరందుతుందని ఆయన లేఖలో పేర్కొన్నారు . కేవలం 148.30 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేస్తే జిల్లాలోని రైతులకు లాభం చేకూరుతుందని గుత్తా సుఖేందర్ రెడ్డి లేఖ ద్వారా ఉత్తమ్ కుమార్ రెడ్డికి వివరించారు.

## వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలి
### ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా

**హైదరాబాద్, ఆగస్టు 13 ప్రభాతవార్త:** రాష్ట్రానికి 3 రోజుల పాటు భారీ వర్ష సూచన ఉన్న నేపథ్యంలో ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మంత్రి దామోదర రాజనర్సింహా సూచించారు. ఈ మేరకు బుధవారం ఉదయం ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో మంత్రి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. హాస్పిటళ్ల సూపరింటెండెంట్లు, ఆర్ఎంవోలు, మెడికల్ ఆఫీసర్లు, డాక్టర్లు, సిబ్బంది ఈ మూడు రోజులు కచ్చితంగా హాస్పిటల్స్‌లోనే ఉండాలన్నారు. ఇందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. అంబులెన్స్‌లు, 102 వాహనాలు అన్నీ సిద్ధంగా ఉంచుకోవాలని, ఎక్కడ ఎమర్జెన్సీ ఉన్నా తక్షణమే వెళ్లి పేషెంట్‌ను తరలించేలా డ్రైవర్లు, ఈఎంటీలను 24 గంటలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. హాస్పిటళ్లలో విద్యుత్ అంతరాయం లేకుండాచర్యలు తీసుకోవాలన్నారు.

## రాఖీ పౌర్ణమికి మహిళల రికార్డు ప్రయాణాలు
### ఆరు రోజుల్లో 2.51 కోట్ల ఉచిత ప్రయాణాలు: మంత్రి పొన్నం

**హైదరాబాద్, ఆగస్టు 13 ప్రభాతవార్త:** రాఖీ పౌర్ణమి సందర్భంగా టీజీఎస్ఆర్టీసీ బస్సులను మహిళలు పెద్ద ఎత్తున వినియోగించుకున్నట్లు ఆర్టీసి రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. గత 6 ఆరు రోజుల్లో మొత్తం 3.68 కోట్ల మంది రాకపోకలు సాగించగా.. అందులో 2.51 కోట్ల ఉచిత ప్రయాణాలు చేసినట్లు పేర్కొన్నారు. రాఖీ పండుగను పరస్కరించుకుని ఈ నెల 9న 45.62 లక్షల మంది మహిళలు ప్రయాణించగా ఈ నెల 11న అత్యధికంగా 45.94 లక్షల మంది రాకపోకలు సాగించినట్లు చెప్పారు. ఒక్కరోజులో ఇంతమంది మహిళలు ప్రయాణించడం ఇదే తొలిసారని, గత ఏడాది రాఖీకి 2.75 కోట్ల ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేయగా. ఈ ఏడాది 3.68 కోట్ల మంది రాకపోకలు సాగించినట్లు చెప్పారు. గతేడాదితో పోలిస్తే 92.95లక్షల మంది ఎక్కువగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారని, ఈ ఏడాది 2.28కోట్ల కిలోమీటర్లు ఆర్టీసీ బస్సులు తిరిగాయని, గత ఏడాదితో పోల్చితే 53 లక్షల కిలో మీటర్లను అదనంగా సంస్థ తిప్పిందన్నారు.

## పెళ్లి ఇంట విషాదం: రోడ్డు ప్రమాదంలో పెళ్లికూతురు అన్నయ్య ,పెదనాన్న మృతి

**తిరుమలయపాలెం, ఆగస్టు 13 ప్రభాత వార్త:** మండల పరిధిలోని పిండిప్రోలు గ్రామానికి చెందిన దొండేటి సాయి రంజిత్ (33) , తిరుమలాయపాలెం గ్రామానికి చెందిన కొండబాల. శ్రీనివాస్ (64) ఇద్దరు కలిసి సాయి రంజిత్ చెల్లి సాయిమనీషా వివాహం సూర్యాపేట జిల్లా దామరచర్ల కు చెందిన వ్యక్తి తో వివాహం నిశ్చయంకాగా ఈ నెల14 బుధవారం ఖమ్మం నాయుడుపేట పి.వి.ఆర్ గార్డెన్ లో 11గంటలకు జరగనుండగా, ఈ నేపథ్యంలో పెళ్లికూతురు తలంబ్రాల చీర బంగారు ఆబరణాలు ఇచ్చేందుకు సాయి రంజిత్ పెదనాన్న కొండబాల. శ్రీనివాస్ తో కలసి కారులో వెళుతుండగా ముదిగొండ మండలం గోకినపల్లి గ్రామం వద్ద జాతీయ రహదారిపై కారు అదుపుతప్పి డివైడర్ ను ఢీకొనడంతో సాయిరంజిత్,శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు.కారు పూర్తిగా ప్రమాదంలో ముందు భాగం నుజ్జు కావడంతో కారులో ఇరుక్కుపోయిన మృతదేహాలను హైడ్రాలిక్ సాయంతో వెలికి తీసి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు.

## తెలంగాణ రైజింగ్ 2047లక్ష్యసాధనలో చిన్నారుల పాత్రే కీలకం: మంత్రి సీతక్క

**హైదరాబాద్,ఆగస్టు 13 ప్రభాతవార్త:** ప్రతి చిన్నారికి ఆరోగ్యకరమైన, సంతోషకరమైన బాల్యం అందించడానికి మిషన్ వాత్సల్య ద్వారా చేపట్టాల్సిన కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని మంత్రి సీతక్క సూచించారు.సచివాలయంలో మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క అధ్యక్షతన బాలల హక్కుల కమిషన్ కార్యకలాపాలపై సమీక్ష సమావేశం జరిగింది.క్షేత్రస్థాయిలో బాలల హక్కుల కమిషన్ మరింత క్రియాశీలకంగా పని చేయడానికి మహిళా శిశు సంక్షేమ శాఖ పూర్తి స్థాయిలో సహకారం అందిస్తుందని మంత్రి హామీ ఇచ్చారు. నేటి బాలలే రేపటి తెలంగాణ భవిష్యత్తు పౌరులని,సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన తెలంగాణ రైజింగ్ 2047"లక్ష్యసాధనలో నేటి బాలలదే కీలక పాత్ర అని ఆమె అన్నారు. ఈ సమావేశంలో బాలల హక్కుల కమిషన్ చైర్పర్సన్ సీతా దయాకర్ రెడ్డి, సభ్యులు, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ సృజన, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**సీతక్కను కలిసిన స్త్రీనిధి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు**



సచివాలయంలో మంత్రి సీతక్కను మర్యాదపూర్వకంగా కలిసిన స్త్రీనిధి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కలిశారు. రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న వడ్డీలేని రుణాలలో మొదటి ప్రాధాన్యత స్త్రీ నిధి రుణాలకు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.మహిళల్లో సంస్థపై మరింత ఆత్మవిశ్వాసం పెరిగి సంస్థ బల పడటానికి దోహదపడుతుందని వారు వివరించారు. అసోసియేషన్ సంస్థ నుంచి వైదొలిగిన పూర్వ ఉద్యోగులు స్వార్థపూరితంగా నిరాధారమైన దుష్ప్రచారాన్ని చేస్తున్నారని మంత్రికి వివ రించారు.వారి తప్పుడు ప్రచారం వల్ల రుణ చెల్లింపులు తగ్గిపోయాయని మంత్రికిఫిర్యాదు చేసిన అసోసియేషన్‌సంస్థ ప్రతిష్టను దిగజార్చేలా కొంత మంది పనిగట్టుకుని అసత్య ప్రచారం చేస్తున్నారని మంత్రి దృష్టికి తీసుకు వచ్చారు.

## కోడిగుడ్లలో రూ.600 కోట్లు కుంభకోణం నిరాధారం: మంత్రి అడ్లూరి లక్ష్మణ్

**హైదరాబాద్,ఆగస్టు 13,ప్రభాతవార్త:** రాష్ట్రంలోని సంక్షేమ రెసిడెన్షియల్ విద్యాసంస్థల కోసం గుడ్ల కొనుగోలు వ్యవహారంలో రూ.600 కోట్ల కుంభకోణం జరిగిందని వస్తున్న ఆరోపణలను తెలంగాణ ప్రభుత్వం పూర్తిగా నిరాధారమని మంత్రి అట్లూరి లక్ష్మణ్ కొట్టిపారేశారు. జూలై 8, 2025న జారీ చేసిన జి.ఓ.ఎం.సి. 17కింద పెద్ద కాంట్రాక్టర్లకు లాభం చేకూర్చే విధానం తీసుకొచ్చారని వచ్చిన వార్తలు వాస్తవం కాదని స్పష్టం చేశారు. జి.ఓ.ఎం.సి. 16మరియు జి.ఓ.ఎం.సి. 17 మధ్య ఉన్న తేడాను ఉద్దేశపూర్వకంగా కలగలిపి ప్రచారం చేస్తున్నారన్నారు. సుమారు 6.49 లక్షల మంది విద్యార్థులకు నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ మార్గదర్శకాల ప్రకారం నాణ్యమైన, సకాలంలో,నాణ్యమైన బలవర్ధకమైన భోజనం అందించడమే లక్ష్యమని మంత్రి అన్నారు.

## చిత్రపురిలో 300 కోట్ల స్కాం?
### అధ్యక్షుడు వల్లభనేని అనిల్‌ను అరెస్ట్ చేయాలంటూ ఎఫ్‌డిసి వద్ద సినీ కార్మికుల మహాధర్నా

**హైదరాబాద్:** చిత్రపురి హౌసింగ్ సొసైటీలో సుమారు 300 కోట్ల రూపాయల మేర భారీ కుంభకోణం జరిగిందని, సొసైటీ అధ్యక్షుడు వల్లభనేని అనిల్ కుమార్ ఆధ్వర్యంలో అవినీతి పెరిగిపోతోందని ఆరోపిస్తూ పలువురు సినీ కార్మికులు, నాయకులు ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (నీదీది) కార్యాలయం ముందు బుధవారం మహాధర్నా చేపట్టారు. ఫ్లాట్లను బ్లాక్ మార్కెట్‌లో కోట్లకు అమ్ముకుంటున్నారని ఆరోపిస్తూ, వల్లభనేని అనిల్ కుమార్‌ను తక్షణమే అరెస్ట్ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా చిత్రపురిపోరాట సమితి, సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ, కార్మికులకోసం కేటాయించిన స్థలంలో వారిని మోసం చేసే కుట్ర జరుగుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. "చిత్రపురిలో మిగిలిన 2.5 ఎకరాలలో, కార్మికులు అడుగుతున్న సింగిల్, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కాదని, 1200 నుండి 4400 చదరపు అడుగుల విస్తీర్ణంలో భారీ నిర్మాణాలు చేపట్టి, వాటిని బయటి వ్యక్తులకు అమ్ముకోవడానికి కమిటీప్లాన్ చేసింది. కార్యాలయ అధికారులతో కుమ్మక్కైఅక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

# 'ఖజానా' దొంగలు పోలీసులకు చిక్కారు?

**శేరిలింగంపల్లి, ఆగస్టు 13 ప్రభాతవార్త:** చందానగర్ ఖజానా జుయెలర్స్ దోపిడీకి పాల్పడిన దుండగులు పోలీసులకు పటాన్‌చెరు ఔటర్‌రింగ్‌రోడ్డు వద్ద చిక్కారని సమాచారం. పట్టపగలే ఖజానా జ్యువెలర్‌లోనికి దుండుగులు చొరబడి పదిని ముషాల్లో పనిముగించుకుని అందినకాడికి బంగారం, వెండివస్తువులను దోచుకెళ్లిన సంఘటన సంచలనం సృష్టించింది. ఒకరిపై కాల్పులు జరిపి 10 కిలోల వెండి వస్తువులు, 1గ్రామ్ బంగారు అభరణలను తస్కరించి ఉడాయించిన సంగతి విదితమే... చందానగర్‌లోని గంగారం జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఖజానా జ్యువెలర్స్‌ను నిన్న ఉదయం 10గంటలకే సిబ్బంది రోజూమాదిరిగా తెరిచారు. కాగా 10:30 నిముషాలకు సిబ్బందితో రోజువారీ విదులు, ఇతర విషయాలపై షాప్ అసిస్టెంట్‌మేనేజర్ సతీశ్ కుమార్ సిబ్బందితో సమావేశమయ్యారు. కాగా సెక్యూటరిటీ గార్డు సమక్షంలో తొలి అంతస్తులోని లాక్‌తెరచి బంగారు అభరణాలను మేనేజర్ అంజిరెడ్డిసిబ్బందికి ఇస్తే వాటిని కౌంటర్‌లో పెట్టడంజరుగుతోంది. కాగా మేనేజర్ అంజిరెడ్డి లాకర్ తాళాలు మరచిపోవడంతో ఇంటికి వెళ్లాడు. అప్పటికే దుకాణం బయట మాస్కులు, హెల్మెట్లను ధరించి దుకాణం ముందుతిరుగుతున్న గుర్తుతెలియని దుండగులు షాపులోనికి అకస్మాత్తుగా ప్రవేశించారు. ముగ్గురు దుండగులు తుపాకీలను చూపిస్తూ సిబ్బందిని




భయభ్రాంతులకు గురిచేశారు. బిల్ కౌంటర్ దగ్గర ఉన్న వ్యక్తిని బంగారం నాణ్యతను నిర్థారించే సిబ్బందిని బెదిరించి గాల్లోకి కాల్పులు జరిపారు. అసిస్టెంట్ మేనేజర్ సతీశ్‌కుమార్‌కు తుపాకీ గురిపెట్టిలాకర్ తాళాలు ఇవ్వాలని బెదిరించారు. తన వద్ద లాకర్లు లేవని, మేనేజర్ బయటకు వెళ్లాడని చెప్పటంతో అసహనానికి గురైన దుండగులు సతీష్‌కుమార్‌పై కాల్పులు జరిపారు. దీంతో సిబ్బంది కేకలు పెడుతూ ప్రాణభయంతో పరుగులు తీశారు. ఈ సంఘటనలో అసిస్టెంట్ మేనేజర్ సతీశ్ కాలికి బుల్లెట్ గాయాలయ్యాయి. అయితే లాకర్లు లేకపోవడంతో దొంగలు వెండి వస్తువులు ఉన్న కౌంటర్లను ధ్వంసం చేసి 10కిలోల వెండి వస్తువులను, 1గ్రామ్ గోల్డ్ అభరణాలనుతస్కరించి పరారయ్యారు. ఈ వ్యవహారం అంతా దుండగులు పదినిముషాలలోనే ముగించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి, మాదాపూర్ డీసీపీ వినయ్, ఏసీపీ శ్రీనివాస్, చందానగర్ ఇన్‌స్పెక్టర్ విజయ్, పోలీసు అధికారులు సంఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్‌టీం రెండు ఖాళీ షెల్స్‌ను స్వాధీనం చేసుకుని ఆధారాలను సేకరిస్తున్నారు. దుండగులు బైక్‌లపై రావడం, పటాన్‌చెరు మీదుగా ఇంద్రేశం, జిన్నారం, బొంతపల్లి గ్రామాల నుంచి మేడ్చల్ వైపుగా వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. దుండగులంతా ఇతర రాష్ట్రాలకు చెందిన వారుగా ప్రాథమికంగా గుర్తించారు. ఛత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల పోలీసులను అప్రమత్తం చేశారు. ఈ దోపిడిలో ఆరు నుంచి ఏడుగురు దుండగులు ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. ఆరుగురు దుకాణంలోనికి చొరబడగా ఒకరు బయటనే ఉంటూ లోపలి వ్యక్తులకు సమాచారం అందించే వ్యక్తిగా తెలుస్తుంది. ఈ దోపిడీ వ్యవహారంలో షాపు మేనేజర్ అంజిరెడ్డి లాకర్లను మరచిపోవడం భారీ చోరీ తప్పినట్లయ్యింది. లాకర్లలో దాదాపు వందకేజీల బంగారు అభరణాలు, కోట్ల విలువైన వజ్రాలు ఉన్నాయని సమాచారం. లాకర్ తాళం మరచిపోవడంతో నిజాంపేటలోని తన నివాసానికి వెళ్లిన అంజిరెడ్డి తిరిగివచ్చేలోపుగా దుండగులు షాపులోనికి ప్రవేశించి దోపిడీకి పాల్పడ్డారు. కాగా దాదాపు 3వందల కిలోల వెండి వస్తువులు బయటనే ఉండగా కోటింగ్ ఉన్న వెండబి వస్తువులను బంగారంగా భ్రమపడి దుండగులు వాటినే దొంగిలించటం కొసమెరుపు.

# ప్రపంచ దేశాలను వణికిస్తున్న మైక్రో బరస్ట్
### ఆకాశం నుంచి నది ప్రవాహం తరహాలో మహా కుంభవృష్టి

**హైదరాబాద్, ఆగస్టు 13, ప్రభాతవార్త:** పర్యావరణంలో ఏర్పడ్డ మార్పుల కారణంగా ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా వాతావరణంలో అనూహ్య మార్పులు ఏర్పడడం తెలిసిందే. ఎల్ నినో, లానినో ఇందులో భాగంగా వచ్చినవే. కొన్నిచోట్ల విపరీతమైన వర్షాలు, ఇంకొన్ని చోట్ల అతి తీవ్రమైన కరువు ఏర్పడడం చూస్తున్నాం. ఈ క్రమంలోనే కొన్నిచోట్ల క్లౌడ్ బరస్ట్ (మేఘ విచ్ఛిత్తి)లు కూడా భారత్ సహా పలు దేశాలను వణికిస్తున్నాయి. అర గంట నుంచి గంట వ్యవధిలో 15 నుంచి 30 సెంటిమీటర్ల వర్షం కురవడం క్లౌడ్ బరస్ట్ ప్రత్యేకత. అయితే క్లౌడ్ బరస్ట్‌కు మించిన మైక్రో బరస్ట్ ప్రపంచ దేశాలను వణికిస్తోంది. అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రంలో ఆస్టిన్‌లో కొన్ని నెలల క్రితం మైక్రో బరస్ట్ కారణంగా వున్నట్లుండి పెద్ద మేఘం సుడిగాలి తరహాలో నదీ ప్రవాహం మాదిరిగా ఒక్క ఉదుటున ఊరిపై పడి ఆ ప్రాంతాన్ని ముంచెత్తింది. భూకంపం సమయంలో సముద్రంలో ఏర్పడే సునామిల తరహాలో నీరు ఒక్కసారిగా ఊళ్లను ముంచెత్తినట్లు మైక్రో బరస్ట్ వల్ల మహా కుంభవృష్టి ఆస్టిన్‌నుఅమాంతం మొన్న ఉత్తంఖండ్‌లోని దరాళినికబళించినట్లు తుడిచి పెట్టింది.

**మైక్రో బరస్ట్ అంటే ఏమిటీ?:** ఇంతకు మైక్రో బరస్ట్ అంటే ఏమిటనేది ఇప్పుడు వాతావరణ శాస్త్రవేత్తలతో పాటు సామాన్యులను కలవర పరుస్తోంది. క్లౌడ్ బరస్ట్ వల్ల 20 నుంచి 30 కిలోమీటర్ల పరిధిలో గంట వ్యవధిలో పది నుంచి 20 లేదా అంతకు మించిన వర్షపాతం నమోదవుతుంది. కానీ మైక్రో బరస్ట్ అలా కాదు. శక్తివంతమైన ఉరుములతో కూడిన మేఘంలోని చల్లని గాలి బలమైన నిలువు ప్రవాహంలో భూమి వైపుకు తోసుకు వస్తుంది. ఈ సుడిగాలి తనతో పాటు మేఘంలో వున్న నీటిని కూడా అత్యంత వేగంగా కిందకు లాగేస్తుంది. దీంతో సాధారణ వర్షం మాదిరిగా చినుకులుగా కాకుండా భారీ నీటి స్తంభంలా ఆకాశం నుంచి ఓ నది భూమిపైకి జారి పడి పోయిందా? అన్నట్లుగా పరిస్థితి వుంటుంది. మేఘాలను తోసుకుంటూ వచ్చే వేగమైన గాలి ప్రవాహం భూమిని తాకినపుడు అది నక్షత్ర ఆకారంలో అన్ని దిశలకు వ్యాపిస్తుంది. దీనినే శాస్త్రజ్ఞులు మైక్రో బరస్ట్‌గా నామకరణం చేశారు. ఈ ప్రక్రియలో గంటకు 200 నుంచి 250 కిలోమీటర్ల వేగంతో సుడిగాలులు ఏర్పడతాయి. మైక్రో బరస్ట్‌లు అమెరికాలో ఏర్పడే టోర్నాడోలా ఒకేలా కనిపించినా వీటిలో తేడాలుంటాయి, టోర్నాడోలో గాలి సుడిగుండంలా తిరుగుతూ అవి ఏర్పడిన చోటే నష్టాన్ని కలిగిస్తాయి. కానీ మైక్రో బరస్ట్‌లు గాలి నేరుగా భూమిని చేరి అన్ని దిశలకు వ్యాపించి అతి భారీ నష్టంచే కూరుస్తుంది. 2024లో అమెరికాలోని టెక్సాస్‌లో గల ఆస్టిన్‌లో ఏర్పడ్డ మైక్రో బరస్ట్ భారీ నష్టాన్ని మిగిల్చింది. అంతకు ముందు 2020లో ఆస్ట్రేలియాలోని పెర్త్‌లోనూ ఇలాంటి మహా కుంభవృష్టి పెను విషాదాన్ని మిగిల్చింది. ఆకాశం నుంచి వర్షం సునామీలా భూమిపై పడినట్లుగా అప్పటి దృశ్యాలు తాజాగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. వాస్తవానికి మైక్రో బరస్ట్ 1983లో అమెరికాలోని మేరీ ల్యాండ్‌లో గల ఆండ్రూస్ ఎయిర్ ఫోర్స్ బేస్‌లో తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. ఈ సమయంలో ఇక్కడ గంటకు 240 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది. దీని తరువాత 198 4లో అమెరికాలోని సౌత్ డకోటా రొవెనాలోనూ సంభవించి తీవ్ర నష్టాన్ని కలిగించింది. ఈ సమయంలో ఇక్కడ గాలి 257 కిలోమీటర్ల వేగంతోవీచింది. ఇక భారత్‌లో కూడా కొన్నేళ్లుగా వాతావరణంలో పెనుమార్పులు సంభవిస్తుండంతో రాబోయేరోజుల్లో క్లౌడ్ బరస్ట్‌ల స్థానంలో మైక్రో బ రస్ట్‌లు ఏర్పడడం ఖాయంగా కనిపిస్తుందని నిపుణులు చెబుతున్నారు.

# మంచు లక్ష్మిని ప్రశ్నించిన ఇడి
### బెట్టింగ్ యాప్ గోల్‌మాల్
### ఢిల్లీలో ఇడి అధికారుల ఎదుట హాజరైన క్రికెటర్ సురేష్ రైనా

**హైదరాబాద్, ఆగస్టు 13, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా అనేక మంది ప్రాణాలను బలిగొన్న బెట్టింగ్ యాప్‌ల గోల్‌మాల్‌పై కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్ ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ) హైదరాబాద్ విభాగం సినీ తారలను మొదటి దఫా విచారించే క్రమం ముగిసింది. ఈ కేసులో ఇంతకు ముందు ప్రకాష్ రాజ్, విజయ్ దేవరకొండ, దగ్గుబాటి రానాను విచారించిన ఈడీ అధికారులు బుధవారం నాడు మంచు లక్ష్మిని నాలుగు గంటల పాటు ప్రశ్నించారు. పలువురు సినీ నటులతో పాటు సోషల్ మీడియా ఇన్‌ఫ్ల్యూయున్సర్లు, టీవి హోస్ట్‌లు బెట్టింగ్ యాప్‌లను ప్రమోషన్ చేయడం తెలిసిందే. ఈ నేపథ్యంలో జంగ్లీ రమ్మీ ఎ23, జిట్‌విన్, పారి మ్యాచ్, టోటస్ 365 వంటి యాప్‌లను ప్రమోట్ చేసిన ప్రముఖులపై 1867 పబ్లిక్ జూదం చట్టం కింద పంజాగుట్ట, మియాపూర్, సైబరాబాద్, సూర్యాపేట, వైజాగ్‌లలో కేసులు నమోదయ్యాయి. బెట్టింగ్ యాప్‌లో మనీలాండరింగ్ జరిగిందనే కోణంలో ఈడీ విచారణ చేబట్టింది. ఈ క్రమంలోనే టాలీవుడ్ నటి మంచు లక్ష్మికి ఈడీ నోటీసులు జారీ చేయగా ఉదయం పదిన్నర గంటల సమయంలో ఆమె బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయానికి వచ్చారు. మధ్యాహ్నం రెండున్నర గంటల వరకు ఈడీ అధికారులు ఆమెను ప్రశ్నించారు. ఏ ఏ బెట్టింగ్ యాప్‌లకు ప్రమోట్ చేశారనేఅంశంతో పాటు ఈ సందర్భంగా ఆయా కంపెనీల నుంచి అందిన సొమ్ము గురించి, దీంతో పాటు అందినకమీషన్లు ఎంత..? అని ఈడీ అధికారులు మంచు లక్ష్మిని ప్రశ్నించినట్లు సమాచారం. దీంతో పాటు మంచు లక్ష్మికి సంబంధించిన బ్యాంకు లావా దేవీలు, బెట్టింగ్ యాప్‌లతో కుదుర్చుకున్న ఒప్పంద పత్రాలను ఈడీ అధికారులు తీసుకున్నట్లు తెలిసింది. ఈ పత్రాల ఆధారంగా మంచు లక్ష్మిని ఈడీ అధికారులు అనేక అంశాలపై ప్రశ్నించినట్లు సమాచారం. కాగా విచారణ తరువాత మంచు లక్ష్మి మీడియాతో మాట్లాడకుండా వెళ్లిపోయారు.

**ఢిల్లీలో ఈడీ అధికారుల ఎదుట హాజరైన క్రికెటర్ సురేష్ రైనా:** ఇదిలావుండగా బెట్టింగ్ యాప్‌లకు సంబంధించిన కేసులో భారత క్రికెటర్ సురేష్ రైనా బుధవారం ఢిల్లీలోని ఈడీ కార్యాల యంలో విచారణ కు హాజరయ్యారు. ఉదయం పదిన్నర గంటలకు రైనా తన సిబ్బంది, న్యాయవాదులతో కలిసి ఈడీ కార్యాలయానికి రాగా అధికారులు మాత్రం ఆ యన ఒక్కరినే లోపలికి అనుమతించారు. రైనాను నాలుగు గంటల పాటు ఈడీ అధికారులు విచారించారు. బెట్టింగ్ యాప్‌లకు సంబంధించి రైనా ఏ ఏ కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్నదీ? వీటివల్ల రైనా కలిగిన ప్రయోజనాలను ఇంతకు ముందే సేకరించిన ఈడీ అధికారులు వీటి ఆధార ంగా ఆయనను ప్రశ్నించినట్లు సమాచారం. బెట్టింగ్ యాప్‌లను సెలబ్రటీగా వుండి ప్రమోట్ చేయడంవల్ల అనేక మంది కోట్లాది రూపాయలను న ష్ట పోయిన విషయాన్ని ఈడీఅధికారులు రైనా దృష్టికి తీసుకు వచ్చి భవిష్యత్తులో ఈ తరహా తప్పుడు పనులు చేయవద్దని హెచ్చరించినట్లు సమాచారం.

# చనిపోయిన ఓటర్లను ఇంటికి పిలిచి టీ తాగిన రాహుల్
### ఓటర్‌జాబితాలో మరణించారని తొలగింపు
### నిజానికి బతికే ఉన్న ఓటర్లు వీరంతా!



**న్యూఢిల్లీ, ఆగస్టు 13:** బీహార్‌లో ఓటర్ల జాబితాలో లోపాలపై లోక్‌సభ ప్రతిపక్షనేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. 'చనిపోయిన' ఓటర్లతో చాయ్ తాగానంటూ తాజాగా 'ఎక్స్' వేదికగా ఓ వీడియో పోస్ట్ చేశారు. ఈ ప్రత్యేకమైన అనుభవాన్ని అందించినందుకు ఎన్నికల సంఘానికి ధన్యవాదాలు అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. బతికి ఉన్నప్పటికీ, బీహార్ ముసాయిదా ఓటరు జాబితాలో 'మృతిచెందినట్లు'గా తేలిన పలువురు ఓటర్లను రాహుల్ గాంధీ దిల్లీలోని తన నివాసానికి పిలిపించి మాట్లాడారు. అనంతరం దీనికి సంబంధించిన వీడియోను పోస్ట్ చేశారు. జీవితంలో అనేక ఆసక్తికర అనుభవాలు ఉన్నప్పటికీ, 'చనిపోయిన' వారితో టీ తాగే ఛాన్స్ ఎప్పటికీ రాలేదు. ఈ ప్రత్యేక అనుభవం కల్పించిన ఎన్నికల సంఘానికి ధన్యవాదాలు" అని రాసుకొచ్చారు. బీహార్‌లో ఓట్లను చోరీ కానివ్వబోమని తెలిపారు. కాగా, బీహార్‌లో ఓటరు జాబితా నుంచి దాదాపు 65 లక్షల మంది ఓటర్లను తొలగించామని పేర్కొంటూ ఎన్నికల సంఘం ఇటీవల ముసాయిదాను విడుదల చేసింది. అయితే, ఈ ఓటర్ల జాబితాలో అక్రమాలు జరిగాయంటూ విపక్ష పార్టీలు ఆరోపిస్తున్నాయి. గుజరాత్ వ్యక్తులు బీహార్‌లో ఓటర్లుగా మారుతున్నారని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ విమర్శించారు. ఎన్నికల సంఘం(ఈసీ) చేపట్టిన ఈ కసరత్తుపై 'విశ్వాసం కోల్పోవడమే అసలు సమస్య అని, అంతకుమించి ఏమీ లేదని ధర్మాసనం అభిప్రాయపడింది. వాస్తవాలు, గణాంకాలతో సిద్ధంగా ఉండాలని ఎన్నికల సంఘానికి ఆదేశించింది. ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభానికి ముందు ఎంతమంది ఓటర్లు ఉన్నారు? గతంలో నమోదైన మరణాల సంఖ్య ఎంత? ఇప్పుడు నమోదు చేసిన మరణాల సంఖ్య ఎంత? వంటి వివరాలపై ప్రశ్నలు ఎదురయ్యే అవకాశం ఉందని తెలిపింది.

# సెర్ప్-మెప్మా విలీనంపై ఆసక్తి చూపని పురపాలకశాఖ
### కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నా పట్టించుకోని అధికారులు

**హైదరాబాద్,ఆగస్టు13 ప్రభాతవార్త:** సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావరీ (సెర్ప్), మిషన్ ఫర్‌ఎలిమినేషన్ ఆఫ్ పావరీ ఇన్ మున్సిపల్ ఏరియాస్ (మెప్మా) విలీన ప్రక్రియ ముందుకు సాగడం లేదు. రాష్ట్రక్యాబినెట్ నిర్ణయించినా స్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. అందుకే విలీన ప్రక్రియ త్వరగా ముందుకు సాగడంలేదనే చర్చ జరుగుతున్నది. పేదరిక నిర్మూలనే లక్ష్యంగా గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో సెర్ప్, పురపాలక శాఖ ఆధ్వర్యంలో పట్టణ ప్రాంతాల్లో మెప్మా పని చేస్తుంది. సెర్ప్ పరిధిలో 47లక్షలకు పైగా స్వయం సహాయక సంఘాలు ఉండగా, మెప్మాపరిఘధిలో1.80లక్షల సంఘాలు ఉన్నాయి. సెర్ప్‌పరిధిలోని సంఘాలు గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం, చిన్నతరహా పరిశ్రమలు, గృహ ఆధారిత ఉత్పత్తులపై ఫోకస్ పెట్టారు. మెప్మా పరిధిలోని సంఘాలు, పట్టణ ప్రాంతాల్లో స్వయం ఉపాధి, సేవా రంగం వాణిజ్య కార్యకలాపాలపై దృష్టి సారిస్తున్నారు. మెప్మా ఆధ్వర్యంలో అర్బన్‌సెల్ఫ్‌ఎంప్లాయ్‌మెంట్ ప్రోగ్రామ్ (యుఎస్ ఈపి), అర్బన్ ఉమెన్ సెల్ఫ్ హెల్ప్ ప్రోగ్రామ్(యుడబ్ల్యూఎస్సి) కార్యక్రమాలను అమలుచేస్తున్నారు. మెప్మా, సెర్ప్‌ద్వారా గ్రామీ ణ,పట్టణ ప్రాంతాల్లో వ్యక్తిగత రుణాలు అందిస్తున్నారు. ఈరెండు విభాగాలను విలీనంచేస్తే మ హిళాసాధికారత, స్వయం ఉపాధి, బ్యాంకు రుణాలు ఆర్థిక స్వాలంభన, ఇతర కార్యక్రమాల అమలువంటి లక్ష్యాలను సాధించడానికి సులభంగా ఉటుందని ప్రభుత్వంభావిస్తుంటే ఒక ఉన్నతాధికారి అడ్డుకుంటున్నారనే ప్రచారం జరుగుతోంది.

## నాటు కోళ్ల పెంపకానికి చర్యలు

**హైదరాబాద్, ఆగస్టు 13, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పెరటి కోళ్ల పెంపకంపై ప్రభుత్వం దృష్టిసారించింది. ఇటీవల కాలంలో పెరటి కోళ్ల (నాటు కోళ్లు) పెంపకం తగ్గిపోగా, మరోపక్క నాటు కోడి మాంసం, గుడ్లకు మంచి డిమాండ్ ఉన్నందున ఈ దిశగా నిర్ణయం తీసుకుంది. ఈ పెరటి కోళ్ల పెంపకం బాధ్యతలను మహిళలకు అప్పగించాలనే ఆలోచన చేస్తోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు వీటి పెంపకం సులభతరంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో మేలు రకం జాతికి చెందిన రాజశ్రీ, వనరాజా, శ్రీనిధి, గిరిరాజా, కడక్‌నాథ్, గ్రామప్రియ, కృషిబ్రో వంటి రకాలను మహిళలకు పంపిణీ చేయాలని సంకల్పించారు. ఈ నాటు కోళ్ల పెంపకం ద్వారా అదనపు ఆదాయం సమకూర్చేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా జిల్లాల వ్యాప్తంగా యూనిట్ల లక్ష్యాలను నిర్థారిస్తోంది.

## రాష్ట్రంలో అరుదైన ఖనిజ సంపద

**హైదరాబాద్, ఆగస్టు 13, ప్రభాతవార్త:** రాష్ట్రంలో అరుదైన ఖనిజ సంపద ఉన్నట్లు గనుల శాఖ గుర్తించింది. ప్రధానంగా సిరిసిల్ల, సిద్ధిపేట్ తదితర జిల్లాలో కొత్తగా వేస్తునన కొత్తపల్లి, మనోహరరాబాద్ రైలు మార్గం తవ్వకాల్లో అరుదైన ఖనిజ సంపద బయపడ్డాయి. సిరిసిల్ల, సిద్దిపేట్ జిల్లాలో ఖనిజ సంపద ఉననట్లు వెలుగు చూసింది. ఒక్క సిరిసిలన జిల్లాలో ఈ ఖనిజ సంపద 562.50 చదరపు కిలోమీటర్లలోను, సిద్దిపేట్ జిల్లాలో మరికొంత భాగం ఉన్నట్లు గనుల శాఖ అధికారులు నివేదిక రూపొందించారు. అందులో 15 రకాల లాంథనైడ్స్ ఉండా, స్కాండియం, వైట్రియం ఖనిజాలు ఉన్నట్లు గుర్తించారు. కిలో 312 వేల రూపాయలకు పైబా విలువ చేసే వైట్రియం ఈ ఖనిజాల్లో ప్రధానమైది కావడంతో మరింత లోతైన పరిశోధనలు చేసేందుకు గనుల శాఖ అధికారులు నిర్ణయించారు. సిద్దిపేట్ జిల్లా విఠలాపురం, సిరిసిల్లా జిల్లా తంగళ్లపల్లి మండలంలోని పెద్దలింగాపూర్, బస్వాపూర్, లక్ష్మీపూర్ గట్టల్లోనూ పరిశోధనలు చేస్తే మరింత అరుదైన ఖనిజ సంపద బయటపడే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా సర్వే చేపట్టేందుకు కేంద్రం అనుమతి కోరింది.

## పర్యాటకుల భద్రతకు టూరిస్ట్ పోలీసులు: డిజిపి

**హైదరాబాద్, ఆగస్టు 13, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పర్యాటకుల భద్రతకు ప్రత్యేకంగా టూరిస్ట్ పోలీసులను ఏర్పాటు చేస్తున్నట్లు డిజిపి జితేందర్ తెలిపారు. డిజిపి కార్యాలయంలో పోలీసు, పర్యాటక శాఖల మధ్య బుధవారం సమన్వయ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో డిజిపితో పాటు పర్యాటక శాఖ ప్రత్యేక కార్యదర్శి జయేష్ రంజన్, శాంతి భద్రతల అదనపు డిజి మహేష్ భగవత్, పర్యాటక శాఖ ఎండి విక్రాంతి, ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండి ప్రియాంక సహా ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిజిపి జితేందర్ మాట్లాడుతూ పర్యాటకుల భద్రతకు పర్యాటక శాఖకు త్వరలో 80 మంది పోలీసు సిబ్బందిని కేటాయిస్తామని తెలిపారు. సెప్టెంబర్ 27వ తేదీన జరగనున్న వరల్డ్ టూరిజం డే సందర్భంగా టూరిస్టు పోలీసు వ్యవస్థసిద్ధం చేయాలని భావిస్తున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలైన యాదగిరిగుట్ట, అనంతగిరి, పోచంపల్లి, నాగార్జున సాగర్, భద్రాచలం, బుద్ధవనం, అమ్రాబాద్ తదితర ప్రాంతాలలో టూరిస్ట్ పోలీసులు పనిచేస్తారని డిజిపి తెలిపారు. రాష్ట్రంలో పర్యాటక శాఖకు పోలీసులు అన్ని విధాల సహకరిస్తారని డిజిపి తెలిపారు. ఈ సమావేశంలో నగర అదనపు పోలీసు కమిషనర్ (శాంతి భద్రతలు) విక్రం సింగ్ మాన్,, మల్టీ జోన్ 2ఐజి చంద్రశేఖర్ రెడ్డి, డిఐజి తఫ్సీర్ ఇక్బాల్, సైబరాబాద్ జాయింట్ పోలీసు కమిషనర్ గజారావు భూపాల్, రాచకొండ డిసిపి ఇందిరా పాల్గొన్నారు.

## వెనక్కి తగ్గిన ఐసిఐసిఐ బ్యాంకు
### కనీస నిల్వలపరిమితిరూ.15వేలకు సవరణ

**ముంబయి, ఆగస్టు 13:** ప్రైవేటు బ్యాంకింగ్ దిగ్గజం కనీస నిల్వల పెంపుపై వెనక్కితగ్గింది. కస్టమర్లనుంచి తీవ్రనిరసన వ్యక్తం కావడంతో కనీస నిల్వల పరిమితులను సడలించింది. రూ.50 వేల కనీస నిల్వల పరిమితులు సవరిస్తున్నట్లు ప్రకటించింది. మెట్రో, అర్బన్ కస్టమర్లు రూ.15 వేలు నెలవారీ కనీస నిల్వ కలిగి ఉండాలని సెబీ అర్బన్‌ప్రాంతాల్లో అయితే రూ.7500, గ్రామీణ ఖాతాదారులకు మాత్రంఎ ప్పటిలాగే రూ.2500 సగటు కనీస నిల్వ ఉంచితే సరిపోతుందని వెల్లడించింది.

## 2800 కుక్కల్ని చంపించాం: జెడిఎస్ ఎమ్మెల్సీ భోజెగౌడ

**బెంగళూరు, ఆగస్టు 13:** దేశంలో వీధి కుక్కల సమస్య తీవ్ర రూపం దాల్చుతున్న వేళ, జనతాదళ్ సెక్యులర్ (జేడీఎస్) ఎమ్మెల్సీ ఎస్.ఎల్. భోజేగౌడ చేసిన వ్యాఖ్యలు పెను దుమారం రేపుతున్నాయి. పిల్లల భద్రత కోసం ఏకంగా 2,800 వీధి కుక్కలను చంపించామని, ఇందుకోసం జైలుకు వెళ్లేందుకైనా సిద్ధమని ఆయన శాసనసభలోసంచలన ప్రకటన చేసారు. చిక్‌మగళూరు స్థానిక సంస్థకు తాను అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ఇలా చేసామని భోజేగౌడ తెలిపారు. మాంసంలో ఓ పదార్థం కలిపి 2,800 కుక్కలకు తినిపించాం. అనంతరం వాటిని కొబ్బరి చెట్ల కింద పాతిపెట్టామని ఆయన వివరించారు. తమకు జంతువులపై ప్రేమ ఉన్నప్పటికీ, జంతు ప్రేమికులు మరో సమస్యగా మారారని, పిల్లలపై కుక్కల దాడుల వార్తలు చూసి చలించిపోతున్నామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

## సుప్రీంకోర్టు తీర్పు బిజెపీకి, ఇటు కాంగ్రెస్‌కు చెంపపెట్టు
### తీర్పు ఇచ్చిన సుప్రీం కోర్టుకు శిరస్సు వంచి సలాం: కేటీఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఆగస్టు12:** గవర్నర్ కోటా కింద కాంగ్రెస్ ప్రభుత్వం నియమించిన ఇద్దరు ఎమ్మెల్సీలు కోదండరాం, అమీర్ అలీ నియామకం చెల్లదని సుప్రీంకోర్టు ఇచ్చిన సంచలన తీర్పు అటు బీజేపీకి, ఇటు కాంగ్రెస్‌కు చెంపపెట్టు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.తారక రామారావు అన్నారు. ఈ రెండు ఢిల్లీ పార్టీలు రాజ్యాంగ వ్యవస్థలను దుర్వినియోగం చేస్తూ, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశాయని ఆయన మండిపడ్డారు. బడుగు, బలహీనవర్గాలైన దాసోజు శ్రవణ్, సత్యనారాయణలను ఎమ్మెల్సీలుగా నామినేట్ చేస్తూ చేసిన సిఫారసును పట్టించుకోకుండా ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని నాటి గవర్నర్ చులకనచేశారని కేటీఆర్ విమర్శించారు. కేంద్రంలో ఉన్న మోడీ ప్రభుత్వం గవర్నర్ వ్యవస్థను అడ్డం పెట్టుకుని కేసీఆర్ ప్రభుత్వాన్ని ఇబ్బందులు పెట్టిందని ఆరోపించారు. తమ ప్రభుత్వ ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉండగానే మరో ఇద్దరి పేర్లను సిఫారసు చేసి తన బీసీ వ్యతిరేక వైఖరిని రేవంత్ రెడ్డి చాటుకున్నాడని మండిపడ్డారు. అయితే బీజేపీ, కాంగ్రెస్‌ల చర్యలు రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు తీర్పుతో స్పష్టమైందన్నారు. దీంతో పాటే బీజేపీ, కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి మరోసారి బట్టబయలైందన్నారు. అధికారం కోసం ప్రజాస్వామ్య విలువలను, రాజ్యాంగ వ్యవస్థలను తుంగలో తొక్కిన ఈ పార్టీల అప్రజాస్వామిక విధానాలు ఎంతమాత్రం సాగనివ్వమని సుప్రీంకోర్టు తన తీర్పుతో చాటిచెప్పిందని ఆయన కొనియాడారు. రాజ్యాంగ వ్యవస్థల పరిరక్షణకు, ప్రజాస్వామ్య విలువల కోసం పోరాడిన బీఆర్ఎస్ పక్షాన గౌరవ న్యాయవ్యవస్థకు శిరస్సు వంచి సలాం చేస్తున్నామని కేటీఆర్ తెలిపారు.

## ఫార్మా, బల్క్ డ్రగ్ కంపెనీలు ప్రమాణాలు పాటించాలి
### సమీక్షా సమావేశంలోమంత్రి కొండా సురేఖ

**హైదరాబాద్,ఆగస్టు 13 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని పర్యావరణాన్ని పరిరక్షించే ప్రక్రియలో ఫార్మా, డ్రగ్ కంపెనీలు ప్రమాణాలు పాటించాలని తెలంగాణ అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. బుధవారం సచివాలయంలో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఫార్మా, బల్క్ డ్రగ్ పరిశ్రమల అనుమతుల విషయంలో అవకతవకలపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్ ముందు ఉన్న కేసులకు సంబంధించిన వివరాలను మంత్రికి పీసీబీ అధికారులు వివరించారు. సీపీసీబీ(సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు)కి అందిన ఫిర్యాదుల వివరాలు కూడా అడిగి తెలుసుకున్నారు. ఎంతటి వారైనా పర్యావరణ పరిరక్షణ ఉల్లంఘిస్తే ఊరుకునేది లేదని అధికారులకు స్పష్టం చేశారు. అవసరమైతే ప్రభుత్వం తరఫున టాస్క్ ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేస్తామన్నారు. అయితే, ప్రతి ఆరు నెలలకి ఒకసారి ఇన్‌స్పెక్షన్ చేస్తున్నట్టు మంత్రి సురేఖకి పీసీబీ మెంబర్ సెక్రటరీ జి.రవి వివరించారు. చౌటుప్పల్ ఏరియా నుంచి పర్యావరణ పరిరక్షణ, నీటి కలుషితం మీద విపరీతమైన ఫిర్యాదులువస్తున్నాయన్నారు. వాటిపై చాలా కఠినంగా ఉంటామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అటవీ, పర్యావరణ శాఖ ప్రిన్స్‌పల్ సెక్రటరీ అహ్మద్ నదీం, పీసీబీ మెంబర్ సెక్రటరీ రవి, సీఈ రఘు, శ్రీనివాసరెడ్డి, నాగేశ్వరరావు, వెంకన్న, రవిశంకర్, పోచంపల్లి, చౌటుప్పల్, చిట్యాల ప్రాంతాలకు చెందిన పరిశ్రల ప్రతినిధులు పాల్గొన్నారు.

# 'మేనిప్యులేటర్' ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల

**టాలీవుడ్ సినిమా** పరిశ్రమ కొత్తవారికి ఎప్పుడు స్వాగతం పలుకుతూ ఉంటుంది. 'ఏ స్టార్ ఈజ్ బార్న్' టైటిల్ మార్చి ఇప్పుడు 'మ్యానిప్యులేటర్'గా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. మేనిప్యులేటర్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను ప్రముఖ దర్శకులు బి.గోపాల్ ఆవిష్కరించారు. వీజే సాగర్ కథ, కథనం, మాటలు, దర్శకత్వం అందిస్తున్న ఈ సినిమాకు సి.రవి సాగర్ విజెసాగర్ నిర్మాణ సారథ్యంలో సిఆర్ ప్రొడక్షన్స్, విజె ఫిల్మ్ ఫ్యాక్టరీ నుంచి తెరకెక్కుతున్న ఈ సినిమా ద్వారా కల్యాణ్, ప్రియా పాల్, సోఫియా ఖాన్, ఊహ రెడ్డిలను తెలుగు తెరకు పరిచయం చేస్తున్నారు. క్యారెక్టర్ ఓరియంటెడ్ కాన్సెప్ట్‌తో పక్కా కల్ట్ కమర్షియల్ ఎంటర్టైన్మెంట్ సినిమాగా 'మేనిప్యులేటర్' రాబోతోంది. ఈ సందర్భంగా దర్శకుడు బి.గోపాల్ మాట్లాడుతూ...



'మేనిప్యులేటర్' టైటిల్ యువతకు కనెక్ట్ అయ్యేలా ఉందని అన్నారు, ఈ సినిమా విజయం సాధించి చిత్ర యూనిట్ సభ్యులందరికి మంచి పేరు రావాలని కోరుకుంటున్నాను, ప్రస్తుతం కంటెంట్ ఉన్న సినిమాల వైపే ప్రేక్షకులు మొగ్గు చూపిస్తున్నారు, ఈ మ్యానిప్యులేటర్ సినిమా కూడా అదే వరుసలో ఉంటుందని" అన్నారు. ప్రముఖ సంగీతదర్శకుడు సునీల్ కశ్యప్ సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమాలో మొత్తం 5 డిఫరెంట్ సాంగ్స్ ఉన్నాయి, తనికెళ్ళ శంకర్, వరికుప్పల యాదగిరి, విశ్వ నాథ్ ఈ సినిమా కోసం సాహిత్యం అందించారు. త్వరలో ఈ చిత్ర ఆడియో లాంచ్ కార్యక్రమం గ్రాండ్‌గా జరుపుకుని, విడుదలకి సిద్ధమవుతుంది. ఈ సినిమా కేవలం నేటి యువతను దృష్టిలో పెట్టుకొని చేసి తీశారు. ప్రస్తుతం ఉన్న యంగ్ స్టర్స్ లైఫ్ స్టైల్‌ను కళ్ళకు కట్టినట్లు దర్శకుడు విజే సాగర్ మ్యానిప్యులేటర్ సినిమాలో చూపించడం జరిగింది.

# 'త్రిబాణధారి బార్బరిక్' ట్రైలర్ విడుదల


**స్టార్ డైరెక్టర్** మారుతి సమర్పణలో వానర సెల్యూలాయిడ్ బ్యానర్ మీద విజయ్ పాల్ రెడ్డి అడిదెల నిర్మించిన చిత్రం 'త్రిబాణధారి బార్బరిక్'. ఈ మూవీకి మోహన్ శ్రీవత్స దర్శకత్వం వహించారు. పాన్ ఇండియన్ యాక్టర్ సత్య రాజ్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన ఈ చిత్రంలో వశిష్ట ఎన్ సింహా, సత్యం రాజేష్, ఉదయభాను, క్రాంతి కిరణ్, సాంచీ రాయ్ వంటి వారు ప్రధాన పాత్రల్ని పోషించారు. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన పాటలు, టీజర్ ఇలా అన్నీ అందరినీ ఆకట్టుకున్నాయి. ఆగస్ట్ 22న విడుదల కాబోతోన్న ఈ చిత్రానికి సంబంధించిన ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. 'చూడు బార్బరికా.. ఈ యుద్ధం నీది.. ధర్మ ధ్వజం రెపరెపలాడాలంటే అధర్మం చేసే వారికి



దండన లభించాలి.. 'అనగనగా అందమైన తోట.. ఆ తోటలో తోటమాలి అందంగా పెంచుకుంటున్న ఓ గులాబి మొక్క.. నేను చెప్పిన ఆ కథలో తోటమాలి సామాన్యుడు అనుకుంటే పొరపాటే'.. అంటూ ట్రైలర్‌ను కట్ చేసిన తీరు, లవ్ స్టోరీ, తాత మనవరాలి ట్రాక్ ఇలా అన్నీ పర్‌ఫెక్ట్‌గా చూపించారు.'పాలల్లో నీళ్లే కలుపుత.. విషం కలుప' అంటూ ఉదయభాను మీద పవర్ ఫుల్ సీన్లను చిత్రీకరించినట్టుగా కనిపిస్తోంది. మిస్సింగ్ కేసు, మర్డర్ కేసు చుట్టూ ఈ బార్బరిక్ కథ తిరుగుతున్నట్టుగా అనిపిస్తోంది. ఇక విజువల్స్, మ్యూజిక్, ఆర్ఆర్ ఇలా అన్నీ కూడా అద్భుతంగా ఉన్నాయని అర్థం అవుతోంది. ఈ చిత్రం టెక్నికల్‌గా హై స్టాండర్డ్స్‌లో ఉందని ట్రైలర్ చూస్తేనే తెలుస్తోంది. ఇక ఇందులో సత్య రాజ్‌ని చూస్తుంటే ఓ యోధుడిలా, ఓ సాధారణ వ్యక్తిలా కనిపిస్తున్నారు. ఇక మోహన్ శ్రీవత్స తన మేకింగ్‌తో అందరినీ ఆశ్చర్యపరిచారు. ఓ పురాణ కథకి, ప్రస్తుతం జరుగుతున్న సామాజిక సమస్యల్ని లింక్ చేస్తూ కథను అద్భుతంగా తెరకెక్కించినట్టుగా అనిపిస్తోంది. ఈ కథలో సత్య రాజ్, సత్యం రాజేష్, వశిష్ట సింహ, ఉదయ భాను, సాంచీ రాయ్ ఇలా అందరూ అద్భుతమైన పాత్రలను పోషించినట్టుగా కనిపిస్తోంది. ట్రైలర్‌తో ఒక్కసారిగా అంచనాలు పెంచేసింది చిత్రయూనిట్. ఈ మూవీని ఆగస్ట్ 22న గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతోన్నారు.

# 'భద్రకాళి' సెప్టెంబర్ 19న రిలీజ్

**తెలుగు ప్రేక్షకులను** అలరించిన 'మార్గన్' విజయం తర్వాత విజయ్ ఆంటోనీ మరో పవర్ ఫుల్ ప్రాజెక్ట్ 'భద్రకాళి'తో వస్తున్నారు. విజయ్ ఆంటోనీకి ల్యాండ్‌మార్క్ మూవీగా నిలిచే ఈ చిత్రానికి అరుణ్ ప్రభు దర్శకత్వం వహించగా, సర్వంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్‌పై రామాంజనేయులు జవ్వాజీ నిర్మించారు. ఈ ప్రాజెక్ట్‌ను విజయ్ ఆంటోనీ ఫిల్మ్ కార్పొరేషన్, మీరా విజయ్ ఆంటోనీ సమర్పిస్తున్నారు. రగ్గడ్ పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రం సెప్టెంబర్ 19న రిలీజ్ కానుందని మేకర్స్ అనౌన్స్ చేశారు. తెలుగులో మార్గన్ సినిమాను విజయం దిశగా నడిపించిన ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ సినిమాను కూడా తెలుగులో రిలీజ్ చేస్తుంది. రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా సపోర్ట్ కూడా ఉండడంతో ప్రాజెక్ట్‌పై మంచి బజ్ ఉంది. ఇప్పటికే విడుదలైన టీజర్‌కి చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ సినిమాలో వాగై చంద్రశేఖర్, సునీల్ కృష్ణపాని, సెల్ మురుగన్, తృప్తి రవీంద్ర, కిరణ్, రినీ బాట్, రియా జితు, మాస్టర్ కేశవ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. టాప్ టెక్నికల్ టీం ఈ సినిమాకి పని చేస్తున్నారు. షెల్లీ కాలిస్ట్ డీవోపీ, విజయ్ ఆంటోనీ స్వయంగా మ్యూజిక్ అందిస్తున్నారు. రేమండ్ డెరిక్ ఎడిటర్. రాజశేఖర్ ఫైట్ మాస్టర్. శ్రీరమన్ ఆర్ట్ డైరెక్టర్. తెలుగులో డైలాగ్స్‌ని రాజశేఖర్ రెడ్డి రాశారు.



నటీనటులు: విజయ్ ఆంటోని, వాగై చంద్రశేఖర్, సునీల్ కృపలానీ, సెల్ మురుగన్, తృప్తి రవీంద్ర, కిరణ్, రినీ బోట్, రియా జిత్తు, మాస్టర్ కేశవ్. సాంకేతిక సిబ్బంది: దర్శకత్వం: అరుణ్ ప్రభు, నిర్మాత: రామాంజనేయులు జవ్వాజి (సర్వంత్ రామ్ క్రియేషన్స్), సమర్పణ: విజయ్ ఆంటోని ఫిల్మ్ కార్పొరేషన్ మీరా విజయ్ ఆంటోని , తెలుగు రిలీజ్: ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్ స్పిరిట్ మీడియా, సంగీతం: విజయ్ ఆంటోని, ఎడిటర్: రేమండ్ డెరిక్, యాక్షన్: రాజశేఖర్, ఆర్ట్ డైరెక్టర్: శ్రీరామన్, తెలుగు రైటర్: రాజశేఖర్ రెడ్డి, డిజిటల్ మార్కెటింగ్ సౌత్ బే,పీఆర్వో: వంశీశేఖర్


# 'వార్ 2' సీక్రెట్స్ రివీల్ చేయకండి

## స్పాయిలర్‌లకు హృతిక్, ఎన్టీఆర్ రిక్వెస్ట్




**ఇండియన్ ఐకానిక్** స్టార్ లైన హృతిక్ రోషన్, ఎన్టీఆర్‌లతో యశ్ రాజ్ ఫిల్మ్స్ బ్యానర్ మీద ఆదిత్య చోప్రా నిర్మించిన చిత్రం 'వార్ 2'. అయాన్ ముఖర్జీ తెరకెక్కించిన ఈ 'వార్ 2' మూవీ ఆగస్ట్ 14న రిలీజ్ కాబోతోంది. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన టీజర్, ట్రైలర్‌లు 'వార్ 2' మీద అంచనాలు పెంచేసిన సంగతి తెలిసిందే. ఇక రిలీజ్ డేట్ దగ్గర పడుతుండటంతో అభిమానులకు స్పాయిలర్‌ల గురించి హీరోలు రిక్వెస్ట్ చేశారు.'వార్ 2' సినిమాను ఎంతో ప్రేమతో, ఎంతో కష్టపడి తెరకెక్కించాం. ఎంతో ప్యాషన్‌తో చేసిన ఈ మూవీ ఆడియెన్స్ ముందుకు రాబోతోంది. ఈ సినిమాటిక్ దృశ్యాన్ని ఎక్స్‌పీరియెన్స్ చేయడానికి అందరూ థియేటర్లలోనే సినిమాను చూడండి. దయచేసి సినిమాలోని సీక్రెట్లు, ట్విస్ట్‌లను రివీల్ చేయకండి.. స్పాయిలర్ లను ఆపండి.. ఇది మీడియా, ప్రేక్షకులు, అభిమా నులను మేం రిక్వెస్ట్ చేస్తున్నాము' అని అన్నారు. 'మీరు (అభిమానులు) 'వార్ 2'ని మొదటిసారి చూసినప్పుడు అనుభవించినంత ఆనందం, థ్రిల్, వినోదాన్ని మిగతా వారు కూడా అనుభవించాలి. స్పాయిలర్లు సీక్రెట్లు, ట్విస్టులు రివీల్ చేయడం వల్ల మిగతా వాళ్లకు ఆ అనుభూతి, అనుభవం ఉండదు. దయచేసి 'వార్ 2' కథను రహస్యంగా ఉంచండి' అని ఎన్టీఆర్ తెలిపారు. వార్ 2 నేడు (ఆగస్ట్ 14) ప్రపంచవ్యాప్తంగా హిందీ, తమిళం, తెలుగు భాషలలో విడుదల కానుంది.

# మలైకా అరోరా పరిచయం అవసరం లేదు



**పవన్ కల్యాణ్** గబ్బర్ సింగ్ లో కెవ్వు కేక సాంగ్ తో అలరించిన ఈ బ్యూటీ ఐటమ్ భామగా బాలీవుడ్ లోను ఫేమస్. ముఖ్యంగా సల్మాన్ సోదరుడు ఆర్బాజ్‌ఖాన్ నుంచి విడిపోయాక యువహీరో అర్జున్ కపూర్‌తో ప్రేమాయణం సాగించిన మలైకా నిరంతరం వార్తల్లో నిలిచింది. ప్రస్తుతం అర్జున్ నుంచి బ్రేకప్ అయిన మలైకా ఒంటరిగా ఉంది. ఇటీవల పూర్తిగా తన కెరీర్ పైనే ఫోకస్ చేసింది. కొద్దిరోజుల క్రితం కుమారుడు అర్హాన్ ఖాన్ తో కలిసి విదేశీ విహార యాత్ర నుంచి ఫోటోలు, వీడియోలను షేర్ చేసింది మలైకా. ఈ యాత్రలోను మలైకా ఎక్కడా తగ్గలేదు. వరుసగా బికినీ ఫోటోలను షేర్ చేసి ఆశ్చర్యపరిచింది. మలైకా బీచ్ షికార్లు ఎల్లప్పుడూ చర్చగా మారుతున్నాయి. తాజాగా ముంబైలో గౌరవ్ గుప్తా బ్రైడల్ కాంటూర్ కలెక్షన్ లాంచ్ ఈవెంట్‌లో మలైకా అరోరా గుబులు రేపే రూపంతో కవ్వించింది. ఏజ్ లెస్ బ్యూటీకి 50 వయసు అంటే నమ్మశక్యం కాదు. వైట్ హాఫ్ షోల్డర్ కటౌట్ గౌన్ లో మలైకా దివ్యమైన రూపం యువహృదయాలను కదిలించింది. ముఖ్యంగా మలైకా టోన్డ్ దేహశిరులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వేదిక ఏదైనా కచ్చితంగా మలైకా ఆ వేదికకు కేంద్రక ఆకర్షణగా మారుతోంది. ఇప్పుడు కూడా తన దివ్యమైన రూపంతో మతులు చెడగొట్టింది.




# ప్రభాస్ పెద్దమ్మకు నిధి అగర్వాల్ థ్యాంక్స్



**పాన్ ఇండియా స్టార్** ప్రభాస్ ప్రస్తుతం 'ది రాజా సాబ్' చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సిద్ధమవుతున్నాడు. దర్శకుడు మారుతి డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమాను హారర్ కామెడీగా రూపొందిస్తున్నారు. ఇక ఈ సినిమాలో అందాల భామలు నిధి అగర్వాల్, మాళవికా మోహనన్, రిద్ధి కుమార్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. అయితే, తాజాగా నిధి అగర్వాల్ తన సోషల్ మీడియా అకౌంట్‌లో ఓ వీడియో షేర్ చేసి ప్రభాస్ పెద్దమ్మ శ్యామలా దేవికి ధన్యవాదాలు తెలిపింది. ఇంతకీ అసలు విషయం ఏమిటంటే.. ప్రభాస్ తన తోటి నటీనటులకు ఎప్పుడూ భోజనం పంపించడం మనకు తెలిసిందే. అయితే, తాజాగా నిధి అగర్వాల్‌కు ప్రభాస్ పెద్దమ్మ శ్యామలా దేవి భోజనం పంపించారు. దీంతో అవాక్కయిన నిధి అగర్వాల్, ఇంతటి చక్కటి భోజనం పంపిన శ్యామలా గారికి ధన్యవాదాలు తెలుపుతూ ఓ వీడియో షేర్ చేసింది. ఆమెతో పాటు ప్రభాస్, వంశీ లకు కూడా నిధి థ్యాంక్స్ చెప్పుకొచ్చింది.

# మేం పడిన కష్టానికి తగిన ప్రతిఫలం వచ్చింది

## 'మోతెవరి లవ్ స్టోరీ' బ్లాక్ బస్టర్ సక్సెస్ మీట్‌లో హీరో అనిల్ గీలా

**భారత దేశపు** అతిపెద్ద ఓటీటీ ఫ్లాట్ ఫాం అయిన జీ5 తెలుగు గ్రామీణ తెలంగాణ ప్రాంతంలోని మూలాల్ని ప్రతిబింబించేలా 'మోతెవరి లవ్ స్టోరీ'ని ఆడియెన్స్ ముందుకు తీసుకు వచ్చింది. అనిల్ గీలా, వర్షిణి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సిరీస్ ఆగస్టు 8న ప్రీమియర్ అయి సంచలనాత్మక స్పందనను దక్కించుకుంది. శివ కృష్ణ బుర్రా రచన, దర్శకత్వం వహించిన ఈ సిరీస్‌లో మురళీధర్, సదన్న, విజయ లక్ష్మి, సుజాత ఇతరులు కీలక పాత్రల్లో నటించారు. మధుర ఎంటర్‌టైన్‌మెంట్, మై విలేజ్ షో బ్యానర్‌లపై మధుర శ్రీధర్, శ్రీరామ్ శ్రీకాంత్ 'మోతేవారి లవ్ స్టోరీ'ని నిర్మించిన సిరీస్ ప్రస్తుతం సక్సెస్ ఫుల్‌గా దూసుకుపోతోంది. ఈ క్రమంలో మంగళవారం బ్లాక్ బస్టర్ సక్సెస్ మీట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో....అనిల్ గీలా మాట్లాడుతూ.. .. 'మోతెవరి లవ్ స్టోరీ'ని సపోర్ట్ చేస్తున్న ఆడియెన్స్ అందరికీ థాంక్స్. ఈ సిరీస్ చూస్తే మన ఇంట్లో జరిగే కథలానే అనిపిస్తుంది. మాకు ఈ ప్రయాణంలో సపోర్ట్ చేసిన జీ5 టీంకు థాంక్స్. వీలైనంతగా మా సిరీస్‌ను అందరూ సపోర్ట్ చేయండి. మేం ఎంతో కష్టపడి ఇక్కడి వరకు వచ్చాం. ఎన్నో నిద్రలేని రాత్రులు కూడా గడిపాం. మేం పడిన కష్టానికి తగిన ప్రతిఫలం వచ్చింది. మేం ఇలానే కష్టపడుతూనే ఉంటాం. ఇలానే ఆడియెన్స్ మా అందరినీ సపోర్ట్ చేయండి. మా సిరీస్ గురించి స్టాలిన్ చిత్రంలో చెప్పినట్టుగా ఓ ముగ్గురికి చెబుతూ వెళ్లండి. ఇండియాలోనే జీ5లో టాప్‌లో ట్రెండ్ అవుతోంది. జీ5ని సబ్ స్క్రైబ్ చేసుకోండి. మా సిరీస్‌ను చూడండి' అని అన్నారు. జీ5 తెలుగు వైస్ ప్రెసిడెంట్, కంటెంట్ హెడ్ దేశ్ రాజ్ సాయి తేజ్ మాట్లాడుతూ.. .. అనిల్ యూట్యూబ్ నుంచి ఒటిటి వచ్చాడు.. ఇక ఒటిటి నుంచి సిల్వర్ స్క్రీన్‌కు వెళ్లాలి. తెలంగాణ నుంచి ఇంకా అనేక మంది కళాకారులు బయటకు రావాలి. గంగాధర్ లిరిక్స్, శ్రీకాంత్ విజువల్స్ అద్భుతంగా ఉన్నాయి. మా డైరెక్టర్ శివ ఈ సిరీస్ కోసం చాలా కష్టపడ్డారు. అనిల్, వర్షిణి ఇలా అందరూ అద్భుతంగా నటించారు. పైరసీలో సిరీస్‌లను చూడకండి. సబ్ స్క్రైబ్ చేసుకుని చూడండి. ప్రతీ నెలా మంచి సిరీస్‌లతో ఆడియెన్స్ ముందుకు రానుంది' అని అన్నారు. నిర్మాత శ్రీరామ్ శ్రీకాంత్ మాట్లాడుతూ.. .. 'మోతెవరి లవ్ స్టోరీ' కోసం పని చేసిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. అందరూ చాలా కష్టపడ్డారు. ఇది మన తెలంగాణ కథ అయినా అందరూ చూసేలా తెరకెక్కించాం. ఇక ముందు మా నుంచి ప్రపంచ స్థాయి కంటెంట్ వస్తుంది' అని అన్నారు. దర్శకుడు శివ కృష్ణ బుర్రా మాట్లాడుతూ.. .. 'మోతెవరి లవ్ స్టోరీ' మా నాన్నకి అంకితం చేస్తున్నాను. మావి గల్ఫ్ బతుకులు.. గల్ఫ్ మెతుకులు. ఇందులోని ఫ్లాష్ బ్యాక్‌లో క్యాసెట్ సీన్‌ను నా జీవితంలో చూశాను. శ్రీకాంత్ అద్భుతమైన విజువల్స్ ఇచ్చారు. ఆయన సపోర్ట్ లేకపోయి



ఉంటే ఈ సిరీస్ ఇంత గొప్పగా వచ్చేది కాదు. అనిల్ ఈ ప్రాజెక్ట్ కోసంచాలా కష్టపడ్డాడు. త్వరలో మరింత పెద్ద హీరో అవుతాడు. వర్షిణి, మాన్సీ అందరూ అద్భుతంగా నటించారు. ఆడియెన్స్ చూపిస్తున్న ప్రేమకు నేను ఎప్పుడూ దాసోహమ'ని అన్నారు. హీరోయిన్ వర్షిణి మాట్లాడుతూ.. .. 'మోతెవరి లవ్ స్టోరీ'లో నాకు అవకాశం ఇచ్చిన శివగారికి, మధుర శ్రీధర్ గారికి, జీ5 టీంకు థాంక్స్. అనిల్‌తో కలిసి నటించడం ఆనందంగా ఉంది అన్నారు. కెమెరామెన్ శ్రీకాంత్ అరుపుల మాట్లాడుతూ.. 'మోతెవరి లవ్ స్టోరీ' కోసం టీం అంతా కలిసి కష్టపడ్డాం. ఎక్కడా కూడా మేం కాంప్రమైజ్ కాలేదు. ప్రతీ లోకేషన్‌ను అందంగానే చూపించానని అనుకుంటున్నాను. ఈ ప్రయాణంలో నాకు తోడుగా నిలిచిన అనిల్, శివలకు థాంక్స్' అని అన్నారు. కొరియోగ్రాఫర్ ప్రశాంత్ మాట్లాడుతూ.. 'మోతెవరి లవ్ స్టోరీ'లో అనిల్ అన్న అద్భుతంగా నటించాడు. ఏలదరియా పాటకు మంచి రెస్పాన్స్ వచ్చింది. తెరపై చూస్తుంటే కన్నీళ్లు వచ్చాయి. నాకు ఇంత మంచి అవకాశం ఇచ్చిన టీంకు థాంక్' అని అన్నారు. నటి మాన్సీ మాట్లాడుతూ.. .. 'మోతెవరి లవ్ స్టోరీ' విషయంలో మాకు ప్రకృతి ఎంతో సహకరించింది. ఈ సిరీస్‌కు పని చేసిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. అందరి కష్టం వల్లే ఈ సిరీస్ ఇంత అద్భుతంగా వచ్చింది. వర్షిణి, అనిల్ అందరూ బాగా నటించారు' అని అన్నారు.

# మహిళా వెల్డర్లు..



రాజీ చెన్నమ్మ మహిళా బృందం... పేరుకి తగినట్లు అందరూ యోధులే. కాకపోతే చెన్నమ్మ దేశ స్వతంత్రం కోసం ఆంగ్లేయులతో యుద్ధం చేస్తే... వీళ్ల సంప్రదాయ పని విధానాలు, ఆలోచనలతో పోరాడారు. గాజు తెరల్ని బద్దలుకొట్టి వెల్డింగ్ వృత్తిలో రాణిస్తున్నారు. వీళ్ల గురించి తెలుసుకుదాం..

34 ఏళ్ల సచితది ఉడిపికి సమీపంలోని ఊచిల గ్రామం. బి.కామ్ చదువుకుంది. మంచి ఉద్యోగం చేయాలన్నది ఆమె కల. కానీ స్థానికంగా ఏ అవకాశాలు రాక... ప్రింటింగ్ ప్రెస్‌లో పనిచేసేది. "2024లో ప్రాజ్, జెన్ ఎక్స్ కంపెనీ మహిళా వెల్డర్లు కావాలని ఓ ప్రకటన చేసింది. తెలియని రంగమే... కానీ మంచి జీతం, కొత్త పని నేర్చుకునే అవకాశం ఉంటుందన్న ఆశతో ఇంటర్వ్యూకి వెళ్లాను. ఎంపిక చేసుకున్నారు. మొదట్లో చాలా భయపడ్డాను. తోటి వాళ్లను చూశాక, నాకు ధైర్యం వచ్చింది అంటారు సుచిత. అనిషాది కూడా అక్కడికి దగ్గర్లో ఉన్న పడుబిద్రి. డిగ్రీ పూర్తిచేసి, ఫొటోగ్రాఫర్‌గా స్థిరపడింది. నాకు, వెళ్లాలా వద్దా అని ఆలోచించా. వెనకడుగు వేయడం ఇష్టం లేక చేరాను అంటారీమె. కటింగ్ అండ్ డ్రిల్లింగ్ విభాగంలో పనిచేస్తోంది అనిషా. ప్రజు బెంగళూరులోని సివిల్ ఇంజినీరింగ్‌లో డిప్లొమా పూర్తి చేసింది. కానీ తను ఎంపిక చేసుకున్న రంగంలో సరైన అవకాశాలు లేక చిన్నచిన్న వెల్డింగ్ పనులు చేస్తుండేది. చదువు పూర్తయ్యాక ఈ రంగంలో పనికోసం చాలా ప్రయత్నాలు చేశాను. అమ్మాయిని ఇక్కడ నువ్వేం చేస్తావు అన్నవాళ్లే ఎక్కువ. కానీ ప్రాజ్ మాలో ప్రతిభను చూసింది. దాన్ని నిరూపించుకునే అవకాశం వచ్చింది. దీనిలో రాణించి ఉన్నత పదవుల్ని చేరుకోవాలనేదే నా ఆశ అంటారీమె. వీళ్లే కాదు, ఈ బృందంలో 50 మంది మహిళలు ఉన్నారు. తరచి చూస్తే ఒక్కొక్కరిదీ ఒక్కో కథ. అందరూ జీవితంలో ఏదైనా సాధించాలి అన్నఆశతో ఉన్నవారే. వీరందరూ శిక్షణ పూర్తిచేసుకుని క్షేత్రస్థాయిలో పనిచేయబోతున్నారు. కొందరు ఇప్పటికే విధుల్లో చేరిపోయారు కూడా. కేటాయించిన విభాగాల్లో తమదైన ముద్ర వేసి విదేశాల్లో పనిచేయాలన్నదే తమ కోరిక అంటున్నారు. అందరికీ ఆల్‌ద బెస్ట్ చెప్పేద్దామా మరి.

## తెలుసు కుందాం..

ఆడ శిశువులతో పోలిస్తే మగ శిశువులు ఒత్తిడిని ఎక్కువగా తట్టుకోలేరట. ముఖ్యంగా ప్రినేటల్, ప్రసానంతర కాలాల్లో ఒత్తిడి



నియంత్రణకు సంబంధించి మెదడు అభివృద్ధి నెమ్మదిగా ఉండటమేదీనికి కారణమని పరిశోధనలు చెబుతున్నాయి.

# గుర్రపు డెక్కతో బయోడిగ్రేడబుల్ పేపర్

**చెరువులు, కాలువల నిండా అల్లుకువే కలుపు మొక్క ఈ గుర్రపు డెక్క(వాటర్ హయాసింత్). అది వ్యవసాయానికి చేసే నష్టం గురించి తెలియని వారుండరు. దానితోనే బయోడిగ్రేడబుల్ పేపర్‌ని తయారుచేస్తున్నారు సుస్మితా కృష్ణన్.**



సుస్మితది తమిళనాడులోని తిరుచ్చి. చిన్నప్పట్నుంచి పర్యావరణంపై ఆసక్తి ఎక్కువ. దాంతో లైఫ్ సైన్సెస్‌లో ఇంటిగ్రేటెడ్ మాస్టర్స్ చదవాలనుకున్నారు. భారతీదాసన్ విశ్వవిద్యాలయంలో చేరా. ఇది విద్యార్థుల అవకాశాలకు నెలవు. పరిశోధనలు ఎక్కువ జరుగుతుంటాయి. కాలేజీలో ఇంటర్న్‌షిప్ భాగంగా చాలా సెమినార్లకు వెళ్లేదాన్ని. అక్కడికి వచ్చిన పర్యావరణ శాస్త్రవేత్తలు చెప్పిన ఒక విషయం నన్ను ఆలోచించేలా చేసింది. అదే గుర్రపు డెక్క నీటిపై కనుచూపుమేర ఆకుపచ్చ తివాచీ పరచుకున్నట్లు, దానిపై ఊదా రంగు పువ్వులతో చూడ్డానికి అందంగా కనిపిస్తుంది. కానీ అది నీటిలోని జలచరాలకు ఆక్సిజన్ అందకుండా చేస్తుంది. ఈ మొక్క దాని జీవితకాలంలో దాదాపు 3వేల విత్తనాలను ఉత్పత్తి చేయగలదు. అంతేకాదు, 20సంవత్సరాల తర్వాత కూడా తిరిగి మొలకెత్తే సామర్థం దీని సోతం. అందుకే దాని కాండంతో బయోడిగ్రేడబుల్ పేపర్ తయారుచేయాలనుకున్నా. సరిగ్గా అప్పుడే జర్మనీలో హాంబర్గ్ విశ్వవిద్యాలయంలో ఇంటర్నేషనల్ సస్టైనబిలిటీ అకాడమీ(ఐఎస్‌ఏ) ఫెలోషిప్‌నకు ఎంపికయ్యాను. అక్కడ గుర్రపు డెక్కను కాగితంగా మార్చే ప్రయోగాలు చేశా. సాధారణంగా కలప నుంచి పేపరు తయారు చేయాలంటే దాదాపు 60 శాతం అవసరం. కానీ గుర్రపు డెక్కతో పేపర్ తయారు చేయడానికి 6 శాతం చాలు. పైగా ఈ పేపర్ నాణ్యత కూడా ఎక్కువే సాంకేతికతను ఉపయోగించి దీన్ని తయారుచేసుకుంటే దీన్ని వృథా చేయన్కర్లేదు అంటారు సుస్మిత.

**అడుగడుగునా అడ్డంకులే...**

ఆమె కనిపెట్టిన టెక్నాలజీని సొంతదేశంలో అమలు చేయాలనుకున్నారు. చాలా పరిశ్రమల చుట్టూతిరిగా కొత్తది పైగా పెట్టుబడి, ట్రయల్ రన్‌లు, నియంత్రణ ఆమోదాలు ఇవన్నీ రిస్క్‌తో కూడుకున్నవి మాకు వద్దు అంటూ చాలామంది నిరాకరించారు. అందుకే దీని తయారీ విధానాన్ని విద్యార్థులకు, మహిళలకి నేర్పించా. తిరుచ్చిలో నేషనల్ కాలేజీలో రెండురోజులువర్క్‌షాప్ నిర్వహించాను. తయారీలో ముందుగా




మొక్కను చిన్న ముక్కలుగా కోసి ఎండబెట్టాలి. తర్వాత పీచుని వేరుచేయడానికి ఆల్కలీన్ ద్రావణంలో ఉడకబెట్టాలి. మెత్తని గుజ్జు తయారవుతుంది. ఈ మిశ్రమాన్ని మెష్ ఫ్రేముల్లో వేసి ఎండలో అరబెట్టాలి. కిలో గుర్రపు డెక్కతో సుమారు 30 ఏ4 షీట్లు తయారు చేసుకోవచ్చు. ఈ మొత్తం ప్రాసెస్‌కి సుమారు గంట సమయం పడుతుంది అంటారీమె. సుస్మిత ప్రయోగం అక్కడితో ఆగిపోలేదు...తన లక్ష్యం అవగాహన పెంచడం ఒక్కటే కాదు, ఎక్కువమంది దీన్ని నేర్చుకుని, గుర్రపుడెక్క ఎక్కువ పెరిగే ప్రాంతాలు దీన్ని ఆదాయంగామార్చుకోవాలంటున్నారు. మహిళల కోసం నేపాల్‌లోని ఓ ఎన్జీఓతో కలిసి బయోడిగ్రేడబుల్ శానిటరీ ప్యాడ్స్‌నీ తయారు చేస్తున్నారు.

# ఎమరాల్డ్ ఆభరణాలు ఎంతందమో!













ఆభరణాలంటే ఇష్టపడని అమ్మాయిలుంటారంటే అతిశయోక్తేనేమో! అందుకే, రోజుకో జ్యూయెలరీ ఫ్యాషన్ వారిని మెప్పించడానికి మార్కెట్లోకి వచ్చేస్తుంది. అయితే, ఈతరం మాత్రం ఎన్ని వెరైటీలొచ్చినా... ఇటు సంప్రదాయంగానూ, అటు ఫ్యూజన్ జ్యుయెలరీగానూ మెప్పించే రాక తమ ఓటు అంటోంది. నవరత్నాల్లో ఒకటిగా, రాచరికానికి గుర్తుగా నిలిచే దీని ప్రత్యేకత గురించి.. ఎంత చెప్పుకొన్నా తక్కువ వేల ఏళ్ల నుంచి విలువైన రత్నాలుగా పేరెన్నికగన్న ఒక్కసారి పాలకులు, ధనవంతులు మాత్రమే ధరించేవారట. అదృష్టం, ప్రేమ, సంపదలకు చిహ్నంగా భావించే ఎమరాల్డ్స్ మీకు అందాన్ని తెచ్చిపెడతాయని ఈతరం అమ్మాయిలు నమ్ముతున్నారట. అందుకే, వీటిల్లో ఎన్నెన్నో రకాలొచ్చేశాయి. అలాగని పుత్తడితో జతకట్టో, ముత్యాల సరసనో, పసిడి చెక్కుళ్లలోనో కలిసిపోయో కనీ కనిపించనట్లు లేదు... పెద్దగానే ఆకట్టుకుంటున్నాయి. స్టేట్మెంట్ పీసుగా సందడి చేస్తున్నారు. హారాలు, గొలుసు నెక్లెస్‌లు... ఏ రకమైనా సరే, చివరన నీటి బిందువుల్లా వేలాడుతూ మురిపిస్తున్నాయి. భలేగున్నాయి కదూ!







# సోంపూ షర్బత్ పౌడర్

నిమ్మకాయ షర్బత్ తరచూ తాగుతాం కదా! ఎప్పుడూ అదేనా అనిపించ కుండా కొత్తగా, నాలుక్కి హితవుగా ఉండాలంటే సోంపూ షర్బత్ ప్రయత్నించండి దీన్ని అప్పటికప్పుడు చేయాల్సిన పని లేకుండా ప్రీమిక్స్ పౌడర్ చేసుకోవచ్చు. ఈ షర్బత్ పౌడర్ కోసం... సోంపు 100 గ్రాములు, పంచదార 400గ్రా, మిరియాల పొడిఅర చెంచా, యాలకులు 20, గసగసాలు 2 చెంచాలు ఎలా తీసుకోవాలి. సోంపు, యాలకులను వేయించాలి. అవి చల్లారాక మిక్సీ జార్లో వేసి.. పంచదార, గసగసాలు,



మిరియాలపొడి జోడించి మెత్తగా గ్రైండ్ చేయాలి. ఈ ఇన్స్టెంట్ పౌడర్ తడి లేని, గాలి చొరబడని సీసాలో భద్రం చేసుకోవాలి. తాగదలచుకున్నప్పుడు గ్లాసు చల్లటి నీళ్లలో రెండు చెంచాల షర్బత్ పౌడర్ కలిపితే సరిపోతుంది. పాలు ఇష్టపడేవారు వేడిపాలలో కలిపి తాగొచ్చు. ఇది రుచి కాదు.. ఆరోగ్యం కూడా.

## చెలి చిట్కా

- వాష్ బేసిన్ రంధ్రాల్లో వాసనరాకుండా ఉండటానికి బేకింగ్ సెడావేసి వేడినీరు పోయండి.
- ఎండు కొబ్బరి ని సులభంగా తురమా లంటే దానిపై కొద్దిగా నీళ్లు చల్లి ఫ్రిజ్‌లో ఉంచాలి.
- ఉల్లి పాయలు తరిగేందుకు అరగంట ముందు వాటిని పాలధిన్ కవర్లోవేసి ఫ్రిజ్‌లో పెడితే తరిగే టప్పుడు కళ్లుమండవు

# వ్యథ: జాగ్రత్తతో సంతానయోగం

**ప్రశ్న:** మా అబ్బాయికి పెళ్లయి 10 ఏళ్లు కావస్తోంది. చాల ఆరోగ్యంగా ఉంటాడు. అయితే మా కోడలిలో చిన్న లోపం వల్ల పిల్లలు కలగలేదు. ఆమెకు థైరాయిడ్ సమస్య ఉంది. అండం బలహీనంగా ఉండటం వల్ల సంతానం కలుగలేదని డాక్టర్లు గుర్తించారు. మూడు సార్లు ఐవిఎఫ్ చికిత్స చేసినా ప్రయోజనం లేకపోతున్నది. మా అబ్బాయి వయస్సు 35, కోడలి వయస్సు 30 ఏళ్లు. ఇద్దరు బిటెక్ చదివారు. ఇద్దరు ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. ఇద్దరు అన్యోన్యంగా ఉంటారు. అయినా పిల్లలు పుట్టక పోవడానికి జాతకదోషం కారణమని ఒక జ్యోతిష్యుడు చెప్పారు. దీనికోసం ఉపవాస దీక్షలు, పూజలు, పునస్కారాలు సూచించారు. తీర్థయాత్రలు చేస్తే మంచిదని కొందరు పెద్దలు చెప్పారు. ఏడాది నుంచి రకరకాల పూజలు వ్రతాలు చేసున్నాది. అయినా ఫలితంలేక పోతున్నది. మాకు ఒకే అబ్బాయి కావడం వల్ల మానసికంగా చాలా ఆందోళనకు గురవుతున్నాము. మా కోడలు చాల మంచిది. పిల్లల కోసం మరోపెళ్లి చేసుకోమని మా అబ్బాయికి చెప్పింది. అయితే అతను సమ్మతించలేదు. కొన్ని సందర్భాలలో మానసిక లోపాల వల్ల కూడ పిల్లల పుట్టకపోవచ్చునని నా స్నేహితురాలు ఒకామె చెప్పారు. మంచి సైకాలజిస్టు ద్వారా కౌన్సెలింగ్ చేయించమని సలహాఇచ్చారు. అలాగే కొన్ని రకాల యోగాసనాలు సాధన చేయడం వల్ల మంచి ఫలితం ఉంటుందని కొందరు చెప్పారు. ధ్యానం చేయడం కూడ మంచిది అంటున్నారు. ఇప్పటికే డాక్టర్లు చుట్టూ తిరిగి పూజలు, వ్రతాలు, ఉపవాసాలు చేసి విసిగిపోయి ఉన్నాము. ఇప్పుడు కౌన్సెలింగ్, యోగ ధ్యానం చేయడం వల్ల ప్రయోజనం ఉంటుందన్న నమ్మకం కలగడంలేదు. ఈ పరిస్థితుల్లో మాకు తగిన సలహా ఇవ్వవలసిందిగా కోరుతున్నాను.

**- ఒక సోదరి, రాజమండ్రి.**



**ఎన్.బి.సుధాకర్‌రెడ్డి**
**సైకాలజిస్టు**

**జవాబు:** అమ్మా మీ ఆవేదన అర్థం చేసుకున్నాను. నిజానికి సంతాన సాఫల్యత, సమస్యలు, చికిత్స లాంటి అంశాలను గూర్చి చెప్పే అర్హత నాకు లేదు. ఈ విషయాలు వైద్య నిపుణుల ద్వారా తెలుసుకోవాలి. అయితే మీరు చేస్తున్న ప్రయత్నాలు, మీ కోడలి పరిస్థితిని గమనించి సాధారణ పరిజ్ఞానంతో మీకు సలహా ఇచ్చే ప్రయత్నం చేస్తున్నాను. సహజంగా శారీక దృఢత్వం, మానసిక పటిష్టత, హార్మోన్ల సమతుల్యత, దంపతుల కలయిక సంతాన సాఫల్యతలో కీలకంగా పని చేస్తాయి. అన్ని బాగున్నప్పటికి సిగ్గు, బిడియం, భయం, ఆందోళన, ఫ్రిజిడిటి, సామర్థ్య లోపం ఉన్న వారికి మానసిక నిపుణుల కౌన్సెలింగ్ వల్ల ప్రయోజనం ఉంటుంది. అంటే వీరిలో వున్న లోపాలను సరిదిద్ది శారీరక కలయిక సాఫీగా సాగేలా చేయడం అన్న మాట. అయితే మీ కోడలిలో అండం బలహీనంగా ఉందని తెలిపారు. ఆమెలో థైరాయిడ్ సమస్య కూడ ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఉపవాసాలు వ్రతాల వల్ల లాభం కంటే నష్టం ఎక్కువ జరుగుతుందని గమనించండి. ఉపవాసాల వల్ల నీరసం, నిస్సత్తువ ఆవహించి గర్భసంచి మరింత బలహీనం అయ్యే అవకాశం ఉంది. ఉపవాసాలు చేస్తూ యోగాసనాలు చేయడం వల్ల కూడ మంచి ఫలితాలు ఉండవు.



కాబట్టి తక్షణం వైద్య నిపుణుల సలహాలు తీసుకోండి. థైరాయిడ్ సమస్యను నియంత్రణలో పెట్టండి. ఉపవాసాలు మాని పోషహారం అంటే సమతుల్య ఆహారం తీసుకునేలా జాగ్రత్తపడండి. వ్యాయమాలు, యోగాసనాల సాధన ద్వారా శారీరక దృఢత్వం పెంచుకునేలా చేయండి. పొట్ట, పొత్తికడుపు బలోపేతానికి ఉపయోగపడే వ్యాయామాలు యోగాసనాల ద్వారా గర్భసంచి పటిష్టం అయ్యేఅవకాశాలు ఉన్నాయి. ధ్యానం ద్వారా ఒత్తిడి తగ్గి మనసు కుదుట పడుతుంది. నిపుణుల సలహాల పాటిస్తే సంతాన యోగం సిద్ధిస్తుందని గుర్తించండి.

# వెచ్చదనం కోసం


రాత్రుళ్లు చలి కాస్త ఎక్కువగానే ఉంటోంది కదూ! ఎన్ని దుప్పట్లు కప్పుకొన్నా సరిపోనట్లే అనిపిస్తుంటుంది. అందుకే వెచ్చదనం కోసం బొగ్గుల కుంపటిని గదిలో ఉంచుకోవడమో.... రూమ్ హీటర్ వాడటమో చేస్తుంటారు. రాత్రంతా అలాగే ఉంచేస్తున్నారా? ప్రమాదం!మంచం కిందో... గదిలో ఓ మూలనో బొగ్గుల కుంపటిని ఉంచడం చాలామంది చేసేదే! తలుపులు మూసి ఉన్న గదిలో అలా ఉంచడం ప్రమాదం. బొగ్గులు మండినప్పుడు వాటి నుంచి కార్బన్ మోనాక్సైడ్ విడుదల అవుతుంది. ఈ విషవాయువు రక్తంలోని హీమోగ్లోబింతో కలిసిపోతుంది. ఫలితంగా ఆక్సిజన్ శరీరభాగాలకు సరఫరా అవదు. దీనితో మెదడుకు ఆక్సిజన్ అందక ఊపిరాడదు. అందుకే వీటిని గదిలోకి తేకపోవడమే మేలు.. బొగ్గుల నుంచి వచ్చే పొగ వల్ల ఇలా జరుగుతోంది... మేం వాడేది రూమ్ హీటర్ పర్లేదు అనుకుంటున్నారేమో! అదీ ప్రమాదమే. చర్మం పొడిబారడం, కళ్లు మంటలు గమనించారా? అన్ని రూమ్‌టర్ చలవే రోజులో కొద్దిసేపు వాడేవారిలో ఈ లక్షణాలు కనిపిస్తాయి. రాత్రంతా వాడేవారికి అసిఫిక్సీయా అంటే నిద్రలోనే చనిపోవడానికి కారణం. దీన్నుంచీ కార్బన్ మోనాక్సైడ్ విడుదల అవుతుంది. అందుకే వెచ్చదనం కోసం ఉపయోగించుకున్నా... అది కొద్దిసేపటికే పరిమితమవ్వాలి. కాస్త పరిమితి పెరిగినా తలనొప్పి, కళ్లు తిరగడం, కడుపులో నొప్పి, వాంతులు వగైరా కనిపిస్తాయి.



# అమ్మ ఎవరికైనా అమ్మ

ఆధ్యాత్మికం

సాయి అపార కరుణకు నోచుకున్న కుటుంబాలలో ఒకటి సాయి సచ్చరిత్ర రచయిత హేమాడ్‌పంత్ కుటుంబం ఒకటి. హేమాడ్‌పంత్ కుమార్తె కృషాబాయి. ఆమెకు 1861లో రాజారాం వాలవాలకర్ తో వివాహమైంది. కాన్పు కష్టమవుతుందని హేమాడ్‌పంత్ భయపడ్డాడు. అట్లానే జరిగింది. సాయి ఉండగ దైన్యమేల? సాయి ఆయనకు ధైర్యానిచ్చారు. బిడ్డ జన్మించాడు. పాలు త్రాగడు. పసిబిడ్డను తెచ్చి సాయి చరణాల వద్ద ఉంచాడు హేమాడ్‌పత్. అంతవరకు పాలు తాగని ఆ పసిబిడ్డ నోటిలో తన అంగుష్టాన్నుంచాడు సాయి. ఆ పసికందు అంగుష్టానుంచి వచ్చిన పాలను త్రాగాడు! అది సాయి అమృత హస్తం. ఆ చిన్నవాడు సాయి భక్తుడైనాడు. అనంతీ ప్రభు వాలవాలకర్ అతని నామం, సాయి అతనికి సిద్ధులను కూడా ప్రసాదించారు. ఆయన షిరిడీని దర్శించే వాడు. ఒకసారి ఆయన తల్లికి జబ్బు చేసింది. ఇక ఆమె కాలం సమీపిం చిందని అనంత గ్రహించాడు. ఆమెకు ఒక మంత్రాన్ని ఉపదేశించి షిరిడికి బయలుదే రాడు. ఆమె ఆ మంత్రాన్ని జపించ సాగింది. అనంత షిరిడి చేరి సాయి సమాధి మందిరం లో శ్రీ సాయి సచ్చరిత్ర (తన తాత వ్రాసినదే) పారా యణ చేయసాగాడు. పారాయణ కొనసాగు తోంది. ఒక రోజు పారాయణ చేస్తుండగా తన తల్లి ఆరోగ్యం చరమ స్థాయికి చేరుకున్నదని తంతి వచ్చింది. మాతృదేవో భవ అని కదా సూక్తి.



సర్వసంగపరిత్యాగి అయిన ఆది శంకరులకు ఇటువంటి పరిస్థితే కలిగింది. తల్లి అవసాన కాలమున నీ వద్దకు వత్తునని శంకరులు తల్లికి మాట ఇచ్చారు. తన యోగ మహిమచే సూక్ష్మ శరీరంతో తన తల్లి వద్దకు చేరాడు ఆది శంకరుడు. కానీ, అనంతకు అట్టి శక్తులు లేవు. దూరం ఎంతో ఉన్నది. సమయం తక్కువ. పరబ్రహ్మ స్వరూపి సాయికి తల్లిదండ్రులున్నా లేకున్నా మాతృ దేవికి పెద్ద పీట వేయిస్తాడు భక్తులతో. వెంటనే సాయి ఒక గుర్రాన్ని తెచ్చాడు. దానిపై సాయి, అనంతలు వాయు వేగ మనోవేగాల తో దాదర్‌లో ఉన్న తల్లి వద్దకు చేరి తల్లిని సంతోషపంచాడు. ఆమె సాయిలో లీనమైంది. అనంత ఆ తర్వాత కాలంలో దేవ్‌బాబా అయ్యాడు. దేవ్‌బాబా 25 మే, 1894లో సాయిలో ఐక్యం అయ్యాడు. మనం మనకి జన్మ నొసంగిన మాతృ మూర్తికి సపర్యలు చేసి కొంతైనా ఆమె రుణం తీర్చుకుంటే సాయి మనకు ఆశీర్వదిస్తాడు.

**- యం.పి.సాయినాథ్**

## ఆట

# వన్డే ర్యాంకింగ్స్‌లో రోహిత్ నం.2

## అగ్రస్థానంలో కొనసాగుతున్న గిల్







**న్యూఢిల్లీ:** టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ వన్డే భవిష్యత్ సందిగ్ధం కొనసాగుతుండగా, మరోవైపు ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో మాత్రం హిట్‌మ్యాన్ తన స్థానాన్ని మెరుగుపరచుకున్నాడు. గత ఐదు నెలలుగా 50 ఓవర్ల క్రికెట్‌కు రోహిత్ దూరంగా ఉన్నప్పటికీ బుధవారం విడుదల చేసిన ఐసిసి ర్యాంకింగ్స్‌లో రెండో స్థానానికి చేరుకున్నాడు. వెస్టిండీస్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో దారుణంగా విఫలమైన పాకిస్థాన్ మాజీ కెప్టెన్ బాబర్ అజం 5 రేటింగ్ పాయింట్లు కోల్పోయి మూడో ర్యాంక్‌కు పడిపోయాడు. ఈ క్రమంలో రోహిత్ 756 రేటింగ్ పాయింట్లతో బాబర్ ర్యాంక్‌ను ఆక్రమించాడు. రోహిత్ చివరిగా ఛాంపియన్స్ ట్రోఫీ-2025లో భారత్ తరపున ఆడాడు. తన అద్భుతమైన నాయకత్వంతో భారత్‌కు ఏడో ఐసీసీ టైటిల్‌ను అందించాడు. ఈ మెగా టోర్నీలో రోహిత్ ఐదు మ్యాచ్‌లు ఆడి 180 పరుగులు చేశాడు. భారత్ తరపున అత్యధిక పరుగులు చేసిన జాబితాలో రోహిత్ నాలుగో స్థానంలో నిలిచాడు. బాబర్ ఖాతాలో ప్రస్తుతం 751 రేటింగ్ పాయింట్లు ఉన్నాయి. కాగా ఐసీసీ వన్డే బ్యాటర్ల ర్యాంకింగ్స్ అగ్రస్థానంలో టీమిండియా టెస్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ 784 రేటింగ్ పాయింట్లతో కొనసాగుతున్నాడు. ఇక టీమిండియా రన్ మిషన్ విరాట్ కోహ్లీ నాల్గవ స్థానంలో నిలిచాడు.



## పురుషుల హాకీ నేషనల్స్.. తొలిరోజు ఆరు జట్లు విజయం

### తెలంగాణ జట్టు 1-1తో డ్రా

**న్యూఢిల్లీ:** జూనియర్ పురుషుల హాకీ నేషనల్స్ టోర్నమెంట్‌లో వివిధ రాష్ట్రాలకు చెందిన ఆరు జట్లు మొదటి రోజు విజయం సాధించాయి. పుదుచ్చేరి, తెలంగాణ హాకీ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రా గా ముగిసింది. నాలుగు డివిజన్ సి. మూడు డివిజన్ బి లీగ్ మ్యాచ్‌లతో ప్రారంభమైన 15వ హాకీ ఇండియా జూనియర్ పురుషుల జాతీయ ఛాంపియన్‌షిప్-2025లో పంజాబ్, కేరళ హాకీ, ఛత్తీస్‌గఢ్ హాకీ, హాకీ రాజ్ డివిజన్ సి లో తమ తమ మ్యాచ్‌లను గెలుచుకోగా, హాకీ అరుణాచల్, హాకీ బెంగాల్ మరియు ఢిల్లీ డివిజన్ బి లో గెలిచాయి. కేరళ హాకీ తరఫున (57) అద్భుతమైన హ్యాట్రిక్‌లు సాధించారు. అభిషేక్ యాదవ్ (29, 45), షాలిక్ కెఎస్ (23), అభినంద్ పిఎస్ (30), ఆదిత్య కుమార్ (52) కూడా విజేత జట్టుకు గోల్స్ అందించారు. త్రిపుర హాకీ తరఫున కెప్టెన్ కలై కగేంద్ర (46) ఏకైక గోల్ చేశాడు. రెండవ మ్యాచ్‌లో పుదుచ్చేరి హాకీ, తెలంగాణ హాకీ జట్లు తమ పూల్ ఎ ఆటలో 1-1తో డ్రాగా ముగిసిన తర్వాత పాయింట్లను పంచుకున్నాయి. తెలంగాణ హాకీ తరపున మనోజ్ అగ్గు (10) మొదటి క్వార్టర్‌లో గోల్ చేయగా, రెండవ క్వార్టర్‌లో అన్బుపతి (28) ఈక్వలైజర్ సాధించి మ్యాచ్‌ను టైగా ముగించాడు. డివిజన్ సి లోని పూల్ బి లో, ఛత్తీస్‌గఢ్ హాకీ జట్టు గోవా హాకీపై 5-1 తేడాతో ఘన విజయం సాధించింది. కెప్టెన్ మోహిత్ నాయక్ (20, 60) తన జట్టు తరపున కీలకమైన 2 గోల్స్ సాధించగా, ఓం కుమార్ యాదవ్ (17), సుమిత్ మింజ్ (25), రితిక్ యాదవ్ (42) కూడా స్కోర్‌షీట్‌లో ఉన్నారు.

## స్టార్ ప్లేయర్లకు నో ఛాన్స్

### జైస్వాల్ నుండి రాహల్ వరకు ప్లేస్ నిల్

### ఆసియా కప్: చివరి దశకు టీమ్ఇండియా కసరత్తు

**న్యూఢిల్లీ:** ఇంగ్లాండ్ సిరీస్ ముగియడంతో ఇప్పుడు అందరి దృష్టి ఆసియా కప్-2025పై నిలిచింది. సెప్టెంబర్ 9వ తేదీ నుంచి ఈ మెగాటోర్నీ ప్రారంభం కానుంది. వచ్చే ఏడాది టీ20 ప్రపంచ కప్ జరగనుండడంతో ఈ మెగా టోర్నీని ఇదే ఫార్మాట్‌లో నిర్వహించనున్నారు. కాగా ఈ టోర్నీలో పాల్గొనే భారత జట్టు కసరత్తుకు సంబంధించి ఈ నెల 20 నాటికి పూర్తి కానుంది. టీమ్ఇండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ బెంగళూరులోని నేషనల్ క్రికెట్ అకాడమీలో ఇప్పటికే సాధన ప్రారంభించాడు. అతడి ఫిట్‌నెస్‌ను సెలక్టర్లు పరిశీలిస్తున్నారు. ఇక ఆసియా కప్ జట్టులో పెద్దగా మార్పులు ఉండబోవని సమాచారం. అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యాలు కూడిన బ్యాటింగ్ లైనప్



దాదాపుగా ఖాయం చేశారు. అభిషేక్ శర్మ ప్రస్తుతం టీ20 ర్యాకింగ్స్‌లో అగ్రస్థానంలో ఉండగా, సంజూ శాంసన్ గత పర్యటనల్లో అటు బ్యాటింగ్, ఇటు కీపింగ్‌లో అద్భుతంగా రాణించాడు. అలాగే టీమ్ఇండియా టెస్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. ఐపీఎల్‌లోనూ అతడు రాణించాడు. ఈ క్రమంలో ఒక్కో స్థానానికి ఎక్కువ ప్రత్యామ్నాయాలు ఉండడంతో జట్టు ఎంపిక సెలక్టర్లకు పెద్ద తలనొప్పి అయింది. టాప్ ఆర్డర్‌లో చాలా మంది ఉండడంతో యువ ఆటగాళ్లు యశస్వి జైస్వాల్, సాయి సుదర్శన్‌లకు చోటు కష్టమనే చెప్పాలి. వన్డేల్లో ప్రధాన వికెట్ కీపర్‌గా ఉన్న కేఎల్ రాహుల్‌కు కూడా చోటు కష్టంగానే ఉంది. ప్రధాన వికెట్ కీపర్‌గా శాంసన్‌తో పాటు, ధ్రువ్ జురెల్, జితేశ్ శర్మలలో ఒకరికి రెండో కీపర్‌గా అవకాశం ఇస్తున్నారు. పేస్ ఆల్‌రౌండర్‌గా హార్దిక్ పాండ్యాను కొనసాగిస్తున్నారు. ఇంగ్లాండ్ టెస్టు సిరీస్‌లో నితీశ్ కుమార్ గాయపడటంతో, ఇంకా దీని నుంచి కోలుకోలేదు. దీంతో అతడిని పరిగణలోకి తీసుకోవడం లేదు. స్పిన్ ఆల్‌రౌండర్లుగా అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్‌లకు చోటు ఖాయమైంది. స్పెషలిస్ట్ స్పిన్నర్‌గా కుల్దీప్ యాదవ్‌కు చోటు దక్కనుంది. పేస్ విభాగంలో బుమ్రాతో పాటు, అర్ష్‌దీప్ సింగ్, మూడో పేసర్ కావాలనుకుంటే ప్రసిద్ధ్ కృష్, హర్షిత్ రాణాలలో ఒకరికి చోటు కల్పిస్తున్నారు.



## సిన్సినాటి ఓపెన్‌లో... భాంబ్రీ జోడీ నిష్క్రమణ

### ఇప్పటికే బోపన్న ద్వయం ఓటమి

**న్యూఢిల్లీ:** సిన్సినాటి ఓపెన్-2025, పురుషుల డబుల్స్ మొదటి రౌండ్‌లోనే భారత్ డబుల్స్ స్టార్ యుకీ భాంబ్రీ నిష్క్రమించాడు. ఈ ఎటిపి మాస్టర్స్ టోర్నమెంట్‌లో న్యూజిలాండ్‌కు చెందిన మైఖేల్ వీనస్‌తో జతకట్టిన యుకీ మూడు సెట్ల ఓటమిని ఎదుర్కొన్నాడు. బుధవారం అమెరికాలోని ఒహియోలోని లిండ్నర్ ఫ్యామిలీ టెన్నిస్ సెంటర్‌లో జరిగిన సిన్సినాటి ఓపెన్ తొలి రౌండ్‌లో భాంబ్రీ-మైఖేల్ ద్వయం తొలి సెట్ గెలిచినప్పటికీ 6-3, 6-7, 4-10 తేడాతో పోర్చుగల్‌కు చెందిన ఫ్రాన్సిస్కో కాబ్రాల్-ఆస్ట్రియాకు చెందిన లూకాస్ మిడ్లర్‌ల ప్రత్యామ్నాయ జత చేతిలో 1 గంట 50 నిమిషాల పాటు జరిగిన మ్యాచ్‌లో హోరా హోరీగా పోరాడి ఓడిపోయారు. ఈ ఉత్తర అమెరికా పర్యటనలో ఇండోకివీ జంటకు ఇది నాల్గవ మ్యాచ్‌లో మూడో ఓటమి. యుకీ-వీనస్ మ్యాచ్‌లో మంచి ఆరంభాన్ని సాధించారు, మొదటి సెట్‌ను 6-3 తేడాతో సునాయాసంగా గెలుచుకున్నారు. కానీ ఆ తర్వాత మ్యాచ్‌లో పట్టు కోల్పోయారు. రెండవ సెట్‌లో నాలుగు డబుల్ ఫాల్ట్‌లతో సహా బహుళ అన్‌ఫోర్స్‌డ్ ఎర్రర్‌లను చేశారు. ఈ పోరులో ఎదురొడ్డి ఏడు పాయింట్ల భారీ లోటుతో 2-9తో ఓడిపోయారు. రెండు మ్యాచ్ పాయింట్లను ఆదా చేసినప్పటికీ వారు నిర్ణయాత్మక ఆటను కోల్పోయారు. అంతకు ముందు, భారత అనుభవజ్ఞుడు రోహన్ బోపన్న, అతని అమెరికన్ భాగస్వామి ఈథన్ క్విన్ కూడా టోర్నమెంట్ నుండి నిష్క్రమించారు, ఎటిపి మాస్టర్స్ 1000 టోర్నమెంట్ యొక్క మొదటి రౌండ్లోనే భారతదేశం యొక్క ప్రచారాన్ని ముగించారు.

## మహిళల 50 ఓవర్ల మ్యాచ్‌లో భారత్ విక్టరీ

### 3 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియా ఓటమి



న్యూఢిల్లీ: మహిళల తొలి 50 ఓవర్ల మ్యాచ్‌లో ఆస్ట్రేలియాపై భారత్ విజయం సాధించింది. ఇండియా మూడు టి 20లలో ఓడిపోయిన తర్వాత ఈ విజయం సాధించింది. బ్రిస్బేన్‌లోని ఇయాన్ హీలీ ఓవల్‌లో బుధవారం జరిగిన తొలి మ్యాచ్‌లో కెప్టెన్ రాధా యాదవ్ బంతిని 3-45తో అద్భుతంగా ఆడింది. యస్తిక భాటియా, షఫాలీ వర్మల 77 పరుగుల ఓపెనింగ్ భాగస్వామ్యం ఆస్ట్రేలియాను మూడు వికెట్ల తేడాతో ఓడించింది. మొదట బౌలింగ్ లోకి దిగిన ఇండియా మెరుగైన బౌలింగ్‌తో ఆస్ట్రేలియాను 47.5 ఓవర్లలో 214 పరుగులకు ఆలౌట్ చేసింది. రాధాతో పాటు, మిన్ను మణి, టైటాస్ సాధు 2 వికెట్లు పడగొట్టారు. ఛేజింగ్‌లో యాస్తిక 70 బంతుల్లో 59 పరుగులు చేయగా, షఫాలి 31 బంతుల్లో 36 పరుగులు చేసింది. వారి 77 పరుగుల ఓపెనింగ్ భాగస్వామ్యం కేవలం 10.4 ఓవర్లలోనే ముగిసింది. రాఘవ్వీ బిస్ట్ 25 పరుగులతో అజేయంగా నిలిచింది. ఇంకా 8 ఓవర్లు మిగిలి ఉండగానే భారత్ విజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్ ఎంచుకున్న ఆస్ట్రేలియా తొలి 10 ఓవర్లలోనే తహ్లియా విల్సన్, అలిస్సా హీలీ వెనుదిరిగారు. 12వ ఓవర్లో తహ్లియా మెక్‌గ్రాత్ వెనుదిరిగినప్పుడు వారి సమస్యలు మరింత పెరిగాయి. రాచెల్ ట్రెనామన్, అనికా లియరాయిడ్ 4 వికెట్‌కు 63 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఆ తర్వాత ఆమె 51 పరుగుల వద్ద ధారా గుజ్జర్ చేతిలో రనౌట్ అయింది. తదుపరి అనికా 90 బంతుల్లో 8 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 92 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచింది. ఛేజింగ్‌లో షఫాలి వేగంగా స్కోరింగ్ చేస్తూ 36 పరుగులు చేసింది. యాస్టిక, కిమ్ గార్త్ చేతిలో బౌలింగ్ వేయడానికి ముందు తన ఇన్నింగ్స్‌లో 7 ఫోర్లు కొట్టింది.

## వాణిజ్యం

## సెన్సెక్స్ నిఫ్టీలకు ఆసియా సూచీల మద్దతు

### లాభాల్లో ముగిసిన ఈక్విటీ మార్కెట్లు

**ముంబయి, ఆగస్టు 13:** భారత్‌స్టాక్ మార్కెట్ సూచీలు మూడోరోజు లాభాల్లో ముగిసాయి. ఆసియా మార్కెట్ల సానుకూల ధోరణులు, ఆటోమెటల్; ఫార్మా షేర్లలో కొనుగోళ్లు వంటి వాటితోసూచీలు రాణించాయి. అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాలు కూడా అంచనాలకు తగినట్లు రావడంతో సెప్టెంబరులో ఫెడ్ రిజర్వు వడ్డీరేట్లలోకోత ఉంటుందన్న అంచనాలతో ఆసియా మార్కెట్లతోపాటు మన మార్కెట్



సూచీలురాణించాయి. దేశీయంగాను రిటైల్‌ద్రవ్యోల్బణం 8 ఏళ్ల కనిష్టానికి చేరడం పాజిటివ్‌సెంటిమెంట్‌కు కారణం అయిందని అంచనా. ఈక్రమంలో నిఫ్టీ మళ్లీ 24,600 స్థాయికి చేరింది. ఆసియా మార్కెట్ల ధోరణులతో సెన్సెక్స్ ఉదయం 80, 492.17 పాయింట్లవదనద లాభాల్లో ప్రారంభం అయింది. రోజంతా లాభాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 80,683.74 పాయింట్లవద్ద గరిష్టాన్ని తాకినసూచీ చివరికి 304.32 పాయింట్ల లాభంతో 80,539.91వద్ద ముగిసింది. నిఫ్టీ 131. 95 పాయింట్ల లాభంతో 24,619.35వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 87.43గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో భెల్, ఎటెర్నెల్, కోటక్ మహీంద్ర బ్యాంకు, టాటామోటార్స్, మహీంద్ర అండ్ మహీంద్ర షేర్లు లాభాల్లోముగిసాయి. ఆదానిపోర్టులు, ఐటిసి అల్ట్రాటెక్‌సిమెంట్ డైటాన్ యాక్సిస్‌బ్యాంకు షేర్లు నష్టాల్లో ముగిసాయి. అంతర్జాతీయవిపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్‌దర 65.68 డాలర్లవద్ద కొనసాగుతుండగా బంగారం ఔన్స్ ఒక్కింటికి 3364.10 డాలర్లవద్దట్రేడ్ అవుతోంది.

### పంద్రాగస్టునుంచి ఎస్‌బిఐ ఐఎంపిఎస్


## సేవల రుసుం పెంపు!



**ముంబయి, ఆగస్టు 13:** భారతీయ స్టేట్ బ్యాంకు తన తక్షణ చెల్లింపుల సేవలు ఐఎంపిఎస్ లావాదేవీల ఛార్జిలను సవరించనున్నట్లుప్రకటించింది. ఈనెల 15వ తేదీనుంచి రిటైల్‌కస్టమర్లకు ఐఎంపిఎస్‌సేవల్లో సవరణలు ఉంటాయని వెల్లడించింది. ఎక్కువ మొత్తం బదలీలకు ఈ కొత్త ఛార్జిలు వర్తిస్తాయి. అయితే కొన్ని లావాదేవీ లశ్లాబ్‌లు మాత్రం ఎలాంటి మార్పులుండవు. ఎక్కువ వవిలువలున్న ఐఎంపిఎస్ లావాదేవీలు 25 వేలకు మించి ఉంటే నామినల్ ఛార్జిలుమాత్రమే వేస్తున్నారు,. ఇపుడు ఇవన్నీ కూడా మారతాయి. ఇపుడు 25వేలవరకూ మాత్రమే నిల్‌ఛార్జిలుంటాయి. ఆన్‌లైన్ కస్టమర్లకు మాత్రం ఉచితంగానే ఉంటుంది. నిర్వహణ వ్యయాలను తగ్గించేందుకే ఈచర్యలుచేపట్టినట్లు చెపుతోంది. దేశవ్యాప్తంగా కస్టమర్లు తమ నిధులు బదలాయించుకునేసౌకర్యం ఎన్‌పిసిఐ కల్పించింది. లావాదేవీలపరిమితి ఐదు లక్షలుగా విధించింది. 25వేలకుపైబడిన లావాదేవీలనుంచి ఛార్జిలు మొదలవుతాయి. లక్ష వరకూ కూడా ఛారజ్జి రెండురూపాయలు ప్లస్ జిఎస్‌టి ఉంటుంది. ఒక లక్షనుంచి రెండు లక్షలవరకూ రూ.6 ప్లస్ జిఎస్‌టి, 2 లక్షలనుంచి ఐదు లక్షలరూపాయలవరకూ రూ.10 ప్లస్ జిఎస్టీ వంటివి వర్తిస్తాయని ఎస్‌బిఐ ప్రకటించింది. బ్రాంచ్ లావాదేవీలపరంగా ఎస్‌బిఐ ప్రస్తుతం ఉనన రూ.2 ప్లస్ జిఎస్టీని రూ.20 ప్లస్ జిఎస్టీకి సవరించింది. ప్రస్తుతం రిటైల్ కస్టమర్లకే పరిమితం అయిన ఈ ఛారజ్జిలు వచ్చే సెప్టెంబరు 8 నుంచి కార్పొరేట్‌కస్టమర్లకు కూడా వర్తింపచేస్తున్నట్లు తెలిపింది. గోల్డ్, డైమండ్, ప్లాటినమ్, రోడియమ్ ఖాతాలు, ప్రభుత్వశాఖలు, ఇతర ఏజెన్సీల ఖాతాలకు ఐఎంపిఎస్ ఛార్జిలనుంచి మినహాయింపు ఉంది.

### యుఎస్ ఖజానాకు

## 150 బిలియన్ డాలర్లు!




**వాషింగ్టన్, ఆగస్టు13:** అమెరికా అధ్యక్షుడుగా డొనాల్డ్‌ట్రంప్ వచ్చీరావడంతోనే ప్రవేశపెట్టిన ట్యారిఫ్‌లతో అమెరికాకోశాగారం కళకళలాడింది. గడచిన పదేళ్లలో ఇంత భారీ ఎత్తున నిధులు సమకూరిన దాఖలాలులేవని ఆర్థిక నిపుణులు చెపుతున్నారు. గతనెల 29వ తేదీనాటికి 150 బిలియన్ డాలర్లు సుంకాల వసూళ్లు ఉన్నట్లు వైట్‌హౌస్ ప్రకటించింది. ఒక్క జులైలోనే 28 బిలియన్ డాలర్లు సుంకాలరూపంలో వసూలు అయ్యాయి.ఏప్రిల్‌నుంచి ప్రారంభించిన భారీ సుంకాలతో అమెరికా ఖజానా కళకళలాడింది. అన్ని దిగుమతులపైనా కనీసం పదిశాతం సుంకం విదించారు. అదనపుసుంకాలపేరిట అమెరికా అధ్యక్షుడు 100శాతం సుంకాలు విదించిన దేశాలు కూడా ఉన్నాయి. దీనితో అమెరికా వాణిజ్యలోటు గణనీయంగా తగ్గిందని అంచనా. మొదటి నాలుగునెలల్లో సుమారు 100 బిలియన్ డాలర్లు సమకూరాయి. గత ఏడాది ఇదేకాలంలో సమకూరిన మొత్తం కంటే మూడురెట్లు అధికంగా ట్యారిఫ్‌లరూపంలో వసూళ్లు ఉన్నట్లు తేలింది. ఈ ట్యారిఫ్‌లతో అమెరికా ఖజానాకు సాలీనా 300 బిలియన్ డాలర్లవరకూ సమకూరుతాయని వాణిజ్య మంత్రి హోవార్డ్ లుత్నిక్ ప్రకటించారు. నెలవారీగా కూడా సగటున 50 బిలియన్ డాలర్లు వస్తాయని ఆయన చెప్పారు. దిగుమతులపరంగా ఇరుగుపొరుగు దేశాలనుంచి వస్తుంటే విదేశీ ఉత్పత్తులపై యుఎస్ కస్టమ్స్ బోర్డర్ ప్రొటెక్షన్ వ్యవస్థ ఓడరేవుల్లోనే వసూలుచేసి ట్రెజరీ విభాగం సాధారణ ఫండ్‌కు పంపిస్తుంది. ఇక కాంగ్రెస్ ప్రతినిధుల సభ ఈ మొత్తం ఎలా వ్యయంచేయాలన్నది నిర్ణయిస్తుంది. అయితే ఈ ట్యారిఫ్‌ల కారణంగా అమెరికాలోధరలు భారీగా పెరుగుతున్నాయి. ట్రంప్ పెంచిన సుంకాల భారాన్ని దిగుమతి దారులు, అమెరికా కంపెనీలు చివరకు వినియోగదారులపైనే వేస్తుండటంతో కొనుగోళ్ల భారం అయ్యాయి.

ట్యారిఫ్ రాబడుల వల్ల ఫెడరల్‌ప్రభుత్వ ఆర్థికలోటు 1.3 లక్షలకోట్ల డాలర్లను గణనీయంగా తగ్గించుకోవచ్చని అంచనా. ఈ ట్యారిఫ్‌లలోఅమెరికన్లకు రిబేట్ ఉంది. అయితే వీటిని ప్రతినిదులసభ ఆమోదించాలి. ట్రంప్ అమలుకనఉ తెచ్చిన వన్‌బిగ్ బ్యూటిఫుల్ బిల్‌ద్వారా వచ్చే దశాబ్దాకాలంలో 3.4లక్షలకోట్లు రుణఖాతాకు తోడవుతాయని నిపుణుల అంచనా. అయితే ట్యారిఫ్‌లవల్ల ఎగుమతిదేశాలు కూడా సుంకాలు విధిస్తాయని గతంలోచైనా ఉత్పత్తులపై 370 బిలియన్ డాలర్లమేర సుంకాలువేస్తే అమెరికా వ్యవసాయ ఎగుమతులపై 27 బిలియన్ డాలర్లమేర చైనా సుంకాలువేసింది. ట్రంప్ విధించిన ట్యారిఫ్ రాబడులు అమెరికా రుణభారాన్ని పూర్తిగా భర్తీచేయలేవు. మొత్తం దేశ రుణభారం 36 లక్షలకోట్ల డాలర్లుగా ఉంది. ఆర్థికవేత్తలు ఇప్పటికే హెచ్చరికలుచేస్తున్నారు.

## గూగుల్‌క్రోమ్ కొనుగోలుకు పర్‌ప్లెక్సిటీ స్టార్టప్ రెడీ!

### 34.5 బిలియన్ డాలర్లకు ఆఫర్



**న్యూఢిల్లీ, ఆగస్టు 13:** కృత్రిమ మేథ స్టార్టప్ కంపెనీ పర్‌ప్లెక్సిటీ ప్రపంచంలోనే ప్రజాదరణ కలిగిన ఓపెన్‌సోర్స్ వెబ్‌బ్రౌజర్ గూగుల్‌క్రోమ్‌ను కొనేందుకు ఆసక్తిచూపింది. అరవింద్ శ్రీనివాస్ నేతృత్వంలోని ఈ కంపెనీ గూగుల్‌కి మొత్తం 34.5 బిలియన్ డాలర్లు ఆఫర్‌చేసింది. ఈమొత్తం ఆ కంపెనీ విలువ లకంటే ఎక్కువగా ఉంది. బ్రౌజర్ పరంగా గూగుల్ క్రోమ్ గుత్తాధిపత్యంలో ఉంది. దాన్ని అమ్మేయాలని అమెరికా ప్రభుత్వంనుంచి ఒత్తిడికూడా పెరుగుతోంది. ఈక్రమంలోనే పర్‌ప్లెక్సిటీ భారీ ఆఫర్ ప్రకటించింది. డీల్‌కోసం సంస్థ బయటి ఇన్వెస్టర్ల సాయం తీసుకుంటున్నది. బహుళ పెట్టుబడిదారులు పూర్తిగా ఫైనాన్స్ చేయడానికి అంగీకరించినట్లు కంపెనీసిబిఒ దిమిత్రి షెవెలెంకో చెప్పారు. కంపెనీ జూలైలోనే 100 మిలియన్ డాలర్లు సేకరించింది. ఆ ఫండింగ్‌రౌండ్‌లో కంపెనీ మొత్తం విలువ సుమారు రూ.1.57 లక్షలకోట్లుగా లెక్కించారు. ఆలెక్కనచూస్తే కంపెనీ విలువ కంటేగూగుల్‌క్రోమ్‌కు ఆఫర్‌చేసిన మొత్తం రెట్టింపు అని భావించాలి. క్రోమ్‌కోర్ ఇంజిన్ అయిన క్రోమియంనును ఓపెన్‌సోర్స్‌గా కొనసాగిస్తాయని, ఏటా సుమారు 3 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెడతాయని హామీ ఇచ్చింది. ఈ డీల్ విజయవంతమైతే పర్‌ప్లక్సిటీని వినియోగదారుల డిఫాల్ట్ సెర్చ్ ఇంజిన్‌గా మార్చబోమనిగూగుల్‌క్రోమ్‌నే ఉంచుతామని వెల్లడించింది. అయితే క్రోమ్ విక్రయాలపై క్లారిటీలేదు. క్రోమ్‌బ్రౌజర్‌పరంగా గూగుల్ గుత్తాధిపత్యం కోసంయత్నించిందన్న ఆరోపణలునిజమేనని కొలంబియా జిల్లాకోర్టు తేల్చింది. శాంసంగ్, యాపిల్‌సహా బడా కంపెనీలతోగూగుల్ ఒప్పందాలుచేసుకుందని తర్వాత గూగుల్ సెర్చ్ డిఫాల్ట్‌గా ఉండేటట్లు వారికి చెల్లింపులుచేసిందని ఆరోపిస్తు యుఎస్.జస్టిస్ డిపార్టుమెంట్‌తోపాటు కొన్ని రాష్ట్రాలు కోర్టుకెక్కాయి. కాగా పర్‌ప్లెక్సిటీ కృత్రిమ మేధ ఆధారంగాపనిచేసే సర్చ్ఇంజన్, చాట్‌జిపిటి తరహా యాప్ ఇది కామెట్‌పేరుతోబ్రౌజర్ సేవలు కూడా అందిస్తోంది. 2026 నాటికి ఈ బ్రౌజర్‌పదికోట్ల నుంచి వందలకోట్ల యూజర్లను చేరుకోవాలని కంపెనీ టార్గెట్ పెట్టుకుంది. ఇందుకోసం స్మార్ట్‌ఫోన్ తయారీదారులతో చర్చలుజరుపుతోంది.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.